

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


కొరియన్ లవ్ గేమ్‌కు బానిసలైన అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య 05

జెఫ్రీ ఎప్‌స్టిన్ పత్రాలు మానసిక క్షోభతో విడాకులు తీసుకున్న : మిలిందా 02


సంపుటి 09, సంచిక: 68 | గురువారం | 05-02-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## మహిళా న్యాయవాది దారుణ హత్య

భూ తగాదాల కారణంగా చెల్లెలిపై దారుణానికి ఒడిగట్టిన అన్న

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో ఘటన

ప్రజాపక్షం/రంగారెడ్డి



ఆస్తుల విషయంలో రక్తసంబంధాలను మరిచి కొందరు కర్కశంగా ప్రవర్తిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో యువ మహిళా న్యాయవాదిని స్వంత అన్న దారుణంగా హత్య చేశాడు.చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న స్వప్న పొలం వద్ద భూ సర్వే చేయిస్తుండగా తరువాయి 2లో

# కొత్త బడ్జెట్‌లో పేదలకు లక్షలాది ఇళ్లు



- రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం
- సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరూ ఆపలేరు
- నల్లగొండ జిల్లాపై కోపంతో ఎస్‌ఎల్‌బిసిని పక్కనపెట్టారు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్‌కు సిట్ నోటీసులిస్తే జాతిపితకు నోటీసు ఇస్తారా? అని ఎదురుతిరగడం ఏమిటి?
- మిర్యాలగూడలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావుపై నిప్పులు

> ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్‌కు సిట్ నోటీసులిస్తే జాతిపితకు నోటీసు ఇస్తారా? అని ఎదురుదాడికి దిగడమేమిటీ? కెసిఆర్ మీ జాతికి పిత కావచ్చు. అయినా మీ జాతితో ప్రజలకు ఏం పని? హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, కృష్ణారావు, వినోద్ రావు వంటి నేతలు మీ జాతి కావచ్చు. ఘోర నేరాలు చేస్తే పోలీసులు ముసుగు తొడిగి పట్టుకుని వస్తారు. హరీశ్‌రావు, కెటిఆర్‌లను అలాగే పట్టుకుని రావాల్సి ఉంది.
> – సిఎం

ప్రజాపక్షం/నల్లగొండ



రాష్ట్రంలో అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగిందన్న రేవంత్ రెడ్డి 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. బుధవారం మిర్యాలగూడ మండలం గూడురులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభలో సిఎం మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదు రే లేదని, ఎవరూ తమ విజయాన్ని అడ్డుకోలేరని చెప్పారు. రాష్ట్రంలోని అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, నియోజకవర్గానికి 4.5 లక్షల ఇళ్లను పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో పెట్టబోయే కొత్త బడ్జెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తామన్నారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్లపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదన్న ఆయన రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయండని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందు వరసలో ఉందన్నారు. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10లక్షల కోట్లు ఖర్చు చేశామని, పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదన్నారు. బిఆర్ఎస్ శ్రేణుల కూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం, సన్నబియ్యం ఇ స్తున్నామని చెప్పారు. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్‌ఎల్‌బిసిని ప్రాజెక్టును పక్కనపెట్టారని, ఇక్కడి ప్రజలు విషపు నీళ్లు తాగడానికి బిఆర్ఎస్ కారణం కాదా అని ప్రశ్నించారు. రెండేళ్లలో పూర్తిచేసే లక్ష్యంతో ఎస్‌ఎల్‌బిసి పనులు చేపట్టామని ఈ క్రమంలో జరిగిన ప్రమాదంలో 8 మంది చనిపోయారని గుర్తుచేశారు. ఎస్‌ఎల్‌బిసి ఆగిపోతే మామ, అల్లుళ్ల దావతు చేసుకున్నారన్నా ఆయన నల్గొండపై విషం చిమ్ముతున్న బిఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కు ఉందా? అని విమర్శలు గుప్పించారు. ఆడబిడ్డలకు రూ.27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తరువాయి 2లో

## 'సర్' పై జోక్యం చేసుకుని... ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- సుప్రీంకోర్టులో స్వయంగా వాదనలు వినిపించిన పశ్చిమబెంగాల్ సిఎం మమత బెనర్జీ
- 'ఇసి' రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని, ప్రజలను బుల్డోజ్ చేస్తోందని ఆరోపణ
- బెంగాల్‌కు ఎక్కడా న్యాయం జరగడంలేదని, 'ఇసి'కి 6సార్లు లేఖలు రాసినా ఫలితం లేదని మొర



**న్యూఢిల్లీ :** పశ్చిమబెంగాల్ రాష్ట్రాన్ని ఎన్నికల సంఘం (ఇసి) లక్ష్యంగా చేసుకుని, రాష్ట్ర ప్రజలను అణచివేస్తున్నదని బుధవారం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుకు మొరపెట్టుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితాలలో జోక్యం చేసుకోవాలని ఆమె సుప్రీంకోర్టును కోరారు. తమ రాష్ట్రాన్ని ఇసి లక్ష్యంగా చేసుకుని ప్రజలను బుల్డోజ్ చేస్తున్నదని ముఖ్యమంత్రి తీవ్రంగా ఆరోపించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై విచారణలో భాగంగా సిఎం మమతా బెనర్జీ సుప్రీం కోర్టులో స్వయంగా వాదనలు వినిపించారు. ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను, ముఖ్యమంత్రి చేసిన అరుదైన వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విషయమై స్పందించింది. 'నిజమైన వ్యక్తులు ఓటర్ల జాబితాలలో ఉండాలి' అని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, విపుల్ ఎం.పంచోలితో కూడిన ధర్మాసనం ఆమె పిటిషన్‌పై ఎన్నికల సంఘం(ఇసి), పశ్చి మ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసులు జారీ చేసి, ఫిబ్రవరి 9లోగా సమాధానం ఇవ్వాలని కోరింది. పశ్చిమబెంగాల్‌ను లక్ష్యం గా చేసుకుంటున్నారని, అసోంలో ఇదే కొలమానం ఎందుకు వర్తింపజేయడం లేదని అడిగారు. వారు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఆ రాష్ట్ర ప్రజలను బుల్‌డోజ్ చేస్తున్నారన్న ఆమె ఆరోపణలపై మమతా బెనర్జీ తరఫు న్యాయవాది, సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్‌లు వాదనలను తరువాయి 2లో

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలను అడ్డుకోవడం ఎవరితరం కాదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని 03





## డిజిటల్ అరెస్ట్ రూ.1.07కోట్లు కాజేత

ఢిల్లీకి చెందిన నిందితుడి అరెస్ట్

ప్రజాపక్షం/హైదరాబాద్

అమాయక ప్రజలను 'డిజిటల్ అరెస్ట్' పేరుతో భయభ్రాంతులకు గురిచేసి, కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఢిల్లీ నివాసి గురుదీప్ సింగ్ అలియాస్ లక్కీ నారంగ్ (42)ను తరువాయి 12లో

### భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంలో

## ఆహారం, వ్యవసాయ ఉత్పత్తులకు పూర్తి రక్షణ

- నిరసనలమధ్య పార్లమెంటులో మంత్రి గోయల్ ప్రకటన
- ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వని స్పీకర్




**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో ఆహారం,వ్యవసాయం వంటి కీలకమైన, సున్నితమైన ఉత్పత్తులన్నింటికీ పూర్తి రక్షణలు ఉ న్నాయని వాణిజ్య–పరిశ్రమలశాఖ కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ పార్లమెంటుకు చెప్పారు. అదేవిధంగా ఈ ఒప్పందంవల్ల మనదేశంలో ఉన్న సూ క్ష్మ ,చిన్న,మధ్యతరహా ఔత్సాహిక పరిశ్రమలకు, నైపుణ్యంగల కార్మికులకు, పరిశ్రమకు, అడ్వాన్స్ డ్ టెక్నాలజీలోనూ సరికొత్త అవకాశాలకు తలుపులు తెరచుకుంటాయన్నారు. అమెరికా మార్కెట్ లో ఎగుమతి పోటీతత్వం పెరుగుతుందని ప్రతిపక్షాల నిరసనలమధ్య మొదట లోక్‌సభలో, తర్వాత రాజ్యసభలో మంత్రి పీయూశ్ బుధవారం ప్రకటనలు చేశారు. అమెరికా–భారత్ మధ్య కుదిరిన వాణిజ్య తరువాయి 12లో

# బాధ్యతల నుంచి మోదీ తప్పించుకున్నారు

> 'మన సరిహద్దుల్లోకి చైనా సైన్యం ప్రవేశించినప్పుడు, అటువంటి క్లిష్ట సమయంలో ఆర్మీ చీఫ్‌ను వేచి ఉండేలా చేశారని ఈ పుస్తకంలో స్పష్టంగా పేర్కొనబడింది. నిర్ణయం తీసుకునే సమయం వచ్చినప్పుడు, ప్రధానమంత్రి కేవలం 'మీకు ఏది సరైనదనిపిస్తే అది చేయండి' అని తప్పించుకున్నారు

- 2020లో భారత్-చైనా సంఘర్షణ సమయంలో భారాన్ని నరవణపై మోపారు : రాహుల్‌గాంధీ విమర్శ
- పార్లమెంట్ భవన సముదాయ ప్రాంగణంలో మాజీ ఆర్మీ చీఫ్ 'ఆత్మకథ' పుస్తకాన్ని ప్రదర్శించిన ప్రతిపక్షనేత
- ప్రధాని మోదీకి జనరల్ నరవణే రాసిన పుస్తకం అందజేస్తానని వెల్లడి




**న్యూఢిల్లీ :** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన విడుదలకాని 'ఆత్మకథ'లోని అంశాలను మరోసారి ప్రస్తావించారు. 2020లో భారత్–చైనా సంఘర్షణ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యత నుండి తప్పించుకుని, ఆ భారాన్ని నరవణేపై మోపారని ఆరోపించారు. పార్లమెంట్ భవన సముదాయ ప్రాంగణంలో రాహుల్‌గాంధీ విలేకరులతో మాట్లాడుతూ, విడుదల కాని నరవణే ఆత్మకథను చేతిలో పట్టుకుని ప్రభుత్వం దీనికి విరుద్ధంగా చెబుతున్నప్పటికీ, ఈ పుస్తకం ఉనికిలో ఉందని భారతదేశంలోని యువత తెలుసుకోవాలని తాను కోరుకుంటున్నానన్నారు. 'ఈ పుస్తకం ఉనికిలో లేదని స్పీకర్ చెప్పారు, ప్రభుత్వం, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జీ కూడా ఈ పుస్తకం ఉనికిలో లేదని చెప్పారు. భారతదేశంలోని ప్రతి యు వకుడు ఈ పుస్తకం ఉనికిలో ఉందని గమనించాలి' అని అన్నారు. లద్ధాఖ్‌లో తరువాయి 2లో



## మిర్చి క్వింటాల్ @ రూ.37,100


వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో ఆల్ టైం రికార్డు ధర

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చికి ఆల్ టైమ్ రికార్డు ధర నమోదైంది. వండర్ హాట్ మిర్చి ధర క్వింటాల్‌కు రూ.37,100గా రికార్డు స్థాయిలో పలికింది. బుధవారం రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన మిర్చికి ఈ ధర వచ్చింది. గత నెల రోజులుగా రైతులు తీసుకువస్తున్న మిర్చికి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. తేజ మిర్చి రూ.19,000 నుంచి రూ.20,000 క్వింటాలు వరకు పలుకుతోంది. వండర్ హాట్ మిర్చి ధర తరువాయి 12లో

## ఎసిబికి చిక్కిన అవినీతి తిమింగలం

- రూ.15లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కూకట్‌పల్లి జోన్ ఎస్ఇ
- మరో ఘటనలో జూనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్న అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో బుధవారం ఇద్దరు లంచాధికారులు ఎసిబికి చిక్కారు కూకట్‌పల్లి జోన్‌కు చెందిన సూపరింటెండెంగ్ ఇంజినీర్ (ఎస్ఇ) పొద్దులూరి చిన్నారెడ్డి, బండ్లగూడా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శివప్రసాద్‌లు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) కూకట్‌పల్లి జోన్‌లో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) తరువాయి 12లో



## మే 21,22 తేదీల్లో టిజిడిఇఇసెట్ -2026 పరీక్షలు

టిజి డిఈఈసెట్– 2026 పరీక్ష తేదీలనుఅధికారులు ప్రకటించారు.డిప్లా ఇన్ ఎలిమెటరీ ఎడ్యుకేషన్ (డిఈఎల్ఎడ్),డిప్లా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) కోర్సుల 2026–28 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను మే 21,22 తేదీల్లో కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు టిజి డిఈఈసెట్– 2026 చైర్‌పర్సన్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రభుత్వ డైట్‌లు (డిఐఇటి), ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ సంస్థలు (మైనారిటీ, నాన్‌మైనారిటీ సహా)లో డిఈఎల్ ఎడ్, డిపిఎస్ఈ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఈనెల చివరి వారంలో విడుదల కానుందని తెలిపారు.

## తెలంగాణకు మూడు బుల్లెట్ రైళ్లిచ్చాం

- రాష్ట్రానికి ఏమీ దక్కలేదనడం సరికాదు
- బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ దక్కలేదని విమర్శించడం సరి కాదని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి మూడు బుల్లెట్ ట్రైన్స్‌ను ఇవ్వడం అభివృద్ధికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ యంవిఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన విజయసంకల్ప్ సమ్మేళనంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలో మహిళలను నరేంద్ర మోదీ నారీ శక్తిగా గుర్తింపు తీసుకొస్తు వారి సంక్షేమం కోసం వినూత్న పథకాలు రూపొందించి అమలు చేస్తుంటే ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని ఉద్దేశ్యంతో తెలంగాణలో ఆచరణ సాధ్యం కాని తరువాయి 12లో

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత

### ముఖ్యమంత్రిగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం



**ఇంఫాల్ :** మణిపూర్ నూతన ముఖ్యమంత్రిగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. మాజీ మంత్రి, కుకీ నాయకురాలు నెమ్చా కిప్ గెన్, నాగాలకు చెందిన లోసి దిఖోలు కొత్త ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రులు ప్రమాణం చేశారు. ఈ మేరకు లోక్‌భవన్‌లో మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ బల్లా వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నెమ్చా కిప్ గెన్ వర్చువల్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ముగిసింది. ఈ మేరకు రాష్ట్రపతి పాలన ఎత్తివేస్తూ కేంద్ర హోంశాఖ గెజిట్ విడుదల చేసింది. ఆర్టికల్ 356 (2) ప్రకారం రాష్ట్రపతి తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వివరించింది. మణిపూర్ నూతన సిఎంగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ తరువాయి 12లో

## ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య త్రైపాక్షిక చర్చలు షురూ



**మాస్కో:** ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య రెండురోజులపాటు జరిగే రెండోవిడత త్రైపాక్షిక చర్చలు అబుదాబిలో బుధవారం ప్రారంభమయ్యాయి. చర్చల ద్వారా కనీసం యుద్ధవిరమ ఒప్పందం కుదురుతుందని మధ్యవర్తి దేశాలు ఆశిస్తున్నాయి. యుద్ధ సమస్య పరిష్కారానికి ఇప్పటికీ ఇంకా ప్రాదేశిక సరిహద్దులు, ఆక్రమిత భూభాగాలే ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయి. నాలుగేళ్ళుగా ఉక్రేన్–రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఎలా ముగించాలనే విషయంపై అమెరికా మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు జరుగుతాయని గడచిన ఆదివారంనాడే ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఖరారు చేశారు. ఈ చర్చలు ప్రారంభమైనట్లు రష్యాకు చెందిన టాస్ వార్తా సంస్థ తెలియజేసింది. రష్యా ప్రతినిధుల బృందం మంగళవారం రాత్రికే అబుధాబి చేరుకుంది. అమెరికా తరఫున ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ కూడా ఎఐ బటీన్ ఎగ్జిక్యూటివ్ తరువాయి 12లో

# మానసిక క్షోభతో విడాకులు తీసుకున్నా: మిలిందా



**వాషింగ్టన్ :** అమెరికా ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ రహస్య పత్రాలు వెలుగుచూశాక అనేక విషయాలు బయటపడుతున్నాయి. ప్రపంచ ధనికుడు, దాత బిల్‌గేట్స్ పచ్చనికాపురంలో ఎప్‌స్టీన్ పత్రాలు చిచ్చుపెట్టాడని ఆయన మాజీ భార్య మిలిందా ఇప్పుడు మీడియా ముందుకు వచ్చి చెబుతున్నారు. జెఫ్రీఎప్‌స్టీన్ స్నేహంపట్టిన బిల్‌గేట్స్ రష్యన్ మహిళలతో శారీరక సంబంధాలు పెట్టుకున్న విషయం తెలియడంతో తీవ్ర మానసిక క్షోభకు గురై గేట్స్‌తో 2021లో విడాకులు తీసుకున్నట్లు మిలిందా ప్రకటించారు. ఇప్పుడు సమస్య బయట పడిందని, సమాజానికి ఆయనే సమాధానం చెప్పుకోవాలని ఆమె అన్నారు. 27 సంవత్సరాలు ఎంతో అన్యోన్యంగా వైవాహిక జీవితం గడపిన తర్వాత గేట్స్‌లో వచ్చిన ఈ మార్పులవల్ల విడాకులు తీసుకున్నానని, ఇప్పుడు తాను ఆ మకిలి నుడి బయటపడి విడిగా ఉంటూ ఎంతో సంతోషంగా ఉన్నానన్నారు. బిబిసి ఆమె మనోగతాన్ని ప్రచురించింది. కాగా, దివంగత బ్రిటన్ రాణి ఎలిజిబెత్–2 రెండో కుమారుడు, ఆమె మూడో సంతానమైన డ్యూక్ ఆంౘ్రూ జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో గాఢానుబంధం కొనసాగించి అప్రతిష్టపాలై చివరకు సోమవారం రాజప్రాసాద నివాసాన్ని వదలి బయటకు వెళ్ళిపోయారు. నార్‌ఫోల్క్‌లోని సాంౘ్రియన్‌ఘామ్‌లో ఉన్న ఎస్టేట్‌లోకి తన నివాసాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఎప్‌స్టీన్‌కు తన భార్య, కుమార్తెల ఫోటోలను కూడా ఆంౘ్రూ షేర్ చేశారు. మరోవైపు ఈ కేసులో ఈనెల 26,27 తేదీలలో దర్యాప్తు ప్యానల్ ఎదుట వాంగ్మూలం ఇచ్చేందుకు క్లింటన్ దంపతులు అంగీకారం తెలియజేశారు. ఎప్‌స్టీన్ పత్రాలలో క్లింటన్ పేరు కూడా ఉంది. ఎప్‌స్టీన్ రహస్య పత్రాల్లో బిల్‌క్లింటన్ హాట్‌టబ్‌లో విలాసాల్లో మునిగితేలుతున్న చిత్రాలు తాజాగా బయటపడటంతో ఆయన ప్రతిష్ఠకు భంగం వాటిల్లింది. పైగా ఎప్‌స్టీన్ ప్రైవేటు జెట్స్‌లో 2002, 2003 సంవత్సరాలలో ఆయన నాలుగుసార్లు ప్రయాణాలు చేసినట్లు సాక్ష్యాలు కనిపించాయి. క్లింటన్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఏజెంల్ యురేనా ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెడుతూ క్లింటన్ దంపతులు దర్యాప్తు కమిటీ ఎదుట హాజరవుతారని ధృవీకరించారు. ఎప్‌స్టీన్‌తో వారికి ఎలాంటి సంబంధాలు లేవని వారి ప్రతినిధులు ప్రకటించారు. ఈనెల 26 క్లింటన్, 27న హిల్లరీ క్లింటర్ దర్యాప్తు ప్యానల్ ఎదుట సాక్ష్యం ఇస్తారు. ఐతే వారు ఎలాంటి నేరాలు చేసినట్లు ఈ పత్రాల్లో సాక్ష్యాలు లేవు.

**బ్రిటన్‌లో ఎప్‌స్టీన్ దుమారం**

లేబర్ పార్టీ నాయకుడు మాండల్సన్ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో సాక్ష్యాధారాలతో దొరికిపోవడంతో బ్రిటన్‌లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ పెద్ద ఎత్తున అధికార పార్టీపై విరుచుకుపడుతోంది. మాండల్సన్‌కు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్నాయని, అతడి నుండి ధనం ముట్టిందన్న విషయం ముందుగానే అధికార పార్టీకి తెలిసినప్పటికీ వాస్తవాలను సమాధి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని కన్జర్వేటివ్ పార్టీ నాయకురాలు బాండెనోచ్ ఘాటు విమర్శలు చేస్తున్నారు. అమెరికాలో దౌత్యవేత్తగా ఆయనను నియమించి ఎందుకు అతిపెద్ద బాధ్యతలు అప్పగించారని నిలదీస్తున్నారు. మాండల్సన్ వ్యవహారాన్ని దాచిపెడుతున్నారన్నారు. అతడిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. మరోవైపు లేబర్‌పార్టీ నాయకులు మాండల్సన్‌ను వెనకేసుకొస్తున్నారు. మాండల్సన్ పదే పదే అబద్ధాలు చెప్పారని, దానికి తన బాధ్యత లేదని ప్రధానమంత్రి కీర్‌స్టార్ చెబుతూ ఆత్మరక్షణలో పడ్డారు.



## బ్రెజిల్ బస్సు ప్రమాదంలో 16 మంది మృతి

**సియారా :** ఉత్తర బ్రెజిల్‌లో బస్సు ప్రమాదానికి గురికావడంతో 16 మంది యాత్రికులు మరణించారు. మరో 44 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో చాలామంది పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. సియారా రాష్ట్రం నుండి బస్సు తిరిగి వస్తుండగా, సావోజోస్ డీ తపేరా పట్టణం వద్ద బస్సు బ్రేకులు అదుపు తప్పి బోల్తా కొట్టినట్లు చెబుతున్నారు. దీనికి గల పూర్తి అసలైన కారణాలు తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటన తమను తీవ్రంగా కలచివేసిందని అలగోవాస్ గవర్నర్ పాల్ డాంటాన్ విచారం వ్యక్తం చేస్తూ మృతుల గౌరవార్థం మూడు రోజులు రాష్ట్రంలో సంతాప దినాలు ప్రకటించారు. బ్రెజిల్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నగరాల మధ్య రాకపోకల్లో భద్రత కరువైంది.

# రేపు మస్కట్‌లో అమెరికా–ఇరాన్ చర్చలు



### ఇరాన్ డ్రోన్‌ను కూల్చేసిన అమెరికా

**దుబాయ్ :** అమెరికా–ఇరాన్ మధ్య అణు చర్చలకు రంగం సిద్ధమైన తరుణంలో ఇరాన్ డ్రోన్‌ను అమెరికా దళాలు కూల్చివేయడంతో అరేబియా సముద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇరాన్‌కు కొన్ని గంటల ప్రయాణదూరంలో అంతర్జాతీయ జలాల్లో అమెరికా శక్తిమంతమైన అబ్రహాంలింకన్ విమాన వాహకనౌకను వారంరోజుల క్రితమే మోహరించింది ఉంచింది. ఇరాన్‌కు చెందిన షాహెద్ –139 డ్రోన్ అబ్రహాం లింకన్‌వైపు దూసుకువచ్చిందని, దీనిని గమనించిన తమ ఎఫ్–35 యుద్ధనౌక దానిని కూల్చివేసిందని అమెరికా ప్రకటిచింది. కొద్ది గంటల్లో చర్చలు ప్రారంభమవుతాయనగా ఈ దాడి ఉద్రిక్తతలను మరింత పెంచినప్పటికీ చర్చల విషయంలో రెండు దేశాలు వెనక్కు తగ్గలేదు. ట్రంప్ యుద్ధాన్ని కోరుకోవడంలేదని అమెరికా వర్గాలు ప్రకటించాయి. ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చిన అణుచర్చలను టర్కీ నగరం ఇస్తాంబుల్‌లో నిర్వహించాలని మొదట భావించారు. కానీ ఈ వేదికను తర్వాత ఒమన్ దేశ రాజధాని మస్కట్‌కు మార్పు చేశారు. ఆంక్షల తొలగింపు, విశ్వాస పునరుద్ధరణ లక్ష్యాలుగా రెండు దేశాలు చర్చల బల్లవద్దకు చేరుతున్నాయి. గత ఏడాదిలోనే ప్రచ్ఛన్నయుద్ధం ముదిరి పాకాన పడింది. జాతీయ ప్రయోజనాలే లక్ష్యంగా, షరతుల ప్రాతిపదికపై అమెరికాతో అణు చర్చల పునరుద్ధరణకు ఇరాన్ ప్రభుత్వం సంసిద్ధత వ్యక్తం చేసింది. పరస్పర గౌరవాలతో దేశ ప్రయోజనాలే లక్ష్యంగా ఇరాన్ చర్చలకు సుముఖత వ్యక్తం చేసింది. అమెరికా ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్, ఇరాన్ విదేశీ మంత్రి ఆరాఘ్చి, టర్కీ, ఖతార్, ఈజిప్టు దేశాల సీనియర్ ప్రముఖులు సమావేశంలో పాల్గొంటారు. చర్చలు ఫలించకపోతే చెడు జరిగే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని ట్రంప్ అన్నారు.

# గాజాలో ఇజ్రాయెల్ దాడులు : 20 మంది మృతి



**గాజా :** గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ బుధవారం దాడులు చేసింది. ఈ దాడుల్లో ఆరుగురు పిల్లలు, ఏడుగురు మహిళలు సహా 20 మంది మరణించినట్లు స్థానిక ఆసుపత్రి వర్గాలు సమాచారం తెలియజేశాయి. గాజాలో సోమవారం ఈజిప్టువైపు వెళ్ళే రఫా క్రాసింగ్ తెరవడానికి ముందుకూడా ఇజ్రాయెల్ భారీస్థాయిలో దాడులు చేసి 15 మందిని హతమార్చింది. ఈ దాడుల కారణంగా బుధవారం ఈజిప్టు బయలుదేరవలసిన రోగులను రఫా ద్వారా వెళ్ళకుండా ఆపేశారు. కాల్పుల విరమణ ఒప్పందం సందర్భంగా నిర్దేశించిన ఎల్లో లైన్‌ను దాటి వెళ్ళారనే ఆరోపణలతో ఇజ్రాయెల్ గడచిన మూడు నెలలుగా దాడులు కొనసాగిస్తూనే ఉంది. గాజా ఉత్తర ప్రాంతంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారని, అందుకే తాము దాడులు చేయాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ ఐడిఎఫ్ సైనికులు చెబుతున్నారు. ఈ దాడుల్లో మరణించినవారిలో 13 మందిని అల్‌సైఫా ఆసుపత్రికి తరలించారు. ఇప్పటివరకూ 530 మందిపైగా పాలస్తీనియన్లు గడచిన అక్టోబరు పదో తేదీ నుండి హతులయ్యారు.

ఈజిప్టులోని ఆసుపత్రలలో మంచి వైద్యం తీసుకోవడం కోసం అక్కడికి వెళ్ళేందుకు దాదాపు 20,000 మందిపైగా పాలస్తీనా రోగులు చికిత్సలకోసం ఎదురుచూస్తున్నారు. రఫా క్రాసింగ్ తెరచినప్పటికీ రోజుకు 50 మంది రోగులను మాత్రమే ఈజిప్టుకు చికిత్స నిమిత్తం వెళ్ళేందుకు అనుమతిస్తామని ఇజ్రాయెల్ ప్రభుత్వం షరతులు విధించడంతో అత్యవసర చికిత్సకోసం ఎదురుచూస్తున్నవారు ప్రాణాలను పణంగా పెట్టాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

మొదటిరోజు 45 మంది రోగులు, వారి వెంట 90 మంది సహాయకులను ఇజ్రాయెల్ అనుతించింది.

## అమెరికాలో ముగిసిన షట్‌డౌన్

**వాషింగ్టన్ :** అమెరికాలో నాలుగురోజులపాటు కొనసాగిన పాక్షిక షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. అమెరికా కాంగ్రెస్‌లో ఎట్టకేలకు 217–214 స్వల్ప ఓట్ల తేడాతో ఫండింగ్ ప్యాకేజీ బిల్లును రిపబ్లికన్లు ఆమోదింపజేసుకున్నారు. ఆ తర్వా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 1.2 ట్రిలియన్ డాలర్ల బడ్జెట్ కేటాయింపుల బిల్లును ఆమోదిస్తూ సంతకం చేశారు. సెనేట్‌లో ఒప్పందం కుదరడంతో తాత్కాలికంగా ఈ వివాదానికి తెరపడింది. జనవరి 31న ఈ పాక్షిక షట్‌డౌన్ ప్రారంభమైంది. రిపబ్లికన్ల సారథ్యంలోని సెనేట్‌లో బిల్లు ఒడ్డుకు చేరుకుంది. వలస సమస్య నేపథ్యంలో మిన్నెపోలిస్‌లో ఐసిఇ ఏజెంట్ల చేతుల్లో ఇద్దరు అమాయకులు హతులైన తర్వాత హోంల్యాండ్ సెక్యూరిటీకి ఏడాది అంతటా నిధుల కేటాయింపు ప్రతిపాదనలు ముందుకు రావడంతో సెనేట్‌లో ఫండింగ్‌పై వాగ్వాదం ప్రారంభమైంది.

# చైనా–రష్యా సంబంధాల వృద్ధికి బృహత్ ప్రణాళిక

### వీడియో సమావేశంలో జిన్‌పింగ్– పుతిన్ ఉద్ఘాటన



**బీజింగ్ :** చైనాకు రష్యా కీలకమైన ఇంధన భాగస్వామి అని ఆ దేశాధ్యక్షుడు పుతిన్ ఉద్ఘాటించారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో బుధవారం దృశ్యమాధ్యమ విధానంతో సమావేశం సందర్భంగా అనేక అంశాలపై వారిద్దరూ మాట్లాడుకున్నారు. రెండు దేశాలూ ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రణాళిక రూపొందించే విషయంపై చర్చించుకున్నట్లు జిన్‌పింగ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇదే విషయాన్ని నాయకులిద్దరూ ఉద్ఘాటించారు. వ్యూహాత్మక సహకారాన్ని రెండు దేశాలు మరింత లోతుగా పటిష్టం చేసుకోవడానికి చారిత్రక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో ఫ్రాన్స్, కెనడా, ఫిన్లాండ్, బ్రిటన్ తదితర దేశాధిపతులు చైనాలో పర్యటించి వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న పూర్వరంగంలో జిన్‌పింగ్‌తో పుతిన్ దృశ్యమాధ్యమ పద్ధతిలో ఈ కీలక సమావేశం నిర్వహించారు. ఉక్రేన్‌తో యుద్ధం విషయంలో చైనా వైఖరిలో ఎలాంటి మార్పూ లేదన్న విషయాన్ని పునరుద్ఘాటించడంలో భాగంగా ఈ సమావేశం జరిగి ఉండవచ్చునని పిటిఐ పేర్కొంది. రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం వల్ల యూరప్ దేశాలకు చైనాతో కొన్ని వైరుధ్యాలు ఉన్నాగానీ, వాటిని పక్కనపెట్టి యూరప్ నాయకులు చైనాతో సంబంధాలు పటిష్టం చేసుకునే ప్రయత్నం వేగం పుంజుకున్న తరుణంలో జిన్‌పింగ్‌తో అనేక అంశాలపై పుతిన్ మాట్లాడారు. పాశ్చాత్యదేశాలు అనేక ఆంక్షలు విధించినప్పటికీ కూడా చైనా ప్రభుత్వం రష్యాతో వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తోంది. ''మన రెండు దేశాల సార్వభౌమాధికారంనభద్రతలకు భరోసా కల్పించేందుకు జరిగే కృషిని ఈ సందర్భంగా మరోసారి ఉద్ఘాటిస్తున్నారు. దీనికి గట్టి మద్దతు ఇస్తున్నాను, మన రెండు దేశాల సాంఘిక, ఆర్థిక సంక్షేమం, మన సొంత వృద్ధిని ముందుకు తీసుకువెళ్ళే మార్గాన్ని ఎంచుకోవడానికి జరిగే కృషికి మద్దతు ఇస్తున్నాను'' అని పుతిన్ ఈ సమావేశంలో అన్నారు. అమెరికాకు సన్నిహితంగా ఉండే అనేక దేశాలు ఈనాడు చైనాతో వాణిజ్య సంబంధాలు కొనసాగించేందుకు తహ తహలాడుతున్నాయి.

## ఇంధన,వాణిజ్య,కీలక ఖనిజాలపై..
# భారత్–అమెరికా విదేశీమంత్రుల భేటీ

**న్యూయార్క్/వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్,భారత్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వాణిజ్య ఒప్పందానికి రావడంపై ఇరు దేశాల విదేశీ మంత్రులు ఎస్.జైశంకర్, మార్క్ రుబియో హర్షం ప్రకటించారు. ఇంధనం, వాణిజ్యం,అణుశక్తి,రక్షణరంగాలతోపాటు ఖనిజాలను అన్వేషించడం, వాటిని తవ్వితీయడం వంటి అంశాలపై రెండు దేశాలమధ్యా ద్వైపాక్షిక సహకారం కొనసాగించే విషయంపై వాషింగ్టన్ డి.సిలో బుధవారం జైశంకర్–మార్క్ రుబియో ఇద్దరూ ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. విదేశీకార్యాలయంలో జైశంకర్‌తో రుబియో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. జైశంకర్ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, మంగళవారం మధ్యాహ్నం మార్క్ రుబియోను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది, ఆయనతో విస్తారంగా ద్వైపాక్షిక అజెండా సహకారంపై, అనేక అంశాలపై చర్చలు జరిపాను, వాణిజ్యం, ఇంధనం, అణు,రక్షణ, కీలక ఖనిజాలు,సాంకేతికత వంటి అంశాలపై ఈ చర్చలు విస్తారంగా జరిగాయి,ఇంతకుముందు అంగీకరించిన ప్రకారం ఉమ్మడి ప్రయోజనాలను ఇచ్చిపుచ్చుకుంటాం'' అని పేర్కొన్నారు. అదేవిధంగా అమెరికా విదేశీమంత్రిత్వశాఖ ఉపముఖ్య అధికార ప్రతినిధి టమ్మీ పిగోట్ విడుదల చేసిన ప్రకటన మేరకు రుబియో,జైశంకర్ ఇద్దరూ ట్రంప్–మోదీ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని ప్రధానంగా స్వాగతించారు. మద్దతు ఇచ్చారు. రెండు దేశాల ప్రజాస్వామ్య ప్రభుత్వాల ప్రాధాన్యత గురించీ ట్రంప్–మోదీలు ఉద్ఘాటించి చెప్పారు. రెండు దేశాలమధ్య సరికొత్త ఆర్థిక అవకాశాలు తలుపులు తెరుస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా రుబియో–జైశంకర్ కూడా ద్వైపాక్షిక సమావేశంలో విస్తారంగా అనేక అంశాలపై చర్చలు జరిపారు. భారత్,అమెరికా,ఆస్ట్రేలియా,జపాన్‌లతో కూడిన ''క్వాడ్'' గ్రూపు ద్వారా బహు ఉముఖ, ద్వైపాక్షిక సహకారాన్ని రెండు దేశాలు రాబోయేకాలంలో మరింతగా విస్తరించుకుంటాయి. ఇరుదేశాల ఉమ్మడి ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఇండో–పసిఫిక్ ప్రాంతం రాబోయేకాలంలో ప్రగతికి కీలకంగా ఉంటుందని అంగీకరించారు. అదే విధంగా మార్కో రుబియో కూడా ఎక్స్ వేదికగా జైశంకర్‌తో సమావేశం గురించి సానుకూల ప్రకటన చేశారు. ఈ పర్యటనలో జైశంకర్ ఇతర శాఖల సీనియర్ మంత్రులను కూడా కలిసి చర్చలు జరిపారు. ట్రంప్ ప్రకటన ప్రకారం భారతదేశంపై విధించిన 25 శాతం అదనపు సుంకాలు 18 శాతానికి తగ్గాయి.

**భారత్ ఇంకెంతో కాలం**
**రష్యా చమురు కొనుగోలు చేయదు**

భారతదేశం ఇంకెంతోకాలం రష్యా చమురు కొనుగోలు చేయదని రష్యా చమురుకే భారత్ కట్టుబడి ఉండదని వైట్‌హౌస్ వ్యాఖ్యానించింది. అమెరికా–భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాన్ని వైట్‌హౌస్ వర్గాలు బుధవారం ప్రశంసించాయి. భారతదేశం తమ నుండి చమురు కొనుగోళ్ళు నిలిపివేస్తున్నట్లు సమాచారం ఏదీ లేదని, అమెరికాతో ఒప్పందం కుదిరిన విషయం కూడా తమకు చెప్పలేదని రష్యా వర్గాలు ప్రకటించడం, ఒప్పందం కుదిరిందని భారతదేశం ప్రకటించలేదని మరో ప్రకటన రావడం వంటి పరిణామాలమధ్య వైట్‌హౌస్ ఈ కీలక వ్యాఖ్య చేసింది. అమెరికాలోని కీలక రంగాలలో 500 బిలియన్ డాలర్ల మేరకు పెట్టుబడులు పెడతామని భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంగీకరించారన్న విషయాన్ని వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లెవిట్ బుధవారం పాత్రికేయులవద్ద చెప్పారు. ''మా అధ్యక్షుడు భారత్‌తో మరో ఒప్పందం చేసుకున్నారు. ఆయన ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ప్రత్యక్ష సంభాషణ చేశారు.



## లక్షలాది ఇళ్లు
(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి తెలిపారు.

**ఫోన్ ట్యాప్‌చేసి భార్యాభర్తలు మాటలు వినడం దారుణం :** గత ప్రభుత్వంలో భార్యాభర్తలు ఫోన్‌లో మాట్లాడుకుంటే ట్యాప్ చేసి విన్నారని, అలా చేయడం దుర్మార్గమని, చివరికి జడ్జిలు, ప్రతిపక్ష నేతలు, సినీతారలను కూడా వదల్లేదని సిఎం రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్‌కు సిట్ నోటీసులిస్తే జాతిపితకు నోటీసు ఇస్తారా? అని ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. కెసిఆర్ మీ జాతికి పిత కావచ్చన్న ఆయన మీ జాతితో ప్రజలకు ఏం పని? అని విమర్శించారు. హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, కృష్ణారావు వంటి నేతలు మీ జాతి కావచ్చని నిప్పులు చెరిగారు. ఘోర నేరాలు చేస్తే పోలీసులు ముసుగు తొడిగి పట్టుకుని వస్తారని, హరీశ్‌రావు, కెటిఆర్‌లను అలాగే పట్టుకుని రావాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అన్నీ మీ కుటుంబమే తీసుకుంది :** మీకు నోటీసులు ఇస్తే అందరికీ ఇచ్చినట్లయితే ఎర్రవల్లి, జన్వాడ ఫాంహౌస్‌లు మా ప్రజలకు ఇస్తారా? అని రేవంత్ ప్రశ్నించారు. మొయినాబాద్‌లోని హరీశ్‌రావు ఫాంహౌస్‌లో అందరినీ రానిస్తారా?, రూ.వేల కోట్లు కొల్లగొట్టిన దాంట్లో నిరుద్యోగులకు ఏమైనా ఇస్తారా? అని పెదవి విరిచారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభలు, మంత్రి పదవులు అన్నీ మీ కుటుంబమే తీసుకుందని బిఆర్ఎస్‌ను నిలదీశారు. తెలంగాణ సమాజానికి ఏమైనా ఇచ్చారా?, చివరికి తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసుకున్న శ్రీకాంతాచారి తల్లికి కూడా ఏమీ ఇవ్వలేదని మండిపడ్డారు.

**మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావుపై నిప్పులు :**

'నక్క జిత్తుల భాస్కర్‌రావు నీ వీపు చింతపండు చేస్తా... నామినేషన్ వేసిన మనోళ్లను వాపసు తీసుకోమని బెదిరిస్తున్నరట...నువ్వు అనుకుంటున్నవ్ భాస్కర్ రావు వీపు చింతపండు అయితది ఈ వేదిక మీద ఉన్నోళ్లు అంతా జానారెడ్డి లెక్క పెద్ద మనసు ఉన్నోళ్లం కాదు... నీ తెలివి తేటలు అన్నీ కట్టిపెట్టు...లేదంటే మళ్లీ ఖమ్మం పోతవ్ బిడ్డ అని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు పైన సిఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అంతకంటే ముందు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మిర్యాలగూడలో భాస్కర్ రావు పెడుతున్న ఇబ్బందుల గురించి వేదిక పైన వివరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. దీని పైన తీవ్రంగా స్పందించిన సిఎం భాస్కర్ రావుకు మాస్ వార్నింగ్ ఇచ్చారు. సభకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షత వహించగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, శంకర్ నాయక్, పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, శాసనసభ్యులు బాలు నాయక్, వేముల వీరేశం, పద్మావతి రెడ్డి, వంశీకృష్ణ, కుందూరు జైవీర్ రెడ్డి,మందుల సామెల్,పర్యాటకశాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,డిసిసి అధ్యక్షలు పున్న కైలాష్ నేత తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
(మొదటి పేజీ తరువాయి)

భర్తీ చేయడానికి ధర్మాసనం అనుమతించింది. పశ్చిమబెంగాల్ ప్రభుత్వానికి ఎక్కడా న్యాయం జరగడం లేదని, ఇప్పటికే ఎన్నికల సంఘానికి 6 సార్లు లేఖలు రాసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ధర్మాసనం నుం చి న్యాయం జరగాలని మమతాబెనర్జీ కోరారు. విచారణ చివరిలో బెనర్జీ వాదించడానికి అవకాశం కోసం ధర్మాసనానికి తన అధికారాన్ని తెలియజేసిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అభ్యర్థించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఓటర్ల జాబితాకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను ఆమె సవాల్ చేశారు. ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తరపున హాజరైన న్యాయవాది దివన్ తన వాదనలు వినిపిస్తూ పశ్చిమబెంగాల్‌లో భారీయెత్తున మ్యాప్ చేయబడని ఓటర్ల గురించి ప్రస్తావించి ఫిబ్రవరి 14న ముగియనున్న తరుణంలో పరిష్కార చర్యలకు ఇక సమయం లేదని, ఈ విషయంలో అత్యున్నత నాయస్థానం స్పందించాలని కోరారు. ఇప్పటివరకూ 1.36 కోట్లమంది ఓటర్లు 'తార్కిక వ్యత్యాసాలలో' ఉన్నదని తేలిన కారణంగా వారికి నోటీసులు జారీచేయబడినట్లు న్యాయవాది దివన్ చెప్పారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఈ సందర్భంగా బెంగాలీ మాండలీకాన్ని ప్రస్తావిస్తూ కొన్నిసార్లు పేర్లు తప్పుగా రాయబడుతున్నాయని చెప్పారు. ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ మాట్లాడుతూ ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డిఎంల వంటి 80మంది గ్రేడ్2 అధికారుల సేవలను మాత్రమే అందించిందని, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేవలం దిగువ ర్యాంక్ ప్రభుత్వ ఉద్యోగులైన అంగన్‌వాడీ వర్కర్ల మాత్రమే ఈ ప్రక్రియ కోసం ఏర్పాటుచేసిందని రాకేశ్ ద్వివేది అన్నారు. కాగా ఎన్నికల సంఘం ఆరోపణలను మమతా బెనర్జీ తిప్పికొడుతూ ఎన్నికల సంఘం కోరిన ప్రతీదానిని రాష్ట్ర ప్రభుత్వం అందించిందని తెలియజేశారు. పశ్చిమబెంగాల్‌లో 'సర్' ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, అసౌకర్యానికి గురిచేయకూడదని జనవరి 19న సుప్రీంకోర్టు అనేక ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే.

## దారుణ హత్య
(మొదటి పేజీ తరువాయి)

ఆమె సోదరుడే దారుణంగా హత్య చేశాడు. కుమార్తె మరణాన్ని కళ్లార చూసిన తల్లి విలపిస్తున్న దృష్యాలు పలువురిని కలచివేశాయి. చేవెళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తోన్న స్వప్నకు తన అన్నతో 10 ఎకరాల భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. గత కొంతకాలంగా ఆ భూమి తనకు ఇవ్వాలంటూ ఆమెను సోదరుడు రాజు బెదిరించాడు. అలాగే రెండుసార్లు తనపై హత్యాయత్నం కూడా చేశాడు. ఈ క్రమంలో తనకు కేటాయించిన భూమిలో స్వప్న సర్వే చేయిస్తుండగా కారులో వచ్చిన కొందరు ఆమెని కిరాతకంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**రెండు సార్లు చంపేందుకు ప్రయత్నించాడు :** మృతురాలు స్వప్న తల్లి వెంకటమ్మ పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. స్వప్న అన్న రాజు దారుణానికి ఒడిగట్టాడని కన్నీటి పర్యంతమయ్యారు. గత మూడేళ్లుగా స్వప్నను చంపాలని రాజు పథకం పన్నాడని, ఇప్పటికే రెండు సార్లు చంపేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. భూమి సర్వే చేసిన తర్వాత తిరిగి వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు తన కుమార్తెపై దాడి చేశారని తెలిపారు. కర్రలతో కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారని వాపోయింది. నిందితుడు రాజుని కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు.

**నిందితున్ని కఠినంగా శిక్షించాలి :** స్వప్న హత్యపై చేవెళ్ల కోర్టు న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి విధులను బహిష్కరించి మొయినాబాద్ పిఎస్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ విషయంలో స్వప్న కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితున్ని కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

**పథకం ప్రకారమే స్వప్నను రాజు హత్య చేశాడు :** న్యాయవాది స్వప్న హత్య కేసులో ఆమె సోదరుడు రాజుతో పాటు అతని డ్రైవర్ వీరేశ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు చేవెళ్ల డిసిపి యోగేశ్ గౌతమ్ తెలిపారు. హత్య కేసులో మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్టు వెల్లడించారు. భూ వివాదమే ఈ హత్యకు ప్రధాన కారణమన్న ఆయన పథకం ప్రకారమే స్వప్నను రాజు హత్య చేశాడని యోగేశ్ గౌతమ్ పేర్కొన్నారు.

## మోదీ తప్పించుకున్నారు
(మొదటి పేజీ తరువాయి)

ఏమి జరిగిందో నరవణే పూర్తి వివరాలను రాశారని ఆయన చెప్పారు. అయితే ఈ ఆత్మకథను లోక్‌సభలో ఉటకించకూడదని తనకు చెబుతున్నారని రాహుల్ పేరొ్కన్నారు. 'మోదీ చెప్పిన ప్రధాన విషయం ఏమంటే... 'ఏది సరైనదని భావిస్తారో అది చేయండి'. ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే రాజ్‌నాథ్ సింగ్‌కు ఫోన్ చేసి, 'చైనీస్ ట్యాంకులు కైలాష్ రిడ్జ్‌పైకి వచ్చాయి, మనం ఏమి చేయాలి?' అని అడిగారు. రాజ్‌నాథ్ సింగ్ మొదట అతనికి సమాధానం ఇవ్వలేదు. అతను (నరవణే) ఎస్ జైశంకర్, ఎన్ఎస్ఎ (అజిత్ దోవల్) రాజ్‌నాథ్ సింగ్ జీని అడిగారు, కానీ సమాధానం రాలేదు' అని రాహుల్ ఆ 'ఆత్మకథ'ను ఉటంకిస్తూ అన్నారు. 'అతను (నరవణే) మళ్ళీ రాజ్‌నాథ్ సింగ్ జీకి ఫోన్ చేయగా, ఆయన 'నేను పైవారిని అడుగుతాను' అని అన్నారు. 'చైనీస్ దళాలు వస్తే, మమ్మల్ని అడగకుండా వారిపై కాల్పులు జరపవద్దు' అని పైనుండి ఒక స్థిరమైన ఆదేశం ఉంది. నరవణే జీ, మన సైన్యం ఆ ట్యాంకులపై కాల్పులు జరపాలనుకున్నారు, ఎందుకంటే అవి మన భూభాగంలోకి ప్రవేశించాయి'అని ఆయన అన్నారు. 'నరేంద్ర మోదీ 'ఏది సరైనదని భావిస్తారో అది చేయండి' అనే సందేశం ఇచ్చారు. అంటే ఆయన బాధ్యత నుండి తప్పించుకున్నారు. ఆయన ఆర్మీ చీఫ్‌తో మీకు నచ్చింది చేయండి, ఇది నా వల్ల కాదు అని చెప్పారు' అని గాంధీ ఆ ఆత్మకథను ఉటంకిస్తూ అన్నారు. ఈ నేపథ్యంలో తాను ఒంటరిగా ఉన్నట్లు భావించానని, మొత్తం వ్యవస్థ తనను వదిలేసిందని ఆర్మీ చీఫ్ రాశారని మాజీ కాంగ్రెస్ అధినేత వెల్లడించారు. పార్లమెంట్‌లో ఈ విషయం చెప్పేందుకు ప్రయత్నిస్తుంటే వారు భయపడుతున్నారని విమర్శించారు. 'ఈ రోజు లోక్‌సభకు రావడానికి ప్రధానికి ధైర్యం ఉంటుందని నేను అనుకోవడం లేదు. ఒకవేళ ఆయన వస్తే, నేను ఆయనకు ఈ పుస్తకాన్ని ఇవ్వబోతున్నాను' అని ఆయన అన్నారు. ఈ పుస్తకం ఏ విదేశీ రచయితది కాదని, దేశ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే రాసిందని రాహుల్ స్పష్టం చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే క్యాబినెట్ మంత్రుల ఆదేశానుసారం ఈ పుస్తకం ఉనికిలో లేకుండా పోయిందని మండిపడ్డారు. 'మన సరిహద్దుల్లోకి చైనా సైన్యం ప్రవేశించినప్పుడు, అటువంటి క్లిష్ట సమయంలో ఆర్మీ చీఫ్‌ను వేచి ఉండేలా చేశారని ఈ పుస్తకంలో స్పష్టంగా పేర్కొనబడింది. నిర్ణయం తీసుకునే సమయం వచ్చినప్పుడు, ప్రధానమంత్రి కేవలం 'మీకు ఏది సరైనదనిపిస్తే అది చేయండి' అని తప్పించుకున్నారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. మరో మాటలో చెప్పాలంటే, దేశ భద్రతకు సంబంధించిన అత్యంత తీవ్రమైన సంక్షోభ సమయంలో మోదీ జీ రాజకీయ బాధ్యత నుండి తప్పించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం ప్రశ్నలు అడుగుతుంటే, ప్రభుత్వం ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పారిపోతోందన్నారు.

**చర్చకు భయం ఎందుకు? : ప్రియాంక**

పార్లమెంట్ సమావేశాల వేళ అధికార పక్షం తీరుపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాల సమయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం భయపడుతుంది కాబట్టే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వడం లేదన్నారు. పార్లమెంటు అనేది ప్రజాస్వామ్య దేవాలయమని, అక్కడ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే అభ్యంతరం ఏంటని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎంపిల సస్పెన్షన్ గురించి కూడా ప్రియాంక ప్రస్తావించారు. 'కొత్తగా ఏం జరిగింది? ఈ విధంగా జరగడం ప్రతి సమావేశంలోనూ మీరు చూస్తున్నారు. ఈ సమస్య కేవలం ప్రతిపక్ష నాయకులను మాట్లాడనివ్వకపోడం మాత్రమే కాదు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రాథమిక సమస్య. పార్లమెంట్ ఒక దేవాలయం. ఇక్కడ ఎవరైనా తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు' అని ప్రియాంక పేర్కొన్నారు. మరోవైపు, మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకం గురించి కూడా ఆమె మాట్లాడారు. అందులో జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించిన కీలక అంశాలు ఉన్నాయని ఆరోపించారు. 'నాకు తెలిసినంత వరకు ఆ పుస్తకంలో, చైనా దళాలు మన దేశంపై దాడి చేసినప్పుడు మన అగ్రనాయకత్వం ఎలా స్పందించిందో తెలియజెప్పే అంశాలు అందులో ఉన్నాయి' అని ప్రియాంక పేర్కొన్నారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి కూడా ప్రియాంక ప్రశ్నలను లెవనెత్తారు. ఈ విషయం గురించి పార్లమెంట్‌లో కాకుండా మరెక్కడ ప్రస్తావించాలని ప్రియాంక ప్రశ్నించారు. ఈ విషయంపై రాహుల్ గాంధీని సమర్థిస్తూ ఆమె ప్రియాంక మాట్లాడారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడకుండా ఆయన్ను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు.

## కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలను
# అడ్డుకోవడం ఎవరితరం కాదు

**సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించండి**
**ఆరునూరైనా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి తీరుతా**
**కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొందరు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పాతికేళ్లుగా పాల్వంచలో స్థానిక ఎన్నికలు లేకుండా చేశారు. కార్పొరేషన్ చేసుకున్న తర్వాత కూడా ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నారని. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎన్నికలను ఆపడం ఎవరి తరం కాదని, ఈ ఎన్నికల వాతావరణంతో పాల్వంచకు పండుగొచ్చినట్లుగా ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బుధవారం ఆయన పాల్వంచ పరిధిలోని 35, 39, 42, 46, 47 డివిజన్లతో పాటు 02,08,09,41డివిజన్లలో విస్తృత ప్రచారం చేశారు. తొలుత 42వ డివిజన్‌లో టిడిపి అభ్యర్థి గుత్తా వెంకట కృష్ణారావు ఎన్నికల కార్యాలయం, 46, 47 డివిజన్ల సిపిఐ అభ్యర్థులు గుర్రం వెంకటేశ్వర్లు, మహ్మద్ జిలానీ బేగంలతో కలిసి పాత పాల్వంచ సెంటర్‌లో ఎన్నికల కార్యాలయాన్ని కూనంనేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టడంతో పాటు మహిళలు పెద్ద ఎత్తున ఎదురేగి స్వాగతం పలుకుతూ హారతులు ఇచ్చారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ ఎంతో కాలం తర్వాత పాల్వంచ ప్రజల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని, సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించేందుకు వచ్చిన ప్రజలను చూస్తుంటే సమ్మక్క సారలమ్మ జాతరను తలపిస్తోందన్నారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కూడా ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తున్నారని, కానీ కార్పొరేషన్ ఎన్నికలను అడ్డుకోవడం ఎవరితరం కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాటిచ్చిన ప్రకారం కొత్తగూడెం కార్పొరేషన్ తీసుకొచ్చానని, ఈ కార్పొరేషన్ ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి శరవేగంగా సాగనుందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ఇప్పటి వరకు కోట్లాది రూపాయల నిధులను తీసుకొచ్చి మౌలిక సదుపాయల కల్పనకు పూనుకున్నామని, మారుమూల ప్రాంతాల్లో సహా డ్రైనేజీలు, సిసి రోడ్లు వేస్తున్నట్లు చెప్పారు. దేశంలోనే అత్యున్నత విద్యాలయం ఎర్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, 800 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుకు పూనుకున్నామని, తద్వారా వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. అంతే కాకుండా రూ.500 కోట్లతో పాల్వంచ మీదుగా రెండు బైపాస్ రోడ్లు త్వరలో వేయబోతున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థుల ఎన్నికల గుర్తు కంకి కొడవలి అని, అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వారి గెలుపుతోనే ఈ ప్రాంతాభివృద్ధి పరుగులు పెట్టనుందన్నారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండానే అని చెప్పారు. ఈ ఎన్నికల్లో కొందరు డబ్బులు వెదజల్లి వ్యవస్థను చిన్నాభిన్నం చేసేందుకు చూస్తున్నారని, ప్రలోభాలకు గురిచేసిందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని, దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 45వ డివిజన్ ప్రచారంలో భాగంగా గొల్లగూడెంలోని ఆయిల్ మిల్లులో సమావేశాన్ని నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు మచ్చ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఈ డివిజన్‌లో సౌమ్యుడైన అభ్యర్థి గౌతమి కృష్ణ(శివారమకృష్ణ)ని పోటీకి పెట్టామని, ఈ డివిజన్ ప్రజలంతా ఆయనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రాంతాలు, కూలాలు, మతాల పేరుతో వైషమ్యాలు సృష్టించేందుకు కొందరు కుట్రలు మొదలేసారని, వారి ఉచ్చులో పడకుండా సమస్యలపై సమగ్ర అవగాహన కలిగిన విద్యావంతుడు గౌతమి కృష్ణను గెలిపించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం 39వ వార్డు అభ్యర్థి మహ్మద్ అస్లామ్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. తొలుత అంబేద్కర్ సెంటర్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథంతో కలిసి డా.బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సబ్ స్టేషన్ రోడ్, చాకలి బజార్, టీచర్స్ కాలనీ, గాంధీ నగర్ తదితర కాలనీల్లో ప్రచారం సాగించారు. పాల్వంచలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పసుపు, ఎర్రజెండాలు రెపరెపలాడాయి. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు, సన్నిహితులు ఆయా డివిజన్ల అభ్యర్థుల గెలుపుకోసం కదలివచ్చారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, వైఎస్ గిరి, శనగారపు శ్రీనివాసరావు, వైవి వెంకట రామయ్య, పెద్ద వెంకట రామయ్య, మన్యం వెంకన్న, అన్నారపు వెంకటేశ్వర్లు, గౌస్, రెహమాన్, ఖరీమ్, మస్తాన్, అల్లి వెంకటేశ్వర్లు, సర్వయ్య, ఆదినారాయణ, కోరే కృష్ణ, టిడిపి నాయకులు కాపా కృష్ణ మోహన్, కళ్యాణం లక్ష్మి పతి, రత్నాకర్, నల్లమల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.



### అన్ని భాషల చిత్ర పరిశ్రమలకు
## కేంద్రంగా హైదరాబాద్
**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా అన్ని భాషల చిత్ర పరిశ్రమలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చే దిశగా ప్రభుత్వం బ్లూ ప్రింట్ సిద్ధం చేస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం సచివాలయంలో గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సభ్యుల సమావేశంతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటి సిఎం మాట్లాడుతూ మార్చి 19వ తేదీ ఉగాది పండగ రోజున గద్దర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుందన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రారంభమవుతుందని వెల్లడించారు. ముంబాయి, కోల్‌కత్తా, చెన్నై వంటి పట్టణాల్లో చిత్ర పరిశ్రమ విస్తరణకు అంతగా అవకాశాలు లేవని, హైదరాబాద్ పూర్తి సానుకులంగా ఉంటుందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న చిత్ర పరిశ్రమహైదరాబాద్ కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభించడంతో పాటు సినీ ప్రపంచ మార్కెట్ కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని తెలిపారు. గత ప్రభుత్వం దశాబద్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో పూర్తిగానిర్లక్ష్యం చేసిందని, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించింది అని వివరించారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. అందుకే వారి పేరు మీద గత ఏడాది నుండి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత లే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత ఏడాది జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్ర త్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకా శం ఉంటుందని తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదే రీతిలో పెద్ద ఎత్తున గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐ అండ్ పిఆర్ శాఖలకు పూర్తి స్వాతంత్రం, అవసరమైన సహాయం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, ఐ అండ్ పిఆర్ కమిషనర్ ప్రియాంక, ఎఫ్‌డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబుతో పాటు సినీ ప్రముఖులు తనికెళ్ల భరణి, కె.ఎస్. రామారావు, రోజా రమణి, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## అమెరికాతో మోదీ వాణిజ్య ఒప్పందం హానికరం


**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా దేశంతో మోదీ ప్రభుత్వం తాజాగా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం దేశ ప్రయోజనాలకు హానికరమని, ఇది దేశానికి తీవ్ర నష్టమని సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా వ్యవసాయోత్పత్తులను పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలనే ఒప్పందం దేశంలోని చిన్న పరిశ్రమలకు వ్యవసాయ, పౌల్ట్రీ, పాల ఉత్పత్తులకు మరణశాసనమని విమర్శించారు. అదానీ పైన అమెరికాలో నమోదు చేసిన కేసును రద్దు చేసుకునేందుకు ట్రంప్‌కు మోదీ లొంగిపోయాయి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు.

## అర్హత లేకున్నా కాంట్రాక్టులు
**బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు ఆరోపణ**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కె.ఎల్.ఎస్.ఆర్ అనే కంపెనీకి సిఎం రేవంత్ రెడ్డి వేల కోట్ల రూపాయాలను దోచిపెట్టారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. ఈ కంపెనీని వెంటనే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, ఆ కంపెనీ దక్కించుకున్న కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ కె ఎల్ ఎస్ ఆర్ ఆర్థిక అవకతవకలు, బినామీ కార్యకలాపాలు, అర్హత లేకుండా కాంట్రాక్టులు సాధించిందని, ఈ కంపెనీ వ్యవహారాలపైన సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వారం రోజుల క్రితమే నోటీసులను జారీ చేసిందని, మరో వైపు సిబిఐ, ఇడి, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆర్గనైజేషన్ ఏజెన్సీలతో విచారణ చేయించాలని కేంద్రానికి సూచించిందన్నారు. బినామీ కంపెనీకి నోటీసుల అంశాన్ని దాచి పెట్టడానికే సిఎం రేవంత్ రెడ్డి 'సిట్' పేరుతో దావోస్ నుంచి డ్రామాలను నడిపించారని ఆరోపించారు. కె.ఎల్.ఎస్.ఆర్ అనే కంపెనీ 23 జూలై, 2023న ఎ.ఎస్.ఎం.ఇ.టి (ఎఎస్‌ఎంఇటి) అనే కంపెనీ మధ్య గొడవ జరిగిందని, వారిద్దరూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారని, ఆ తర్వాత కేసు నడుస్తున్నదని కెటిఆర్ తెలిపారు. కె.ఎల్.ఎస్.ఆర్ కంపెనీకి సిఎం రేవంత్ రెడ్డి హయాంలో అమృత్ స్కీమ్, జల్ జీవన్ మిషన్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ సాగునీటి ప్రాజెక్ట్ పనులు, రహదారుల పనులు అన్నీ కలిపి సుమారు రూ6 వేల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులు వచ్చాయని ఆరోపించారు. 2023 నుంచే దివాళా తీసిన కంపెనీకి 202426 సంవత్సరాల్లో ఏ విధంగా తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టులను అప్పగించిందని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి విచారణ జరిపించేలా కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల అకాల మృతి బాధాకరం
**తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**
**జర్నలిస్టుల కుటుంబాలకు మీడియా అకాడమీ ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అక్షరమే ఆయుధంగా క్షేత్రస్థాయిలో పని చేసే జర్నలిస్టులు అకాల మృతి చెందడం బాధాకరమని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చి, వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ జర్నలిస్టుల సంక్షేమ కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ, అకాడమి ప్రచురించిన చిరుపుస్తకాలు (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఉదయం హైదరాబాద్ నాంపల్లిలోని అకాడమి ఆడిటోరియంలో జరిగింది. కార్యక్రమానికి అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిధులుగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ మరణించిన జర్నలిస్టుల కోసం ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి ఆర్థిక సహాయంగా లక్ష రూపాయలు మంజూరు చేయడంతోపాటు ఐదేళ్ల పాటు పెన్షన్ సదుపాయం కల్పించడం, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. పాత్రికేయ రంగంలో అనేక ఏళ్లు సేవలందించిన ప్రముఖ జర్నలిస్టుల జీవిత విశేషాలు తెలిపే చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరించడం రానున్న తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. నేటి సమాజంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో ఎన్ని మార్పులు వచ్చినా తాను మాత్రం పత్రికలు చదివి తినే సంతృప్తి చెందుతానని గుత్తా సుఖేందర్ రెడ్డి చెప్పారు. డాక్టర్ కె.కేశవరావు మాట్లాడుతూ ప్రముఖుల చరిత్ర తెలిపే పుస్తకం చదవడం సులభమని, కానీ అదే చరిత్రను మోనోగ్రాఫ్‌గా అందించడం అంత సులభం కాదని, అది అక్షర రూపం దాల్చడంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమాజానికి అద్దం పట్టేది వార్త అయితే, ఆ వార్త వెనుక ఉన్న నిజాన్ని వెలికి తీసిన జర్నలిస్ట్ భవిష్యత్తు తరాలకు దారి చూపిన వారవుతారన్నారు. సోషల్ మీడియాను కంట్రోల్ చేయడం ఎవరి తరం కాదని, కానీ దీనిపై జర్నలిస్టులందరూ ఎకతాటిపైకి వచ్చి చర్చించడం లేదా వర్క్ షాప్‌లు నిర్వహించి కొంత మార్పునకు నాంది పలకాలన్నారు. అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చనిపోయిన 18 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం, ప్రమాదానికి గురైన జర్నలిస్టులకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు చెప్పారు. ప్రముఖ పాత్రికేయులైన అబిద్ అలీఖాన్, డి.సీతారామ్, బేతనబొట్ల నాగేశ్వర రావు, పొత్తూరి వెంకటేశ్వరరావు, ఎం.ఎస్.ఆచార్య, ఎ.బి.కె. ప్రసాద్, జి.ఎస్.వరదాచారి, సి.రాఘవాచారి, వి.హనుమంతరావు, ఆదిరాజు వెంకటేశ్వరరావులపై మీడియా అకాడమి ప్రచురించిన 10 చిరు పుస్తకాలను (మోనోగ్రాఫ్స్) ఆవిష్కరణ చేసుకున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.



## విద్యార్థుల కుల సమాచార సేకరణ
**బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల కుల సమాచార సేకరణ ద్వారా బిసి విద్యార్థుల్లో ఏ కులానికి, ఏ వర్గానికి చెందినవారు విద్యకు దూరంగా ఉంటున్నారో గుర్తించి, వారిని ప్రోత్సహించే అవకాశం కలుగుతుందని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బిసి కమిషన్ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, కాళోజి నారాయణరావు యూనివర్సిటి ఆఫ్ హెల్త్ సైన్సెస్ రిజిస్ట్రార్ డాక్టర్ కె. నాగార్జున రెడ్డి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ కష్ణ ఆదిత్య, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, మెంబర్ సెక్రెటరి బాల మాయా దేవి పాల్గొని, రాష్ట్రంలో వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సమాచారాన్ని కులాల వారిగా సేకరించే విషయమై చర్చించారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల డేటా సేకరించడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నందున, ఈ విషయం యొక్క ప్రాధాన్యతను గుర్తించి, సమాచారం సేకరించి, కమిషన్‌కు అందజేయాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందిస్తూ వెంటనే విద్యార్థుల కుల సమాచారం సేకరించే కార్యక్రమానికి స్వీకారం చుడతామని, ఈ సంవత్సరం మార్చి లోపల వివరాలు అందిస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం నుండే అడ్మిషన్స్‌లోనూ, రాబోయే విద్యా సంవత్సరం నుండి జరిగే ప్రవేశ పరీక్షలలోనూ కుల సంబంధిత సమాచారాన్ని కూడా సేకరించబోతున్నామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మినారాయణతో పాటు తదితర అధికారులు పాల్గొన్నారు.

## వన దేవతల సన్నిధిలో భక్త జనసందోహం
**తిరుగువారం రోజున కొనసాగిన భక్తుల రద్దీ**

**ప్రజాపక్షం/ములుగు :** సమ్మక్క సారలమ్మ జాతర బుధవారం తిరుగువారం సందర్భంగా వన దేవతలు సన్నిధిలో భక్త జనసందోహంతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మొదటగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి వన దేవతలకు బంగారం, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ కొనసాగుతున్న తరుణంలో అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర పరిసర ప్రాంతాలలోని వ్యర్థాలను పారిశుధ్య కార్మికుల ద్వారా తొలగిస్తూ వ్యాధులు ప్రబలకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తిరుగువారం సందర్భంగా వన దేవతల పూజారులు కన్నేపల్లి ఆలయంలో శుద్ధి కార్యక్రమం నిర్వహించి వన దేవతలకు దీప దూప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల పూజ సామాగ్రి, పట్టు వస్త్రాలను పూజారులు భద్రపరుస్తారు.







తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మఖ్దూం మొహియొద్దీన్ జయంతి సందర్భంగా హైదరాబాద్, హిమాయత్‌నగర్ మఖ్దూంభవన్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు చాడా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి. నరసింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ఛాయాదేవి బుధవారం పూల మాల వేసి నివాళి అర్పించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వెంకటేశ్, మారుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, శ్రీకాంత్, నరేష్,శ్రీమాన్,అనిల్, ఆరుట్ల రాజ్ కుమార్, కుమార స్వామి, బోయ శ్రీరాములు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## 60 వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీకి ప్రణాళిక
**లోక్‌సభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటన**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో సురక్షిత, సౌకర్యవంతమైన రైలు ప్రయాణానికి కొత్త ప్రమాణాలు నెలకొల్పే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 260 వందే భారత్ స్లీపర్ ట్రైన్‌సెట్ల తయారీకి ప్రణాళిక రూపొందించినట్లు కేంద్ర రైల్వే, సమాచారప్రసార, ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా మంత్రి ఈ వివరాలు వెల్లడించారు.వందే భారత్ స్లీపర్ రైళ్ల తయారీ ప్రక్రియను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదట ప్రోటోటైప్ అభివృద్ధి, అనంతరం విస్తృత పరీక్షలు, ట్రయల్స్, తదుపరి సిరీస్ ఉత్పత్తి చేపడతామన్నారు. ఈ కార్యక్రమాన్ని బిఇఎంఎల్, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్), చెన్నైతో పాటు సాంకేతిక భాగస్వాముల సహకారంతో అమలు చేస్తున్నట్లు చెప్పారు.ప్రయాణికుల డిమాండ్ ఆపరేషనల్ సిద్ధత ఆధారంగా వందే భారత్ స్లీపర్ రైళ్లను దశలవారీగా రెగ్యులర్ ప్రయాణికుల సేవల్లోకి ప్రవేశపెడతామని మంత్రి స్పష్టం చేశారు.అత్యాధునిక భద్రతా, సౌకర్యాల ప్రత్యేకతలు వందే భారత్ స్లీపర్ రైళ్లలో ప్రయాణికుల భద్రత, సౌకర్యాల కోసం అత్యాధునిక సాంకేతికతను వినియోగించినట్లు తెలిపారు.

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: డివిజన్-30, జిహెచ్ఎంసి.**
NIT No.66/E.E.30/GHMC/2025-26 తేదీ: 04-02-2026
**పని పేరు:** జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-30లో వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. **అంచనా విలువ:** రూ.46.20లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 05.02.2026న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 12.02.2026న ఉ.11.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి. 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 14967-PP/CL/ADVT/1/2025-26 Date: 04-02-2026



## కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించండి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/చిట్యాల :** కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో దిగిన కౌన్సిలర్ అభ్యర్థులను ఓటర్లు ఆశీర్వదించి కౌన్సిల్‌కు పంపించాలని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం కోరారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా బుధవారం పట్టణంలోని 2, 9, 10వ వార్డులలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను తాను పూర్తి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి ప్రధాత రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగుతుందని, పట్టణంలోని వార్డుల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమని అన్నారు. మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని వీరేశం అన్నారు.

**మద్యం దుకాణాన్ని తరలించండి:** పట్టణంలోని 9వ వార్డులో ఉన్న మద్యం దుకాణాన్ని ఆ ప్రాంతం నుండి తరలించాలని వార్డు మహిళలు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశంకు వినతి పత్రాన్ని అందజేశారు. మద్యం దుకాణం కారణంగా పలు సమస్యలు ఏర్పడుతున్నాయని, మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రచార కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు పాల్గొన్నారు.

## చదువు వేళలో..కూలి పనులా?

కూలీలు చేయాల్సిన పనులు విద్యార్థులతో
యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం: ఎఇఒ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పాఠశాల సమయంలో జరిగిన ఘటనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్లాసులు జరగాల్సిన వేళ, అదే పాఠశాలకు చెందిన 8వ, 9వ తరగతి విద్యార్థులను పాఠశాల గ్రౌండ్ శుభ్రత పనుల పేరుతో చెట్ల కొమ్మలు, ఎండిన వృక్ష భాగాలను ట్రాక్టర్లకు ఎక్కించే శ్రమపనుల్లోవినియోగించినట్లు ఆరోపణలువినిపిస్తున్నాయి.లోడింగ్ పూర్తయ్యాక విద్యార్థులను ట్రాక్టర్‌పైనే ప్రయాణింపజేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వారిని ఎక్కడికి, ఏ అవసరానికీ తీసుకెళ్లారన్న విషయంపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలువ్యక్తమవుతున్నాయి. కొంతమంది విద్యార్థులు హాస్టల్ వంట కోసం కట్టెలు తీసుకువెళ్తున్నామని చెబుతుండగా, మరికొందరు తమకు ఈ విషయంపై ఏమాత్రం సమాచారం లేదని పేర్కొనడం గమనార్హం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం: ఎంఈఓ మేక నాగయ్య**
ఈ ఘటనపై ఎంఈఓ మేక నాగయ్య స్పందిస్తూ, పాఠశాల సమయంలో, విద్యార్థులు యూనిఫామ్ ధరించి ఉన్నప్పుడు వారితో ఇలాంటి పనులు చేయించడం పూర్తిగా తప్పు. ఈ విషయంపై పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం. అలాగే ఈ ఉదంతాన్ని జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి కూడా తీసుకెళ్తాం" అని స్పష్టం చేశారు.

## ఆదరించండి అభివృద్ధి చేస్తాం

వార్డుల్లో కౌన్సిలర్ అభ్యర్థులు జోరుగా ప్రచారం





**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపాలిటిలోని ఆయా వార్డుల్లో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు బుధవారం నుండి తమ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. తమను ఆదరించి ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని హామీల వర్షం కురిపిస్తున్నారు.

**ఐదేళ్ల పాటు ఉచిత వైద్యం...** 18వ వార్డు నుండి పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ బుధవారం తన వార్డులో జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. వార్డు ప్రజలు తనకు ఓటువేసి గెలిపిస్తే ఐదేళ్ల పాటు ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రజల ఆరోగ్యం బాగుండేందుకు స్వచ్ఛమైన మంచినీటి సౌకర్యం అవసరమని నూతనంగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మానాయక్, వెంకట్, మాజీ కౌన్సిలర్ మాలోతు చంద్రునాయక్, రమేష్ పాల్గొన్నారు.

**గతంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయ్యండి...** గతంలో తన వార్డులో చేసిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని 48వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి వెలుగు వెంకన్న ప్రజలను కోరారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా తన వార్డు పరిధిలోని వ్యవసాయ మార్కెట్ రోడ్డు, శంకర్ విలాస్ సెంటర్‌లో జోరుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు సంతోషి, నాయకులు రాపర్తి నాగరాజు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాల నూటికి నూరు శాతం ఫలితాలు

**సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** త్వరలో జరగబోవు పదవ తరగతి వార్షిక ఫలితాలలో ప్రతి పాఠశాల నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని విసి హాల్‌లో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, కెజిబివి స్పెషల్ ఆఫీసర్లు, టిజిఎమ్ఎస్ ప్రిన్సిపాల్స్‌తో వేబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు క్లాసుల నిర్వహణ, ఎస్ఏ1 ఫలితాలు, పిఎంఎస్‌హెచ్ఆర్ఐ ఫండ్స్, భవిత సివిల్ వర్క్స్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్, ఎఫ్ఎల్ఎస్ మోక్ టెస్టులు, ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్ మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతి పాఠశాల నుండి ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో 70 శాతం మార్కులు సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఏ1 పరీక్షలలో సబ్జెక్టుల వారీగా ఫలితాలను రివ్యూ చేసి, అతి తక్కువ ఫలితాలు సాధించిన విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

# పుర పోరులో గెలిచేది మనమే

కార్యకర్తలకు దిశా నిర్దేశం
అత్యధిక స్థానాల్లో స్పష్టమైన మెజార్టీ
మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఈనెల 11న తెలంగాణ రాష్ట్రంలో జరిగే పురపాలక ఎన్నికల పోరులో అత్యధిక మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని భారీ నీటి పారుదలశాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం హుజూర్‌నగర్, కోదాడ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి దిశా నిర్దేశం చేశారు. హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల మున్సిపాలిటిలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నట్లు తెలిపారు. ఎన్నికలలో అనుసరించాల్సిన వ్యూహాలనుపై వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై నాయకులు, కార్యకర్తలు కంకణ బద్దులై కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం అహర్నిశలు కృషి చేయాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్, రాష్ట్ర నాయకులు ఈడుపుగంటి సుబ్బారావు, దొంగరి వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, దొంతగాని శ్రీనివాస్, తన్నీరు మల్లిఖార్జున్, గూడెపు శ్రీనివాస్, హుజూర్‌నగర్, కోదాడ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**కాంగ్రెస్ అభ్యర్థులను అశీర్వదించండి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి**

**ప్రజాపక్షం/కోదాడ:** మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 22వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి తూనం కృష్ణ ఎన్నికల కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వార్డులో తూనం కృష్ణ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంత బదనాం చేసినా ప్రజాసేవకే నా జీవితం అంకితం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఇటీవల కాలంలో తనపై సోషల్ మీడియాలో అనేక విధాలుగా బదనాం చేస్తున్నారని ఎంత బదనాం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకే తన జీవితం అంకితమని ప్రజాసేవతోనే తన జీవితం ఉంటుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. నేను నా మిర్యాలగూడ ద్వారా మిర్యాలగూడ మున్సిపాలిటి అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను ఎమ్మెల్యే కాకముందే చేపట్టానని ఎమ్మెల్యే అయిన తరువాత మిర్యాలగూడ మున్సిపాలిటి అభివృద్ధి కోసం అహర్నిషలు పని చేస్తున్నారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో తన కుటుంబ సభ్యులను నిలబెట్టడంలో ప్రధాన ఉద్దేశ్యం బీఆర్ఎస్ నాయకులు కొన్ని వార్డులను ప్రభావితం చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తనకు సమాచారం అందడంతో వారికి అండగా నేను ఉంటానని తన కుటుంబ సభ్యులను పణంగా పెట్టి నామినేషన్లను వేయించానే తప్పా ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. రైతు సంక్షేమానికి ముఖ్యమంత్రి సమక్షంలో అందించిన చెక్కు ఫేక్ అని బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారాన్ని చేశారని, వారందరికి ఇదే నా సమాధానం అంటూ బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకోండి నా చెక్కు ఒరిజినలా కాదా అని మీరే చెప్పాలని సభాముఖంగా కోరారు. చైతన్యవంతులైన మిర్యాలగూడ ప్రజల ఆశీర్వాదంతో రానున్న మున్సిపాలిటి ఎన్నికల్లో 48 వార్డులకు 48 వార్డులు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మిర్యాలగూడలో నూతనంగా ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు ఎన్నో ఏండ్లుగా డంపింగ్‌యార్డుతో ఇబ్బందులు పడుతున్న మిర్యాలగూడ ప్రజలకు ఈ డంపింగ్‌యార్డును మరోచోటికి మార్చేందుకు స్థలంతోపాటు నిధులు మంజూరు చేయాలని కోరారు. దామరచర్ల మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించాలని, వాడపల్లిలోని లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతోపాటు మిర్యాలగూడను జిల్లా ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని కోరారు.

**ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 18 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం... ఎమ్మెల్సీ శంకర్‌నాయక్**
ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలతో రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిలాలలోని 18 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని అన్నారు. ఆనాటి ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల కోసం ఎన్నో సాహసోపేతమైన పథకాలను తీసుకురావడం జరిగిందని మళ్లీ ఇన్నాళ్లకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం అద్భుతమైన పథకాలతో ప్రజాపాల కొనసాగుతుందన్నారు. కేసీఆర్ పాలనతో ఆగమైన తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి రేవంత్‌రెడ్డితో గాడిలోకి పడుతుందన్నారు.

## రైతులకు యూరియాను అందించడంలో పాలకులు వైఫల్యం

రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డా వెంకటయ్య



**ప్రజాపక్షం/కోదాడ:** రైతులకు యూరియాను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోర వైఫల్యం చెందాయని సిపిఐ నాయకులు, రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డా వెంకటయ్య ఆరోపించారు. రైతులు యూరియాను తీసుకోవడం కోసం ప్రభుత్వాలు ఒక కొత్తగా యాప్‌ను తీసుకవచ్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ యాప్ ద్వారానే ఆన్‌లైన్‌లో యూరియాను రైతులు బుక్ చేసుకోవడం చాల సమస్యగా మారిందని అన్నారు. ప్రతి రైతుకి అండ్రాయిడ్ మొబైల్ ఉంటేనే ఇది ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడం సాధ్యం అవుతుందని ఈ ఆండ్రాయిడ్ మొబైల్‌పై అవగాహన లేనటువంటి రైతులు ఆర్థికంగా ఖరీదైనటువంటి మొబైల్ ఫోన్లు కోనుగోలు చేయలేనటువంటి రైతులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా మండలాలకు సంబంధించిన రైతులకు వారి మండలానికి సంబంధించిన సోసైటీల ద్వారానే రైతులకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు. యూరియా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కోదాడ హుజూర్‌నగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తుండగా చిలుకూరు మండల వ్యవసాయశాఖ అధికారులు రాస్తారోకో దగ్గరకు వచ్చి సిపిఐ నాయకులతో మాట్లాడి రైతులకు సంబంధించిన యూరియా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి షేక్ సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు, మండవ అచ్చయ్య, కస్తూరి సైదులు, పిల్లుట్ల కనకయ్య, దొంతగాని వీరస్వామి, మాదారపు వెంకటేశ్వర్లు, దొడ్డ నాగేశ్వరరావు, పిల్లుట్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని బిజెపి ఖూనీ చేస్తోంది

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/యాదాద్రి :** పార్లమెంటులో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, విపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్సభలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సస్పెండ్ అయిన తోటి ఎంపీలతో కలిసి పార్లమెంటు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. దేశంలోని వాస్తవ పరిస్థితులు బయటపడకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడే హక్కును కాలరాస్తోందని మండిపడ్డారు.లోక్‌భలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతుంటే, కావాలనే అనురాగ్ ఠాగూర్, నిశికాంత్ దూబే వంటి వారు అడ్డుతగిలారని ఆయన ఆరోపించారు. కనీసం ప్రతిపక్ష నేత మైక్ కూడా స్పీకర్ వేరే వారికి ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని విమర్శించారు. దీనిపై ఆందోళన వ్యక్తం చేసిన తమను సస్పెండ్ చేయడం ద్వారా 8 మంది ఎంపీల నోరు నొక్కే ప్రయత్నం చేశారని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీకి లోక్సభ సమావేశాలను సజావుగా నడపాలనే ఉద్దేశ్యం లేదని, ప్రజా సమస్యలపై చర్చకు వారు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌లు పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి అంజద్‌అలీ అధ్యక్షతన జరిగిన ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ముందుకు సాగాలన్నారు. టిక్కెట్ రానివారు నిరాశ చెందవద్దని పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలన్నారు. కొన్ని సమీకరణల వల్ల కొంతమందికి టిక్కెట్లు ఇవ్వలేకపోయామని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసేందుకు అభ్యర్థులు దొరకక కాంగ్రెస్ పార్టీ నుండి పోయిన వాళ్ళకు టిక్కెట్లు ఇచ్చి ఎన్నికల బరిలో నిలిపారన్నారు. సూర్యాపేట నియోజక వర్గంలో బిఆర్ఎస్ ఎంతో బలహీనపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, రాష్ట్ర నాయకులు చకిలం రాజేశ్వర్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో అంతా అవినీతే

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కాంగ్రెస్ పాలనలో అంతా అవినీతేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటిలోని 39, 41 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలో ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించినా రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో సూర్యాపేట అభివృద్ధి మసకబారిందన్నారు. గత బిఆర్ఎస్ పదేండ్ల పాలనలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశానని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లు దాటినా ఎక్కడా అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఆ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాధనాన్ని దోచుకోవడం, దాచుకోవడం జరుగుతుందన్నారు. వారి మధ్య పొత్తులు కుదరక గొడవలు పడుతున్నారని అన్నారు. సూర్యాపేట పట్టణంలో కాంగ్రెస్ నాయకుల భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లు ఎక్కువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో 39వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి దంతాల సాయిప్రియ సందీప్, 41వ వార్డు అభ్యర్థి ఢిల్లీ పావని ఉపేందర్, మాజీ జడ్‌పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, నాయకులు ఉప్పల ఆనంద్, సూర్యాపేట పట్టణ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ పాల్గొన్నారు.



# మున్సిపల్ పోరు: అయిలయ్య 'ఆరు' గురి!

సిపిఐతో చెక్కుచెదరని బంధం..
ఆలేరులో సరికొత్త 'రాజకీయ కూర్పు'
మిత్రపక్షానికి సముచిత స్థానం..
యాదగిరిగుట్టలో ఏకగ్రీవంతో
మొదలైన విజయయాత్ర
అభ్యర్థుల ఎంపికలో సామాజిక
సమీకరణాలకే పెద్దపీట





**ప్రజాపక్షం/ యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా జిల్లా కాంగ్రెస్ సారథి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తనదైన శైలిలో వ్యూహరచన చేస్తూ ప్రత్యర్థులకు అందనంత దూరం దూసుకెళ్తున్నారు. పురపోరులో ఆయన వేస్తున్న అడుగులు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆలేరు నియోజకవర్గ గడ్డపై కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించేందుకు అయిలయ్య 'డబుల్ ఇంజన్' వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. కేవలం కాంగ్రెస్ బలంపైనే కాకుండా, మిత్రపక్షమైన సిపిఐని కలుపుకొని వెళ్తూ ప్రత్యర్థులకు దిమ్మతిరిగే షాక్ ఇస్తున్నారు. 'పొత్తు ధర్మం' అంటే కేవలం కాగితాలకే పరిమితం కాదని, అది క్షేత్రస్థాయిలో విజయానికి మార్గమని అయిలయ్య నిరూపిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మిత్రపక్షమైన సిపిఐకి అయిలయ్య అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారు. యాదగిరిగుట్టలో 'కంకి కొడవలి' గుర్తుపై పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపును తన గెలుపుగానే భావిస్తూ ప్రచార పర్వంలో వారిని ముందు వరుసలో నిలబెడుతున్నారు. ఓట్ల చీలికకు తావులేకుండా, కాంగ్రెస్ కార్యకర్తలు సిపిఐ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసేలా క్షేత్రస్థాయిలో సమన్వయం చేస్తున్నారు. ఈ ఐక్యత ప్రతిపక్ష బిఆర్ఎస్ శ్రేణుల్లో గుబులు రేపుతోంది.

**వ్యూహాత్మక అడుగు.. ఏకగ్రీవంతో బోణీ**
యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అయిలయ్య చాణక్యం అప్పుడే ఫలితాలను ఇవ్వడం మొదలుపెట్టింది. పదో వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థిని పోటీ నుంచి తప్పించడంలో ఆయన విజయవంతం కావడంతో, కాంగ్రెస్ ఖాతాలో తొలి విజయం ఏకగ్రీవం రూపంలో చేరింది. 2020 ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి 12 వార్డులకు 12 కైవసం చేసుకోవాలనే పట్టుదలతో అయిలయ్య ఉన్నారు. అప్పట్లో అత్యధిక సీట్లు సాధించినా, సాంకేతిక కారణాలతో మున్సిపల్ పీఠాన్ని కోల్పోయిన చరిత్ర మళ్ళీ పునరావృతం కాకూడదని ఆయన గట్టిగా భావిస్తున్నారు. యాదగిరిగుట్ట మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేసి అధిష్టానానికి విజయ కానుకగా ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు.

**సామాజిక సమీకరణాలే 'గెలుపు మంత్రం'**
టికెట్ల కేటాయింపులో అయిలయ్య అనుసరించిన 'సోషల్ ఇంజనీరింగ్' ప్రత్యర్థులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కేవలం గెలుపు గుర్రాలకే కాకుండా, అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా అభ్యర్థులను ఎంపిక చేశారు. నియోజకవర్గంలో బలంగా ఉన్న పద్మశాలి, ముదిరాజ్, గౌడ, మున్నూరు కాపు, కటిక, యాదవ, కురుమ కులాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించారు. మాదిగ సామాజిక వర్గంతో పాటు అరుదుగా రాజకీయ ప్రాధాన్యత దక్కే దాసరి, ఎరుకల కులస్తులకు టికెట్లు ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు.

**రెబల్స్ బెడదకు 'నామినేటెడ్' విరుగుడు**
పార్టీలో అసమ్మతి సెగలు రేగకుండా ఉండటానికి అయిలయ్య ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. టికెట్ ఆశించి భంగపడ్డ సీనియర్ నాయకులను స్వయంగా కలిసి, భవిష్యత్తులో వారికి నామినేటెడ్ పదవుల ద్వారా న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. దీంతో అభ్యర్థుల మధ్య సమన్వయం పెరిగి, అందరూ సమిష్టిగా ప్రచారంలో పాల్గొంటున్నారు. మరోవైపు, పొత్తు ధర్మాన్ని పాటిస్తూ యాదగిరిగుట్టలో వామపక్షాలకు (కంకి కొడవలి) మద్దతు ప్రకటించడం ద్వారా లౌకిక ఓట్లు చీలకుండా జాగ్రత్త పడ్డారు.

**అభివృద్ధి – సంక్షేమమే ప్రచారాస్త్రాలు**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించిన రూ.1,500 కోట్లు, గోపురానికి స్వర్ణ తాపడం పనులు, ఆరు గ్యారంటీల అమలును ప్రచారంలో ప్రధానంగా వాడుతున్నారు. చెరువులను నింపుతూ భూగర్భ జలాలను పెంచడం, రైతులకు సాగునీటి భరోసా కల్పించడం వంటి స్థానిక అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఇప్పటికే యాదగిరిగుట్టలో ప్రచారం పూర్తి చేసి ఆలేరులో జోరు పెంచిన అయిలయ్య, త్వరలోనే డీసీసీ అధ్యక్షుడి హోదాలో మోత్కూరు, భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లోనూ సుడిగాలి పర్యటనలు చేయనున్నారు.

**ఎంపీ, ఎమ్మెల్యేలతో సమన్వయం**
ఒకవైపు జిల్లాలోని సహచర ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామెల్, ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డిలతో సమన్వయం చేసుకుంటూనే, మరోవైపు తన సొంత నియోజకవర్గంలో పట్టు కోల్పోకుండా 'డ్యూయల్ రోల్' పోషిస్తున్న అయిలయ్య తీరు కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి' అన్న సూత్రంతో ఆలేరులో క్లీన్ స్వీప్ సాధిస్తే, జిల్లా మొత్తం మీద దాని ప్రభావం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**జిల్లాపై అయిలయ్య మార్క్**
డీసీసీ అధ్యక్షుడిగా కేవలం ఆలేరుకే పరిమితం కాకుండా, జిల్లాలోని భువనగిరి, మోత్కూరు, పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నారు. అభ్యర్థులకు బి ఫారాల పంపిణీ నుంచి సమన్వయకర్తల నియామకం వరకు అంతా తానై వ్యవహరిస్తున్నారు. మిత్రపక్షమైన సిపిఐతో కలిసి అయిలయ్య సాగిస్తున్న ఈ 'విజయ యాత్ర' మున్సిపల్ ఎన్నికల్లో సరికొత్త రికార్డులను సృష్టించే దిశగా సాగుతోంది. అయిలయ్య అనుసరిస్తున్న ఈ 'అగ్రెసివ్ స్ట్రాటజీ', అభ్యర్థుల ఎంపికలో వేగం, ప్రచారంలో జోరు చూస్తుంటే జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ సిపిఐ కూటమి 'క్లీన్ స్వీప్' చేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.



# మిత్ర ద్రోహి.. దేశ ద్రోహి..

### పార్లమెంట్ వెలుపల రాహుల్ గాంధీ, బిజెపి ఎంపి మధ్య వాగ్వాదం..

**న్యూఢిల్లీ :** బుధవారం పార్లమెంట్ వెలుపల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒకప్పటి తన సహచరుడు, ప్రస్తుతం బిజెపి ఎంపి అయిన రవ్‌నీత్ సింగ్ బిట్టూను 'మిత్ర ద్రోహి'గా రాహుల్ గాంధీ అభివర్ణించారు. దానికి కౌంటర్‌గా రాహుల్‌ను బిట్టూ 'దేశద్రోహి'గా అభివర్ణించారు. పార్లమెంట్ వెలుపల ద్వారం దగ్గర ఈ ఇద్దరూ ఎదురుపడినపుడు వాతావరణం వేడెక్కింది. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా కాంగ్రెస్ ఎంపిలు బుధవారం ఉదయం పార్లమెంట్ వెలుపల నిరసన తెలియజేశారు. అదే సమయంలో రవ్‌నీత్ సింగ్ బిట్టూ అక్కడకు వచ్చారు. కాంగ్రెస్ ఎంపిలతో కలిసి ఉన్న రాహుల్ గాంధీ, రవ్‌నీత్‌ను చూసి.. 'ఇదుగో.. ఒక ద్రోహి ఇటువైపు వచ్చారు. అతడి మొహం చూడండి' అని ఎద్దేవా చేశారు. అనంతరం బిట్టూకు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి చేయి ముందుకు చాచి.. 'హలో బ్రదర్.. మిత్ర ద్రోహి. కంగారు పడకు.. నువ్వు మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి వస్తావు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ కరచాలనం చేయడానికి చేయి ముందుకు చాచినప్పటికీ రవ్‌నీత్ సింగ్ బిట్టూ తిరస్కరించారు. రాహుల్ గాంధీని దేశ ద్రోహిగా బిట్టూ అభివర్ణించారు. 'ఏదో యుద్ధంలో గెలిచినట్టుగా వచ్చి ఇక్కడ కూర్చున్నారు' అంటూ బిట్టూ ముందుకు వెళ్లిపోయారు. ఆ క్రమంలో రాహుల్ గాంధీ, రవ్‌నీత్ బిట్టూ మధ్య కొద్ది సెకెన్ల పాటు మాటల యుద్ధం జరిగింది. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడిన రవ్‌నీత్ బిజెపిలో చేరారు. అప్పట్నుంచి రాహుల్, రవ్‌నీత్ మధ్య మాటల యుద్ధం జరుగుతూనే ఉంది.

# అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం

## లోక్‌సభలో కొనసాగిన వాయిదాల పర్వం

### బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి మోదీ ప్రసంగానికి ముందే సభ నేటికి వాయిదా

**న్యూఢిల్లీ :** విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ గురువారానికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు. కాగా, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో బుధవారం సైతం సభ పలుమార్లు వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరగాలంటూ విపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టారు. అదే విధంగా ఆర్మీ మాజీ చీఫ్ నరవణే విడుదలకానీ 'ఆత్మకథ' పుస్తకంలోని అంశాలను వారు లేవనెత్తారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో మధ్యాహ్నం 12.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. విపక్ష సభ్యులంతా పార్లమెంట్ మెట్ల మీదకు చేరుకుని.. ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైన వెంటనే, 2020లో చైనాతో ప్రతిష్టంభన అంశంపై ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ స్థానాల నుంచి లేచి నిలబడ్డారు. సభ్యుల నినాదాల మధ్యే స్పీకర్ బిర్లా పార్లమెంటరీ పత్రాలను ఉంచడానికి అనుమతించారు. తరువాత, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ భారతదేశం–అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రకటన చేశారు. కాంగ్రెస్ సభ్యులు మాజీ ఆర్మీ చీఫ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కూడిన బ్యానర్లు, పోస్టర్‌లను తీసుకువచ్చారు. రాహుల్ గాంధీ సభలో ఒక పుస్తకాన్ని ఎత్తిచూపుతూ కనిపించారు. నినాదాల నేపథ్యంలో స్పీకర్ సభ్యులను సభ గౌరవాన్ని కాపాడుకోవాలని కోరారు. బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శించినందుకు ప్రతిపక్ష సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష సభ్యులు పట్టు విడవకపోవడంతో, స్పీకర్ కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అంతకు ముందు, ప్రశ్నోత్తరాల సమయంలో కూడా సభ ఇలాంటి నిరసనలను చూసింది. నిరసనల మధ్య, సభ్యులను ప్రశ్నలు అడగడానికి అనుమతించాలని, ప్రతి ఒక్కరూ సభా కార్యకలాపాలను గౌరవించాలని, అలాగే సభలో మర్యాదను పాటించాలని బిర్లా అన్నారు. సుమారు ఐదు నిమిషాల పాటు సాగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్న, దాని అనుబంధ ప్రశ్నలను స్వీకరించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, టిడిపి ఎంపి హరీష్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై తన ప్రసంగాన్ని తిరిగి ప్రారంభించారు. బాలయోగి తర్వాత, స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ టెన్నేటి, దూబేను మాట్లాడమని సూచించారు. రాహుల్ గాంధీ ప్రచురించని పుస్తకం గురించి మాట్లాడాలని కోరుకుంటున్నప్పటికీ, గాంధీ కుటుంబాన్ని బహిర్గతం చేయడానికి తాను వరుస పుస్తకాలను తీసుకువచ్చానని దూబే అన్నారు. గాంధీ కుటుంబంలోని వివిధ సభ్యుల గురించి దూబే పుస్తకాలు, వారు చెప్పిన విషయాలను చదువుతూనే ఉన్నారు. స్పీకర్ ఇప్పటికే అలాంటి వ్యాఖ్యలను అనుమతించనందున దీనిని అనుమతించలేనని టెన్నేటి అన్నారు. అటువంటి వ్యాఖ్యలు చేయకూడదని టెన్నేటి నియమం 349ని ఉదహరించారు. ప్రతిపక్ష సభ్యులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేయడం, దూబే పట్టు వదలకపోవడంతో టెన్నేటి సభను సాయంత్రం 5 గంటల వరకు వాయిదా వేశారు. సభ వాయిదా పడిన తర్వాత, గాంధీ కుటుంబానికి వ్యతిరేకంగా దూబే మాట్లాడటానికి అనుమతించాలనే స్పీకర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపిలు స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. పార్లమెంట్ భవనం వెలుపల, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడటానికి అనుమతించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపిలు ప్రదర్శన నిర్వహించారు.



## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..

# ఇద్దరు జైషే ఉగ్రవాదుల హతం..




**జమ్ము:** జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో పాక్‌కు చెందిన ఇద్దరు జైషే మమ్మద్ ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిలో ఒకరిని ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా చురుకుగా పనిచేస్తున్న 'జైషే' టాప్ కమాండర్ అవు మావియాగా, మరొకరిని జబ్బర్ అనే ఉగ్రవాదిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 'కియా' పేరుతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టారు. అధికారుల సమాచారం ప్రకారం, జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం అందడంతో భద్రతా దళాలు, సిఆర్‌పిఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మిలిటెంట్లు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయారు. నిఘా డ్రోన్ వారిని ఒక గుహలో దాక్కున్నట్టు గుర్తించడంతో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. గుహ మొదట్లో ఒక ఉగ్రవాది, గుహలోపల మరొక ఉగ్రవాది మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. వారి నుంచి ఒక ఎం4 కార్బైన్, ఒక ఎకె47 రైఫిల్, మరికొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

# బొగ్గు రవాణాతో పర్యావరణ సమస్యలు

### కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపి కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లాలో బొగ్గు రవాణా వల్ల కలిగే పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలపై లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బొగ్గు రవాణా, దానికి అనుబంధ లాజిస్టిక్స్ కారణంగా రహదారి, రైలు మార్గాల్లో కాలుష్యం పెరుగుతోందా? వరంగల్ జిల్లాపై దాని ప్రభావం ఏ మేరకు ఉందో అధ్యయనం చేశారా? దుమ్ము కాలుష్యం తగ్గించేందుకు, ప్రజల భద్రత కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారో వివరాలు ఇవ్వాలని ఎంపీ డా.కడియం కావ్య ,కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరారు.వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వరంగల్‌కు సమీపంలో ఉన్న బొగ్గు గనులు జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి ప్రాంతంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజూ సుమారు 4 వేల టన్నుల బొగ్గును భూపాలపల్లి గనుల నుంచి ఉప్పల్ రైల్వే సైడింగ్‌కు రహదారి మార్గంలో టార్పాలిన్ కవర్లు వేసిన లారీల ద్వారా సుమారు 56 కిలోమీటర్ల మేర తరలిస్తున్నట్లు తెలిపారు. బొగ్గు రవాణా ప్రభావాలపై ఈపీటీఆర్ఐ ద్వారా గాలి నాణ్యత, శబ్ద కాలుష్యం, నీటి నాణ్యత, సామాజిక అంశాలపై అధ్యయనాలు నిర్వహించామని, ట్రాఫిక్ ప్రభావ అంచనా నివేదికలు కూడా సిద్ధం చేశామని మంత్రి పేర్కొన్నారు. పర్యావరణ అనుమతుల నిబంధనలు, కేంద్ర పర్యావరణ శాఖ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తున్నామని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పర్యావరణ అనుసరణ నివేదికలు సమర్పిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. డ్రైవర్లకు బ్రెత్ అనలైజర్ పరీక్షలు నిర్వహిస్తూ రోడ్డు భద్రతపై కూడా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఈమేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులకు ఇవి సరిపోతాయా? అంటూ ఎంపీ డా.కడియం కావ్య ప్రశ్నించారు. బొగ్గు లారీల వల్ల గ్రామాల గుండా దుమ్ము మబ్బుల్లా ఎగసిపడుతోందని, చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. కేంద్రం చెబుతున్న నివేదికలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉన్నాయని పేర్కొంటూ, కేవలం కాగితాలపై కాకుండా వాస్తవంగా దుమ్ము కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు అమలు చేయాలని కేంద్రాన్ని ఎంపి కోరారు.

## 'అడగ్'...రూ.40,000 కోట్ల భారీ బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై...

# న్యాయమైన, సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు

### సిబిఐ, ఇడిలకు 'సుప్రీం' ఆదేశం

### దర్యాప్తులో తీవ్రస్థాయి జాప్యం చోటుచేసుకోవడంపై తీవ్ర అసంతృప్తి

**న్యూఢిల్లీ** అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (అడగ్), అనిల్ అంబానీ & గ్రూప్ కంపెనీలకు సంబంధించిన రూ.40,000 కోట్ల భారీ బ్యాంకింగ్, కార్పొరేట్ మోసంపై దర్యాప్తులో 'తీవ్రస్థాయి జాప్యం' చోటుచేసుకోవడం పట్ల బుధవారం సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది. వీటిపై 'న్యాయమైన', 'సత్వర', నిష్పాక్షిక దర్యాప్తును నిర్వహించాలని అత్యున్నత న్యాయస్థానం సిబిఐ, ఇడిలను ఆదేశించింది. ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్) పిటిషనర్, మాజీ బ్యూరోక్రాట్ ఇఎఎస్ శర్మ పారిపోవచ్చునని భావించినప్పుడు అనిల్ అంబానీ తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ముందస్తు అనుమతి లేకుండా అతడు దేశం విడిచి వెళ్లడని హామీ ఇచ్చారు. అంబానీ, ఎడిఎజి సంస్థలపై జరుగుతున్న దర్యాప్తులో సాధించిన పురోగతిపై 4వారాలలోపు తాజా స్టేటస్ రిపోర్టులను సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచౌలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం సిబిఐ, ఇడిని కోరింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ రెండూ ఇప్పటికే తగిన సమయం తీసుకున్నందున రెండు ఏజెన్సీలు వెంటనే చర్యలు తీసుకుంటాయని తాము ఆశిస్తున్నామని బెంచ్ పేర్కొంది. ఎడిఎజి, ఇతరులతో దర్యాప్తును త్వరగా తార్కిక ముగింపునకు తీసుకెళ్లడానికి సీనియర్ అధికారులతో కూడిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)ని కోరింది. సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, శ్యామ్ దివాన్ అనిల్ అంబానీ, ఎడిఎజి హాజరును పరిగణలోనికి తీసుకున్న ధర్మాసనం ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై ప్రతిస్పందనలను దాఖలు చేయడానికి వారికి 4వారాల సమయం ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా 2025లో ఏజెన్సీ ఒకే ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని, అనేక ఇతర ఆర్థిక సంస్థల నుండి కూడా ఫిర్యాదులు అందాయని ధర్మాసనం సిబిఐ విధానపరమైన విధానంపై ధర్మాసనం మండిపడింది. అనుగుణంగా ఉన్నట్లు కనిపించడంలేదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ప్రతీ బ్యాంక్ ఫిర్యాదు ప్రత్యేక ట్రాన్సాక్షన్‌ను, వారంట్లను కలిగి ఉంటుందని, స్వతంత్ర విచారణకు హామీ ఇస్తుందని జోడించారు.

## ఎన్‌సిపి విలీనంపై

# మాట్లాడే హక్కు ఫడ్నవీస్‌కు లేదు

### శరద్ పవార్ ఘాటు వ్యాఖ్యలు

**బారామతి:** ఎన్‌సిపి రెండు వర్గాల విలీనంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు మాట్లాడే హక్కు లేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎస్‌పి) అధినేత శరద్ పవార్ అన్నారు. విలీన చర్చలు అజిత్ పవార్, జయంత్ పాటిల్ మధ్యే జరిగాయని, అందులో ఫడ్నవీస్ పాత్ర లేదని చెప్పారు. బుధవారం బారామతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'సునేత్రా పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం నాకు సంతోషంగా ఉంది. అయితే విలీన చర్చలు అజిత్ పవార్, జయంత్ పాటిల్ మధ్యే జరిగాయి. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ఆ చర్చల్లో లేరు.ప్రస్తుతం కుటుంబ విషాద పరిస్థితుల దృష్ట్యా రాజకీయ నిర్ణయాలపై ఎలాంటి చర్చలు లేవని ఆయన స్పష్టం చేశారు. 58 ఏళ్లలో తొలిసారి బడ్జెట్ రోజున గైర్హాజరు ఈసారి బడ్జెట్ రోజున పార్లమెంట్‌కు హాజరు కాలేకపోయినట్లు శరద్ పవార్ తెలిపారు. 'గత 58 ఏళ్లుగా నేను బడ్జెట్ రోజున పార్లమెంట్‌కు తప్పనిసరిగా హాజరయ్యాను. కానీ ఈసారి కుటుంబంలో జరిగిన ఘటన కారణంగా వెళ్లలేకపోయా. అయితే బడ్జెట్‌ను చదివిన తర్వాత నాకు కొన్ని సమస్యలు కనిపిస్తున్నాయి. ఈసారి కొత్త తరహా పన్ను ప్రవేశపెట్టారు. ఇది సామాన్య ప్రజలకు భారంగా మారే అవకాశం ఉంది. అభివృద్ధి పనులను వేగవంతం చేసే స్పష్టమైన చర్యలు ఉండాల్సింది' అని శరద్ పవార్ అన్నారు.

**భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనుమానాలు**

ఇక ఇటీవల జరిగిన భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంపై శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మన రైతులకు హాని కలిగించవచ్చని అన్నారు. ఏదైనా డీల్ ముగించే ముందు ఒప్పందం గురించి మరిన్ని వివరాలు అవసరమని తెలిపారు. 'ఈ ఒప్పందం పూర్తి వివరాలు రెండు మూడు రోజుల్లో బయటకు రావాలి. అప్పుడే లోతైన చర్చ జరగాలి. ఇప్పటివరకు వచ్చిన సమాచారం ప్రకారం అమెరికా వ్యవసాయ ఎగుమతులకు మార్గం సుగమం చేస్తున్నట్లు కనిపిస్తోంది, ఇది ఆందోళనకరం.అమెరికా ఇప్పటి వరకు వెల్లడించిన వివరాలు ప్రకారం చూస్తే భారత వ్యవసాయ రంగంలోకి ఎగుమతులు పెంచితే రైతులకు నష్టం జరిగే అవకాశం ఉంది.

## కొరియన్ లవ్ గేమ్‌కు బానిసలైన

# అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య

### 9వ అంతస్తు నుంచి దూకి ముగ్గురు తోబుట్టువులు బలవన్మరణం

**గజియాబాద్:** కొరియన్ లవ్ గేమ్‌కు బానిసలైన ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్లు చివరికి తమ ప్రాణాలు తీసుకున్నారు. కొరియా మీద పిచ్చితో ఏకంగా తమ పేర్లను కూడా మార్చుకున్నారు. పాఠశాలకు వెళ్లకుండా, ఎవరితో మాట్లాడకుండా ఫోన్ స్క్రీన్‌లకు అతుక్కుపోయారు. ఇలా చేయొద్దన్న తల్లిదండ్రుల మాటలను పెడచెవిన పెట్టారు. కానీ చివరకు తమను క్షమించండంటూ అపార్ట్‌మెంట్ తొమ్మిదో అంతస్తు నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, గాజియాబాద్‌కు చెందిన చేతన్ కుమార్ దంపతులకు 16, 14, 12 ఏళ్ల నిషిక, ప్రచి, పఖి అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ముగ్గురు బాలికలు రెండున్నరేళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసలయ్యారు. కొరియన్ సంస్కృతిపై పిచ్చిఇష్టంతో తమ పేర్లను కూడా కొరియా పేర్లకు తగ్గట్లు మార్చుకున్నారు. మధ్య బాలిక ప్రచీ మిగిలిన ఇద్దరికి ఈ గేమ్ ఎలా ఆడాలో, టాస్క్‌లు ఎలా పూర్తి చేయాలో తెలిపేది. గేమ్‌లో పడి ఏడాదిగా పిల్లలు పాఠశాలకు కూడా వెళ్లడం లేదు. ఎవరితో మాట్లాడట్లేదు. తీవ్ర ఆందోళన చెందిన తల్లిదండ్రులు గతకొన్నిరోజులుగా గేమ్‌ను ఆడొద్దంటూ ఒత్తిడిని పెంచారు. అయితే బుధవారం రాత్రి రెండున్నర గంటల సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు తమ అపార్ట్‌మెంటు 9వ అంతస్తు నుంచి దూకి బలవన్మరానికి పాల్పడ్డారు. అందరూ నిద్రపోయేదాకా చూసి రాత్రి 2 గంటల సమయంలో అపార్ట్‌మెంట్ పైనుంచి దూకారు. శబ్దం విని బయటకు వచ్చిన చుట్టుపక్కలవారు రక్తపుమడుగులో పడి ఉన్న చిన్నారులను చూసి నిర్ఘాంతపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నప్పటికీ, నిద్రలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాలికలు వినియోగించిన ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని సైబర్ నిపుణుల సాయంతో విశ్లేషిస్తున్నట్లు వివరించారు.

**క్షమించండి అంటూ నోట్**

ఇంట్లో ఒక నోట్ లభించిందని డిసిబి నిమిశ్ పాటిల్ తెలిపారు. అందులో వారు కొరియన్ సంస్కృతి ప్రభావితమయ్యారని స్పష్టం అయ్యిందని అయితే ఏ గేమ్ యాప్ పేరు నోట్‌లో ప్రస్తావించలేదని అన్నారు. బాలికలు ఆన్‌లైన్ టాస్క్‌బేస్డ్ గేమ్ ఆడేవారని ప్రాథమిక విచారణలో తెలిసింది. అయితే మిగిలిన నిజాలను తమ డైరీలో రాసిపెట్టామని, కచ్చితంగా దాన్ని చదవాలని ఆ నోట్‌లో రాశారు. బాలికలు భవనం నుంచి కిందకు దూకడం చూసినట్లు ప్రత్యక్ష సాక్షి అరుణ్ కుమార్ తెలిపాడు. అది చాలా అకస్మాత్తుగా జరిగింది. వాళ్లు బాల్కనీ గ్లాస్‌పై కూర్చుని ఉన్నారు. వారిలో ఒకరు దూకాలని నిర్ణయించుకున్నట్లు అనిపించింది. మిగతా ఇద్దరు ఆమెను రక్షించే ప్రయత్నంలో కిందకు పడిపోయి ఉండొచ్చు. వెంటనే నేను పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాం' అని అరుణ్ కుమార్ చెప్పాడు. అయితే నేను ఒంటరిదాన్ని అంటూ గది గోడపై కూడా రాసి ఉన్నట్లుగా తెలుస్తోంది. డైరీలోని 8 పేజీల్లో తాము కొరియాను ఎంత ఇష్టపడుతున్నామో వివరించినట్లు సమాచారం. కొరియాను విడిచి ఉండలేమని, కొరియానే తమ ప్రాణమని, అందుకే ప్రాణాలను తీసుకుంటున్నామని రాసుకొచ్చారు. గేమ్‌లో ఆత్మహత్య టాస్క్ ఉంటుందని తనకు తెలియదని, తెలిస్తే ఇలా జరిగి ఉండేది కాదని రోదించారు.

## ఇసిసి జ్ఞానేష్‌కుమార్‌పై అభిశంసనకు ప్రతిపక్షాలు

# సామూహిక నిర్ణయం తీసుకుంటాయ్

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్




**న్యూఢిల్లీ :** కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై ప్రతిపక్షాలు కొంత కాలం నుంచి విమర్శలు చేస్తున్నారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ ఎన్‌డిఎ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడంపై యావత్ ప్రతిపక్షం సామూహికంగా నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ బుధవారం అన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభిశంసన చర్యకు పిలుపునిచ్చిన విషయం విదితమే. కాగా, బుధవారం పార్లమెంట్ భవన సముదాయంలో కెసి వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ తాము ఈ సూచనను సానుకూలంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. 'తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికే కాంగ్రెస్‌ను సంప్రదించింది... తృణమూల్ లేవనెత్తిన అత్యంత ముఖ్యమైన సమస్యలలో ఇది ఒకటి కాబట్టి, ఈ విషయంపై యావత్ ప్రతిపక్షం ఒక నిర్ణయం తీసుకుంటుందని నేను భావిస్తున్నాను. మేము దీనిని సానుకూలంగా పరిశీలిస్తున్నాము' అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)కు వ్యతిరేకంగా తన ప్రచారంలో భాగంగా ఢిల్లీలో ఉన్న బెనర్జీ, మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (ఇసిసి)పై అభిశంసన కోరారు. ఈ విషయంపై ఇతర ప్రతిపక్ష పార్టీల మద్దతును కూడగట్టడానికి ప్రయత్నించారు. సర్ సమస్యపై సిఇసి కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లతో జరిగిన సమావేశం నుండి ఆమె తన ప్రతినిధి బృందంతో కలిసి వాకౌట్ చేసిన ఒక రోజు తర్వాత తృణమూల్ అధినేత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం అధిపతి అహంకారం ప్రదర్శించారని, తమను అవమానించారని ఆమె ఆరోపించారు. సర్ ప్రక్రియ వల్ల ప్రభావితమైన తన రాష్ట్ర ప్రజలతో కలిసి విలేకరుల సమావేశంలో బెనర్జీ మాట్లాడుతూ తొలగించబడుతున్న ఓటర్ల పేర్లు తృణమూల్ మద్దతుదారులవని పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను అభిశంసించే ప్రక్రియ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే ప్రక్రియ మాదిరిగానే ఉంటుంది.


**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 725 OF 2024**

Between:-

**M/s.Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SMT. INDHA ASUNTHA & Others**

.....**Opponents**

To,

2. SMT. VISHALA POLEPAKA, D/o. KOMURAIAH, Age:44 years,Occu: Staff Nurse in MGM Hospital, H.No:11-4-227/2, Christian Colony, Narsampet Road, Warangal- 506013.
3. SMT. DURIVEMULA RAVIKUMARI, W/o. ARUN KUMAR, Age:53 years, Occu: Staff Nurse in MGM Hospital, H.No:11-5-220, Gandhinagar Church, Dist: Warangal.
4. SMT. GADIPALLI RAJALAXMI, W/o. SUGUN RAO, Age:46 years,Occu: Staff Nurse at Mulugu,H.No:33-6-88/2/1, Ganesh Nagar, Thimmapur Haveli, Khila Warangal-506005.
5. SMT. PINGILI LALITHA , W/o, HARINATTH, Age: 56 years, Occu: Staff Nurse in MGM Hospital at Warangal, R/o: 11-29-266, Ramanadapuri, Road No. 4, Beside Bank Colony-2, Warangal - 506002.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 726 OF 2024**

Between:-

**M/s.Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SMT. KUNARAPU SANDHYA RANI & Others**

.....**Opponents**

To,

1. SMT. KUNARAPU SANDYARANI, W/o. RAJENDER, Age:47 years, H.No: 5-170, Gandhi Nagar, Kadipikonda, Kazipet, Hanumakonda - 506003.
2. SRI. VADDEBOINA SANTHOSH BABU, S/o. MOGILI, Age:38 years, H.No: 8-2-52, Power House Colony, Godavari Colony, Ramagundam, Pedhapalli - 505209.
3. SRI. KUNARAPU RAJENDER, S/o. BHEEMAIAH, Age:53 years,H.No:58-5-175, Gandhi Nagar, Kadipikonda, Kazipet, Hanumakonda - 506003.
4. SRI. BAIRI SRINIVAS, S/o. NARSAIAH, Age: 46 years, H.No: 16-9-476/2, Shiva Nagar, Warangal - 506002.
5. SRI. BILLA RAJANIKAR REDDY, S/o. VENKAT REDDY, Age: 42 years, H.No: 5-161, Gandhi Nagar, KadipiKonda, Kazipet, Hanumakonda - 506003.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 727 OF 2024**

Between:-

**M/s. Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SRI. MALLEBOINA VENU & Others**

.....**Opponents**

To,

1. SRI. MALLEBOINA VENU, S/o. RAJAIAH, Age:40 years, Occu: RTC Driver, H.No: 31-3-645, Sapthagiri colony, Waddepally, Hanumakonda - 506370.
2. SRI. GHOUSE PASHA, S/o. MOULANA, Age:35 years,Occu: RTC Driver, H.No: 14-6-245, Mandi Bazar, Warangal - 506002.
3. SRI. TAKKULA GOVARDHAN, S/o. KOMURAIAH, Age:43 years, Occu: RTC Driver, H.No:4-52/1, Jangalapally, Mulugu - 506343.
4. SRI. GANGULA BIXAPATHI, S/o. SAMBAIAH, Age:36 years, Occu: RTC Driver, H.No: 2-142, Jangalapally, Mulugu - 506343.
5. SRI. MADDELA KUMARASWAMY, S/o. MALLAIAH, Age:40 years, Occu: RTC Driver, H.No:4-50/1, Jangalapally, Mulugu-506343.
6. SRI. MATHARASI SARANGAM S/o Veera Narsaiah Age: 54 years R/o. 2-5-881, Vinayakanagar Colony, Nakkalagutta, Hanamkonda - 506001.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 728 OF 2024**

Between -

**M/s. Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SRI. SAINI KUMARASWAMY & Others**

.....**Opponents**

To,

1. SRI. SAINI KUMARASWAMY, S/o AGAIAH, Age: 43 Years, R/o. H.No: 1-28, Chennapur, Regonda mandal, Jayashankar Bhupalpally Pincode: 506164.
2. SMT. AKULA ANUSHA, D/o. RAJAIAH Age:33 Years R/o. H.No : 3-236/3,Parkal Hanumakonda, Pincode : 506164. C/o. H.No: 1-28, Chennapur, Regonda mandal, Jayashankar Bhupalpally Pincode: 506164.
3. SMT AKULA SUMATHI, D/o. RAJENDAR, Age:42 years, R/oH.No:18-1-2, Adarshanagar Mahankali Temple, Rangashaipet, Warangal, Pincode : 506002.
4. SRI. VENNAMPALLY PAPAIAH, S/o. CHANDRAMOULI, Age:58 years, R/o H.No : 1-56, Bhagirthipet, Regonda mandal, Jashankar Bhupalpally , Pincode : 506345.
5. SRI. PUTTAPAKA SANDEEP, S/o LACHAIAH Age:28, R/o H.No:1-63 Mulugupally, Bayyaram, Jayashankar Bhupalpally Pincode: 505503.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 722 OF 2024**

Between:-

**M/s. Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SRI. BOLLAPALLY SRIKANTH & Others**

.....**Opponents**

To,

1. Sri. BOLLAPALLY SRIKANTH, S/o. SRINIVAS, Age: 27 years, R/o: H.No: 1-42, Ankushapur, Tekumatla Jayashankar Bhupalpally. Pincode : 506356.
2. SRI. PATEL SRINIVAS REDDY, S/o. VENKAT REDDY Age:45Years H.No: 2-2-155, Naimnagar, Gopalpur, Hanumakonda, Pincode: 506009.
3. SRI.KANDUKURI SRINIVAS, S/o. BRAHMAIAH, Age: 53 years, R/o: H.No: 3-53/9, Venkateshwara colony, Gopalapuram, Hanumakonda, Pincode: 506001.
4. SRI.ANTHANAGIRI ASHOK, S/o. RAJAIAH, Age: 29 years, R/o: H.No: 2-89, Ankushapur, Tekumatla Jayashankar Bhupalpally, Pincode : 506356.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 723 OF 2024**

Between:-

**M/s.Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SRI. DONIKENI PRABHAKAR & Others**

.....**Opponents**

To,

1. Sri. DONIKENI PRABHAKAR, S/o RAGHAVULU, Age: 34 Years, H.No: 1-72/A, Kommulavancha, Narsimhulapet, Mahabubabad - 506324.
2. SRI. NOOTHI SURESH, S/o. POCHAIAH Age: 50 Years H.No: 1-9-394, Julywada, Basithnagar, Subedari, Hanumakonda - 506001.
3. SRI. KANDALA YUGANDHAR, S/o. NIRANJAN, Age:52 years, H.No: 3-14-13/4/1, Yadavanagar, Hanumakonda - 506001.
4. SRI. GUDIKANDULA GOURISHANKAR, S/o. KOMURAIAH, Age: 53 years, H.No : 24-5-272, Afzalnagar, Dargha Kazipet, Hanumakonda - 506004.
5. SRI. GIRRA RAMACHANDER, S/o, UPPALAIAH, Age: 42 Years, H.No:4-82, Nehrunagar, Kadipikonda, Kazipet, Hanumakonda - 506003.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL**

**FILE NO. ABR.NO. 724 OF 2024**

Between -

**M/s. Tamanvi Chit Funds Pvt. Ltd., Hanamkonda Branch**

..... **Disputant**

And

**SMT. GARIGE VANI & Others**

.....**Opponents**

To,

1. SMT. GARIGE VANI, W/o. VARMA KIRAN, Age: 29 years, H.No: 3-1-201/1, Kakatiya Colony, Near Old Alankar Theater, Hanumakonda - 506001.
2. SRI. VONTERU JAMPAIAH, S/o. MOGILI, Age: 49 years, Occu: POLICE CONSTABLE at Hanamkonda, H.No: 15-2-157, Bhadrakali Temple, Warangal-506002.
3. SRI. GANDRA SRINIVAS, S/o. RAMANA , Age: 49 years, Occu: Plant Attendant in Kakatiya Thermal Power Project at Chelpur, H.No: 22-8-30, Doctors Colony, Deshaipet, Warangal - 506002.
4. SRI. MORE PRASHANTH, S/o. VENKATAIAH, Age: 30 years, Occu: Junior Plant Attendant in KTPP at Chelpur, H.No:3-175, Kompally, Bhupalpally, Jayashankar Bhupalpally-506168.
5. SRI BANDARI KIRAN VARMA, S/o. NAMPALLY, Age: 37 years, H.No: 3-81, Nagaram, Parkal, Hanumakonda - 506164.
6. SRI. SARANGAM MATHARASI, S/o. VEERA NARSAIAH, Age:53 years, Occu: Police Constable,H.No: 2-5-881,Vinayaka Nagar Colony, Near Circuit Guest House, Hanumakonda - 506001. C/o. H.No: 20-6-16, Zaffargadh, Jangoan - 506316.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on. **13-02-2025** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS WARANGAL**

# కార్పొరేట్ నేరాలపై అంతులేని నిర్లక్ష్యం!

చట్టం ముందు అందరూ సమానులేనని భారత రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. ధనికుడైనా, పేదవాడైనా న్యాయం ఒక్కటేనని స్పష్టం చేస్తున్నది. కానీ నేటి భారత వాస్తవ పరిస్థితిని చూస్తే, ఈ రాజ్యాంగ హామీ కాగితాలకే పరిమితమైనట్లు కనిపిస్తున్నది. కార్పొరేట్ దిగ్గజాల పట్ల చట్టాలు ఉదాశీనంగా ఉంటే, సాధారణ ప్రజలకు మాత్రం అవే చట్టాలు ఉక్కుపాదంలా మారుతున్న తీరు అనుమానాలకు తావిస్తున్నది. ఒక బడుగు రైతు బ్యాంకు రుణం చెల్లించలేకపోతే.. నోటీసులు, బెదిరింపులు, ఆస్తుల వేలం. కానీ వేల కోట్ల రూపాయల ప్రజాధనం బ్యాంకుల నుంచి తీసుకుని, సంవత్సరాల తరబడి చెల్లించకుండా, సంస్థలు దివాలా తీసినట్లు ప్రకటించి, ఆస్తులను తక్కువ ధరలకు తమకే అనుకూలంగా బదిలీ చేసుకుంటున్న కార్పొరేట్ పెద్దల విషయంలో మాత్రం, విచారణలు నత్తనడకన సాగుతాయి. ఫైళ్లు దుమ్ముపట్టిపోతాయి. కేసులు న్యాయస్థానాల్లో ఏళ్ల తరబడి చిక్కుల్లో పడతాయి. ఈ అసమానతే నేటి భారత ఆర్థిక వ్యవస్థను తొలిచేస్తున్న చీడపురుగు. దీనికి ఉదాహరణగా అనిల్ అంబానీ కేసును పేర్కొనవచ్చు. సుమారు రూ.40,000 కోట్ల మేర బ్యాంకింగ్, కార్పొరేట్ మోసాలకు సంబంధించిన అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (ఎడిఎజి) వ్యవహారంలో సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేయడం, కేవలం ఒక వ్యక్తికి లేదా కార్పొరేట్ గ్రూప్‌కు మాత్రమే పరిమితం కాదు. మొత్తం దర్యాప్తు వ్యవస్థపై, పాలనా యంత్రాంగంపై, రాజకీయ–కార్పొరేట్ మధ్య ఉన్న అవాంఛనీయ సంబంధాలపై గురిపెట్టిన ప్రశ్నగా తోస్తుంది. అవకతవకలు, మోసాలు 2007–08 నుంచే సాగుతున్నాయని ఆరోపణలున్న భారీ ఆర్థిక మోసాలపై, సిబిఐ ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 2025 వరకు ఎదురుచూడాల్సి రావడం ఏం సూచిస్తోంది? అంత పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేసిన బ్యాంకులు, వాటిలో జరిగిన నిధుల మళ్లింపులు, నకిలీ గ్యారంటీలు, దివాళా ప్రక్రియలో ఆస్తుల తక్కువ ధరల విక్రయాలు ఎందుకు కనిపించలేదు? కనిపించినా చూసీచూడనట్టు వ్యవహరించారా? సుప్రీంకోర్టు ఈ అన్యాయమైన ఆలస్యంపై అసహనం వ్యక్తం చేయడం వెనుక ప్రజల ఆవేదన ఉంది. ఎందుకంటే, ఒకవేళ వ్యవస్థ నిజంగా నిష్పక్షపాతంగా పనిచేసుంటే, దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం అవసరమే ఉండేది కాదు. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఇడి) వంటివి సిద్ధాంతపరంగా స్వతంత్ర దర్యాప్తు సంస్థలు. కానీ వాస్తవంలో అవి రాజకీయ ప్రభావాలకు లోనవుతున్నాయన్న విమర్శలు కొత్తవి కావు. కొన్ని కేసుల్లో అవి మెరుపు వేగంతో పనిచేస్తాయి...మరికొన్నింటిలో సంవత్సరాల తరబడి జాప్యం చేస్తాయి. ఈ వ్యత్యాసం ఎందుకు? అనిల్ అంబానీ వ్యవహారంలో, వివిధ బ్యాంకుల నుంచి వచ్చిన ఫిర్యాదులు అనేకం ఉన్నప్పటికీ, ఇడి ఒకే ఒక్క ఎఫ్ఐఆర్‌కే పరిమితం కావడం సుప్రీంకోర్టును కూడా ఆశ్చర్యపరిచింది. ప్రతి బ్యాంకు ఫిర్యాదునూ ఒక స్వతంత్ర అంశంగా చూడాలని, విడివిడిగా ఎఫ్ఐఆర్ అవసరమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించాల్సిన పరిస్థితిని గమనిస్తే, దర్యాప్తు సంస్థలు ప్రాథమిక న్యాయ ప్రక్రియలను కూడా విస్మరించాయన్న అనుమానం తలెత్తుతుంది. అంతేకాదు, బ్యాంకు అధికారుల పాత్రపై విచారణ జరపాలని కోర్టు ఆదేశించాల్సి రావడం మరింత తీవ్రమైన విషయం. ఎందుకంటే, ఇంత పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు కావడం ఒక్క కార్పొరేట్ నిర్ణయంతో జరగదు. బ్యాంకుల బోర్డులు, ఉన్నతాధికారులు, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ తదితరాలన్నీ ఇందులో భాగమే.

బ్యాంకులు, ప్రత్యేకించి ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రజాధనానికి కాపలాదారులా? లేక కార్పొరేట్ భాగస్వాములా? అనేది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రజాధనంతో నడుస్తాయి. అవి సామాన్య ప్రజల డిపాజిట్లపై ఆధారపడి ఉంటాయి. కానీ గత రెండు దశాబ్దాల్లో చూస్తే, వేల కోట్ల రూపాయల భారీ రుణాల విషయంలో బ్యాంకులు అసాధారణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించాయి. సరైన గ్యారంటీలు లేకుండానే రుణాలు మంజూరు చేయడం, వ్యాపార నమూనాలు విఫలమవుతున్నా అదనపు రుణాలు ఇవ్వడం, హెచ్చరిక సంకేతాలను పట్టించుకోకపోవడం వంటివి వ్యవస్థాగత వైఫల్యాలా? లేక లంచావతారుల గారడీలా? ఈ లొసుగుల ఆధారంగానే, తీసుకున్న రుణాలను అనిల్ అంబానీ వంటి 'పెద్దలు' ఎగవేస్తారు. బ్యాంకులు నష్టాల్లోకి వెళ్తాయి. ఆ మూలధన లోటును ప్రభుత్వం భర్తీ చేస్తుంది. అంటే ప్రజల డబ్బు బ్యాంకులను కాపాడుతుంది. కానీ, ఆ నష్టానికి కారణమైన కార్పొరేట్ పెద్దలపై మాత్రం తగిన చర్యలు ఉండవు. ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబిసి) బ్యాంకింగ్ వ్యవస్థను శుభ్రం చేస్తుందని, రుణ ఎగవేతలకు అడ్డుకట్ట వేస్తుందని ప్రచారం జరిగింది. కానీ అదే చట్టం, అనేక సందర్భాల్లో ఎగవేతదారులకు ఒక రక్షణ కవచంలా మారుతున్నది.

అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ వంటి సంస్థలు రూ. వేల కోట్ల అప్పులతో ఉన్నప్పటికీ, కేవలం కొన్ని వందల కోట్లకే అమ్ముడుపోవడం వ్యవస్థలోని లోపాలను స్పష్టంగా చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ఐబిసిని దుర్వినియోగం చేస్తున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం ఒక హెచ్చరిక. కార్పొరేట్ శక్తి రాజకీయాలను ప్రభావితం చేస్తుందా? లేక రాజకీయాలు కార్పొరేట్‌లకు రక్షణగా నిలుస్తున్నాయా? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. కానీ పరిస్థితులు చూస్తే, రెండు వ్యవస్థల మధ్య ఒక అప్రకటిత అనుబంధం ఉందన్న భావన ప్రజల్లో బలంగా ఉంది. ఎన్నికల విరాళాలు, లాబీయింగ్, విధాన నిర్ణయాలపై ప్రభావం తదితరాలు కార్పొరేట్‌లను కాపాడుతున్నాయన్న అనుమానం సహజం.

ఈ నేపథ్యంలోనే, దర్యాప్తు సంస్థల చర్యలు కూడా రాజకీయ సంకేతాలపై ఆధారపడి ఉంటాయన్న విమర్శలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే ప్రజలు సుప్రీంకోర్టును చివరి ఆశగా చూస్తున్నారు. అనిల్ అంబానీ కేసులో కోర్టు చూపిన చురుకుదనం, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు ఆదేశాలు, స్టేటస్ రిపోర్టులు కోరడం, విదేశాలకు వెళ్లకుండా ఆంక్షలు వంటి చర్యలు కొంత ఊరటనిస్తున్నాయి. అయితే, ప్రతీ పెద్ద కార్పొరేట్ మోసం విషయంలోనూ సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలా? దర్యాప్తు సంస్థలు తమ బాధ్యతను స్వయంగా నిర్వర్తించలేవా? సుప్రీం కోర్టు నుంచి ఈ ప్రశ్నలకు సమాధానం వచ్చేలా, స్పష్టమైన ఆదేశాలు.. మార్గదర్శకాలు వెలువడుతాయని ఆశిద్దాం.



## తక్షణమే ఎంపిల సస్పెన్షన్ రద్దు చేయాలి

**జాతీయ భద్రతా విషయాలపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లేవనెత్తిన ప్రశ్నలకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది? మంగళవారం లోక్‌సభలో సస్పెండ్ చేసిన ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను తక్షణమే రద్దు చేయాలి. జాతీయ ప్రాముఖ్యత ఉన్న అంశాలపై మాట్లాడే సభ్యుల ప్రజాస్వామ్య హక్కును పునరుద్ధరించాలి. ప్రభుత్వం సభకు జవాబుదారీగా ఉండాలి. ప్రభుత్వం సభలోని సభ్యులకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలి. జాతీయ భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై స్పష్టత ఇవ్వాలి.**

– తమిళనాడు ముఖ్యమంత్రి
ఎం.కె. స్టాలిన్




## అమ్మాయిలకు ఆటలు నిషేధమా?

క్రీడలు అంటే కేవలం పోటీ లేదా పతకాలు గెలవడం గురించి కాదు అవి నాయకత్వం, శారీరక మానసిక ఎదుగుదల, అంతర్గతంగా దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికితీయడం కూడా జరుగుతుంది. నేడు యువతీయువకులు క్రీడల ప్రయోజనాలు బాగా నమోదు చేస్తున్నప్పటికీ, బాలికలు, మహిళలు క్రీడల్లో ముందుకు రావడానికి అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. క్రీడలలో బాలికలు, మహిళలు పాల్గొనడం వల్ల నాయకత్వ నైపుణ్యాలు, క్రీడా స్ఫూర్తి, ఆత్మవిశ్వాసంలో వృద్ధి చెందుతాయి. క్రీడల్లో విజయాలు సాధించడానికి అవసరమైన మద్దతు, ప్రాతినిధ్యం, అవకాశాలు దొరికితేనే వారి సర్వతోముఖాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. సమాజంలో ఈ అంతర్గత అంశాలను కొనసాగిస్తూ, అనేక దేశాలలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 05న 'జాతీయ బాలికలు–క్రీడా దినోత్సవం' జరుపుకుంటారు. నేటి డిజిటల్ ప్రపంచంలో విజయాలు, లింగ ఆధారిత సవాళ్లు, వివక్షత, పెంపకంలో అసమానతలు, బాలికలు/మహిళలకు సమగ్ర అవకాశాలను గుర్తించే రోజుగా ఈ వేదిక ఉపకరిస్తున్నది.

**క్రీడలలో మహిళల భాగస్వామ్యం తగ్గడానికి కారణాలు:** కుటుంబ మద్దతు లేకపోవడం, సాంప్రదాయ విలువల వలయాలు, మౌలిక సదుపాయాల కొరత, సామాజిక, ఆర్థిక అడ్డంకులు, పురుషాధిక్య సంస్కృతి, జీవ సంబంధమైన లేదా శారీరక అపోహలు, కెరీర్ అవకాశాలు లేకపోవడం, సామాజిక అంశాలు, పాఠశాల స్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం, లింగ అసమానతలు, ఉద్దేశపూర్వక వివక్ష, లైంగిక దోపిడీ, కోచింగ్ సౌకర్యాల కొరత, అనుభవ నాణ్యత తగ్గడం వంటి అనేక కారణాల వల్ల క్రీడలలో బాలికలు, మహిళలు తక్కువగా పాల్గొంటున్నారని తెలుసుకోవాలి.

**క్రీడారంగంలో విజయవంతమైన భారతీయ మహిళలు:**

క్రీడల్లో పురుషుల ఆధిపత్యం ఎక్కువగా ఉన్న దేశంలో, భారతీయ క్రీడా రంగంలో వెలిసిన మహిళా తారలు నేటి బాలికలకు దారి దీపాలుగా పలువురు ఉన్నారు. అత్యంత విజయవంతమైన భారతీయ మహిళలలో సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్), మేరీ కోమ్ (బాక్సింగ్), పివి సింధు (బ్యాడ్మింటన్), సాక్షి మాలిక్ (రెజ్లింగ్), సానియా మీర్జా (టెన్నిస్), మీరాబాయి చాను (వెయిట్ లిఫ్టింగ్), మను భాకర్ (షూటింగ్), పిటి ఉష (అథ్లెటిక్స్), ద్యుతీ చంద్ (అథ్లెటిక్స్), దీపా కర్మాకర్ (జిమ్నాస్టిక్స్), మిథాలీ రాజ్ (క్రికెట్), హిమా దాస్ (అథ్లెటిక్స్), గొంగడి త్రిష (క్రికెట్), మరియు దీప్తి జీవంజీ (పారాలింపిక్స్ స్ప్రింటర్), పలువురు మహిళా క్రికెటర్లు లాంటి ఎందరో ఉన్నారు.

భారతదేశ క్రీడా రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, అమలు చేయవలసిన ముఖ్యమైన చర్యలుగా మహిళా క్రీడను ఇంటి నుంచే ప్రోత్సహించడం, మీడియా కవరేజీలు, శాస్త్రీయ శిక్షణ, కోచింగ్ సౌకర్యాలు, భద్రతా సమస్యలను అధిగమించడం, మౌలిక సదుపాయాల లభ్యత, పాఠశాల స్థాయి ప్రోత్సాహం, కుటుంబ మద్దతు, సమాజ మద్దతు, సమాన అవకాశాలు, క్రీడా మహిళలకు ఉద్యోగాలు, శిక్షణ సమయంలో నిధులు, సాంస్కృతిక అడ్డంకులను పరిష్కరించడం, మార్గదర్శకత్వం, అనుకూల కార్యక్రమాలు, విద్య, నాణ్యమైన కోచ్‌లు, స్పాన్సర్ చేయబడిన క్రీడలు లాంటి అంశాలను ప్రోత్సహించడం నిరంతరం కొనసాగాలి.

క్రీడలలో సమర్థులైన, ప్రతిభావంతులైన బాలికలు మహిళలను ప్రోత్సహిద్దాం, తద్వారా వారు భారతదేశ ప్రతిష్టను, త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా రెపరెపలాడే విధంగా అడుగులు వేద్దాం. భారతీయ అమ్మాయిల క్రీడా ప్రతిభను ప్రపంచ మహిళలకు పరిచయం చేద్దాం.

**(నేడు 'జాతీయ బాలికలు & క్రీడా మహిళలు దినోత్సవం' సందర్భంగా)**

# గాజాలో కాల్పుల విరమణ ప్రహసనం!

హమాస్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలవుతున్నట్టు ఘనంగా ప్రకటనలు వెలువడ్డాయి. యావత్ ప్రపంచం ఊపిరి తీసుకుంది. కానీ, కాల్పుల విరమణ ఒక ప్రహసనంలా మారింది. ఇజ్రాయెల్ దాడులు... పాలస్తీనియన్ల మరణాలు ఆగలేదు. బాంబుల మోత కొంత తగ్గినట్టే కనిపించినా, మృత్యువు మాత్రం అక్కడ ప్రతిరోజూ తన పని తాను చేసుకుంటూనే ఉంది. ఇజ్రాయెల్ దాడులు అప్పుడప్పుడూ జరుగుతున్నాయని చెప్పుకునే ఈ కాలంలోనే, వందలమంది పాలస్తీనియన్లు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం ఆగిందన్న ప్రకటన గాజా ప్రజలకు ఊరటనివ్వలేదు, ఎందుకంటే ఆకలి, వ్యాధులు, గాయాలు, భయం... ఇవన్నీ ఇంకా అదే తీవ్రతతో వారిని వెంటాడుతున్నాయి. చాలాప్రాంతాల్లో ఇళ్లు శిథిలాలయ్యాయి, రోడ్లు మట్టిలో కలిశాయి, తాగడానికి నీరు లేదు, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పిల్లలకు తినిపించడానికి తల్లుల చేతుల్లో ఏమీలేదు. ఆసుపత్రులు ఉన్నా మందులు లేవు, డాక్టర్లు ఉన్నా పరికరాలు లేవు, రోగులేతప్ప చికిత్స లేదు. కేన్సర్‌తో బాధపడేవారు, అవయవాలు కోల్పోయినవారు, యుద్ధంలో గాయపడిన చిన్న పిల్లలు.. అందరిలోనూ ఒకే ప్రశ్నతో... 'మాకు బతికే అవకాశం ఉందా? ఇది సమాధానం లేని ప్రశ్న. వారంతా యుద్ధం ఆగిపోయిందంటే జీవితం తిరిగి వస్తుందనుకున్నారు, కానీ గాజాలో యుద్ధం ఆగినా సమస్యలు, బాధలు మాత్రం తీరలేదు. ఈ నిరాశ మధ్య రఫా సరిహద్దు ఒక ఆశ. ఈజిప్ట్‌తో ఉన్న ఆ చిన్న ద్వారం గాజా ప్రజలకు ఒక ద్వారం అనేకంటే, బతుకు–మరణాల మధ్య నిలిచిన మార్గం అనడమే సమంజసం. సరిహద్దు తెరుచుకుందన్న వార్త విన్న వెంటనే, గాజా వైపున ఆసుపత్రుల దగ్గర రోగులు గుమిగూడారు, అంబులెన్సులు వరుసగా నిలిచాయి, కుటుంబాలు కన్నీళ్లతో ఎదురు చూశాయి. ఈజిప్ట్ వైపున ఇప్పటికే గాజా నుంచి పారిపోయి చికిత్స పొందుతున్నవారు నిలబడ్డారు, గాజా వైపున చికిత్సలేని రోగులు, శస్త్రచికిత్స కోసం ఎదురు చూస్తున్న గాయపడినవారు ఆశగా చూశారు. కానీ పది గంటల నిరీక్షణ తర్వాత రెండు వైపు లా కేవలం కొద్దిమందికి మాత్రమే అనుమతి లభించింది. గాజాకు తిరిగివచ్చిన కొందరు మహిళలు తమను కళ్లకు గంతలు కట్టి, చేతులకు సంకెళ్లు వేసి గంటల తరబడి విచారించిన తీరును వివరించారు. మరికొందరు తమ దగ్గర ఉన్న ప్రతిదీ తీసేసి, శరీరంపై ఉన్న బట్టలు, ఒక్క సంచి మాత్రమే అనుమతించారని వాపోయారు. రఫా ద్వారం తెరుచుకున్నా, ఆహారం, మందులు, మానవతా సహాయం మాత్రం ఇంకా లోపలికి రావడం లేదు. రోజుకు కొన్ని డజన్ల మందికే అనుమతి లభిస్తున్న ఈ పరిస్థితిలో, వేలాది మంది రోగులు చికిత్స కోసం ఎదురుచూస్తూనే చనిపోతారేమో అన్న భయం గాజా అంతా కమ్ముకుంటోంది. గాజాలో బతకటం సాధ్యమా? అనే ప్రశ్న ఇప్పుడు చాలామందిని కలిచివేస్తున్నది. గాజా అభివృద్ధికి ఒక కమిటీ వేస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించి, కొన్ని పేర్లను ఖరారు చేసినప్పటికీ, సాయం మాత్రం ఎండమావే. ప్రతిరోజూ నరకం చూస్తున్న ప్రజలకు, భవిష్యత్తులో ఎప్పుడో అందబోయే సాయంపై ఆశలు ఉంటాయా? అందుకే, సరిహద్దు దేశాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు. వారు తమ నేల వదిలి వెళ్లాలనుకోవడం దేశద్రోహం కాదు, కేవలం జీవించాలనే చివరి ప్రయత్నం. ఈజిప్ట్, జోర్డాన్ తదితర దేశాలవైపు వారి చూపులు మళ్లుతున్నాయి. కానీ అదే సమయంలో గాజాను ఖాళీ చేయాలన్న రాజకీయ ఉద్దేశాలు దాగి ఉన్నాయేమో అన్న భయం కూడా వెంటాడుతున్నది. కాల్పుల విరమణ తరువాత కూడా కాల్పులు ఆగడం లేదు. ఇజ్రాయెల్ దళాల దాడుల్లో తాజాగా చనిపోయిన 19 ఏళ్ల అహ్మద్ లాంటి యువకులు ఎందరో! ఈ పరిస్థితిలో, గాజా ఒక నగరంగా కాక ఒక ఓపెన్ ఎయిర్ జైలు లాగా మారింది. బయటకు వెళ్లే ద్వారం ఇతరుల చేతుల్లో ఉంది. లోపలికి వచ్చే సహాయం నిషేధంలో ఉంది. ప్రపంచం చూస్తోంది. ప్రకటనలు చేస్తోంది, ఆందోళనలు వ్యక్తం చేస్తోంది. కానీ గాజాలో మాత్రం పిల్లల కళ్ళలో ఆకలి..తల్లుల గుండెల్లో భయం.. తండ్రుల మౌనంలో అభద్రతాభావం... వెరసి గాజా ప్రజలకు జీవితాన్ని నరకం చేశాయి. సీజ్‌ఫైర్ అంటే తుపాకులు మౌనంగా ఉండడమేనా, లేక ప్రజలు బతికే హక్కు కూడా దానిలో భాగమా అన్న ప్రశ్నకు సమాధానం కోసం గాజా ఇంకా ఎదురు చూస్తూనే ఉంది. నిరంతరం కలవరిస్తునే ఉంది, ఆహారం కోసం. మందుల కోసం.. గుక్కెడు నీళ్ల కోసం.. పిడికెడు మానవత్వం కోసం కూడా.

దశాబ్దాల అణచివేత... సంవత్సరాల తరబడి యుద్ధహింస నేపథ్యంలో గాజా ఇప్పుడు ఒక చిన్న భూభాగంకాదు.. ఒక తెగిపోయిన గుండె, రక్తస్రావం అవుతున్న మానవత్వం, ప్రపంచం చూసి కూడా చూడనట్టు వదిలేసిన ఒక సామూహిక వేదనగా మారిపోయింది.

రఫా క్రాసింగ్ వద్ద వేలాదిమంది ప్రాణం కోసం.. చికిత్స కోసం.. కొద్దిపాటి ఊరట కోసం బారులుతీరినా, పదుల సంఖ్యలో కూడా అవకాశాలు లేవు. రఫా వద్ద ఇరువైపులా పాలస్తీనియన్లు గుమిగూడిన దృశ్యం మానవ చరిత్రలోనే ఒక దుఃఖభరిత దృశ్యం. ఒక వైపు ఈజిప్ట్‌లో చికిత్స కోసం వెళ్లినవారు, ఎప్పుడు తిరిగి తమ నేలను తాకగలమో అన్న అనిశ్చితితో నిల్చున్నారు. మరోవైపు గాజాలో, తమ శరీరాల్లో వ్యాధులు పెరిగిపోతున్నా, రక్తం కారుతూనే ఉన్నా, ఈ రోజైనా అనుమతి వస్తుందేమో



నన్న ఒకే ఒక్క ఆశతో వేచి ఉన్నారు. ఆశకు సంకేతంగా మోగాల్సిన అంబులెన్స్ సైరన్లు ఇప్పుడు మరణానికి ముందున్న చివరి పిలుపుల్లా ప్రతిధ్వనిస్తున్నాయి. ఉత్తర సైనాయ్ గవర్నర్ కార్యాలయం ఎంతమంది దాటారో కూడా చెప్పలేని స్థితి. ఈ వ్యవస్థ ఎంత అస్తవ్యస్తం గా, ఎంత అమానవీయంగా ఉందో చెప్పడానికి ఇంతకంటే సజీవ ఉదాహరణ ఏముంటుంది? కాల్పుల విరమణ అనగానే యుద్ధం ముగిసి, శాంతి నెలకొంటుందనే ఆశ వెలిగింది. గాజా అభివృద్ధికి కంకణం కట్టుకున్నట్టు అమెరికా వంటి దేశాలు ప్రకటించడంతో, పాలస్తీనియన్ల కష్టాలు కొంతవరకైనా తీరుతాయన్న భావన మెరిసింది. కానీ, పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందం. ఏవో కొన్ని కారణాలు చూపి... లేనిపోని ఆరోపణలు చేసి...రఫా మీదుగా మానవతా సాయాన్ని అడ్డుకోవడం దుర్మార్గం. ఇజ్రాయెలీ సైన్యం కేవలం బాంబుతో మాత్రమేగాక, ఆకలితో, మందుల లేమితో కూడా గాజాలో ప్రజల ప్రాణాలు తీస్తున్నది. మౌలిక సదుపాయాలు కూడా అందకుండా చేస్తున్న ఇజ్రాయెల్, మరోవైపు పక్క దేశాలకు వెళ్లే అవకాశాన్ని ఇచ్చినట్టే ఇచ్చి, అడ్డుకుంటున్నది. సరిహద్దును ఎవరికోసం తెరిచారు? ప్రజల ప్రాణాలతో ఎందుకు ఆటలాడుతున్నారు? పాలస్తీనా అనేది లేకుండా చేయాలని ఇజ్రాయెల్ కంకణం కట్టుకుందనేది నిజమేనా? ఇజ్రాయెల్ జరిపిన మారణహోమా న్ని, ఇప్పటికీ కొనసాగిస్తున్న హింసను చూస్తుంటే, ఇలాంటి ప్రశ్నలు ఎన్నో. కాల్పుల విరమణ పేరుతో ప్రపంచం కళ్లుకప్పి.. యుద్ధం జరగడం లేదన్న భ్రమల్లోకి నెట్టి... ఇజ్రాయెల్ సాగిస్తున్న దమనకాండకు ఇప్పుడు రఫా సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులే నిదర్శనం. రఫా వైపు కదిలిన వేలాది మంది భయంతోనే అడుగులు వేస్తున్నారు. ఎక్కడ ఆపేస్తారో తెలియదు.. ఎవరిని చంపుతారో తెలియదు.. ఎవరిని వెనక్కు పంపిస్తారో తెలియదు. వర్తమానం భయానకం.. భవిష్యత్తు ప్రశ్నార్థకం.. ఇదీ రఫా సరిహద్దులో పాలస్తీనియన్ల దుస్థితి. ఆరోగ్య అధికారులు చెప్పినట్టు, ఇప్పటి వరకు అనుమతించిన సంఖ్య గాజా అవసరాలతో పోలిస్తే, సముద్రంలో ఒక చుక్కంత కూడా లేదు. రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్న యుద్ధం గాజాలోని వైద్య వ్యవస్థ ధ్వంసమైంది. ఆసుపత్రులు శిథిలాలుగా మారాయి. కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. మరణించిన వారిని పూడ్చడానికి కూడా చోటులేదు. గాయపడినవారికి చికిత్స చేయడానికి సాధనాలు లేవు. ప్రాణాలు కాపాడే ఆసుపత్రులు ఇప్పుడు మరణాన్ని కొన్ని గంటలు లేదా కొన్ని రోజులు ఆలస్యం చేసే స్థలాలుగా మారాయి. రోగులను తరలించనివ్వకపోవడం, మందులను అనుమతించకపోవడం అంటే వారికి నేరుగా మరణశిక్ష విధించినట్టేనని షిఫా ఆసుపత్రి డైరెక్టర్ మొహమ్మద్ అబూ సెల్మియా చెప్పిన మాటలు నిజానికి, గాజా ప్రజల మనసుల నుంచి వచ్చిన కేకలు. ఇది సంక్షోభానికి పరిష్కారం కాదు, కేవలం సంక్షోభ నిర్వహణ మాత్రమే. ఐక్యరాజ్య సమితి ఉంది.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఉంది.. రెడ్‌క్రాస్ వంటి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి.. గాజా ప్రజలకు సాయం చేయడానికి ముందుకు వస్తున్నాయి. కానీ, ఇజ్రాయెల్ ద్వంద్వనీతి కారణంగా గాజాలో ఏ ఒక్క సంస్థ కూడా పూర్తిస్థాయిలో సాయాన్ని అందించలేకపోతున్నది.

కాల్పుల విరమణ అమల్లోనే ఉందని ప్రకటిస్తున్న ఇజ్రాయెలీ సైన్యం, దాదాపు ప్రతిరోజూ, ఏదో ఒక ప్రాంతంలో కాల్పుల మోత మోగిస్తునే ఉంది. మౌలిక వసతులను.. మానవతా సాయాన్ని అడ్డుకోబోమని అంటూనే, సరిహద్దులు దాటి లోనికి రానివ్వడం లేదు. పొరుగు దేశాల్లో చికిత్స పొందే అవకాశాన్ని కూడా గాజా ప్రజలకు ఇవ్వడం లేదు. సహాయ సరఫరాలను ఆపేయడం వల్ల గాజాలోని విపత్తు మరింత సంక్లిష్టంగా మారుతున్నది. రఫా నిజమైన మానవతా మార్గంగా మారితేనే సహాయం పెద్ద ఎత్తున చేయగలదని ఐక్యరాజ్యసమితి సహాయాధికారి టామ్ ఫ్లెచర్ చెప్పడం, ఈ సమస్యకు పరిష్కారం ఎంత సులభమో చెప్తున్నది. కానీ, రాజకీయ సంకల్పం లేకపోవడం వల్ల అది ఎంత దూరమనే విషయాన్ని కూడా ఆ ప్రకటన సూచిస్తున్నది. తొలి విడత 45 మందిని అనుమతిస్తామని ప్రకటించిన ఇజ్రాయెల్ దళాలు, కేవలం 16 మందినే అనుమతించాయి. మిగతావారు ఇంకా ఎక్కడో ఆశతో నిల్చోవడం, లేదా నిరాశతో తిరిగి వెళ్ళిపోవడం ఒక దుర్మార్గపు ఎత్తుగడలకు నిలువెత్తు సాక్ష్యం. ఇది ఒక గణాంకం కాదు, ఇది 29 కుటుంబాల విరిగిపోయిన ఆశ. ఇమాన్ రష్వాన్ తన తల్లి, సోదరి కోసం గంటల తరబడి ఎదురు చూసిన దృశ్యం గాజాలో వేలసార్లు జరుగుతోంది. ప్రతి ఒక్కరు తమ ప్రియమైన వారిని తిరిగి చూసే రోజు కోసం ఎదురు చూస్తున్నారు. సొంత దేశంలో పరాయివారిగా బతకాల్సిన దుస్థితి పాలస్తీనియన్లది.

మొదటగా అనుమతించిన సంఖ్య కేవలం చిహ్నాత్మకమే. ఇదే రీతిలో అనుమతులు ఉంటే, విదేశాల్లో చికిత్స అవసరమైన సుమారు 20,000మందిలో అత్యధిక శాతం మందికి నిరాశ తప్పదు. వైద్యం.. ఆరోగ్యం వారికి ఒక కలగానే మిగిలిపోతుంది. ఇంత జరుగుతున్నా.. ప్రపంచం ఎక్కడ ఉంది? మానవ హక్కులు, మానవత్వం, అంతర్జాతీయ చట్టాలు అన్న మాటలు గాజా దగ్గరకు వచ్చేసరికి ఎందుకు మౌనంగా మారుతున్నాయి? ఒక దేశం కాదు, ఒక ప్రభుత్వం కాదు, ఒక రాజకీయ వర్గం కాదు... ఇక్కడ బాధపడుతోంది సామాన్య ప్రజలు. పిల్లలు, మహిళలు, వృద్ధులు, రోగులు. వీరికి రాజకీయాలు తెలియవు, వ్యూహాలు తెలియవు, సరిహద్దులు తెలియవు. వారికి తెలిసింది ఆకలి, నొప్పి, భయం, కన్నీళ్లు మాత్రమే. ఈ పరిస్థితిలో ప్రపంచ దేశాల జోక్యం ఒక ఎంపిక కాదు, అది ఒక బాధ్యత. మానవతా మార్గాలను పూర్తిగా తెరవాలి.. రఫా నిజంగా ప్రాణాలు కాపాడే దారిగా మారాలి. వైద్య సరఫరాలు, ఆహారం, నీరు, విద్యుత్ వంటివి ఏవీ రాజకీ య ఒప్పందాల బందీలుగా ఉండకూడదు. గాజాలో ప్రతి ప్రాణం విలువైనదని ప్రపంచం గుర్తించాలి. అదే గాజా సమస్యకు సరైన పరిష్కారం.

**కె.శ్రీనివాస్**

# బలహీనవర్గాలకు వికసిత్ భారత్‌లో చోటుందా?

వికసిత్ భారత్ బడ్జెట్ అని చెప్పబడుతున్న ఈ బడ్జెట్‌లో ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలకు ఎలాంటి స్థానం లేదు. ఇది సామాన్య ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరించి, కొద్దిమంది పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే రూపొందించబడింది. యువత, రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, చిరు వ్యాపారుల గురించి ఒక్క మాట కూడా లేదు. ఉపాధి గురించి లేదు, వ్యవసాయం గురించి లేదు, చిన్న వ్యాపారాల గురించి లేదు. ఉత్పత్తి కులాల ఊపిరి తీసేదిగా ఉంది. బడ్జెట్ సామాన్య ప్రజలపై భారంగా మారుతుంది. చరిత్రలోనే అత్యంత దారుణమైన బడ్జెట్లలో ఇది ఒకటిగా నిలిచిపోతుంది. ఇది ధనవంతుల కోసం, సంపన్నుల కోసం, భారీ డేటా సెంటర్ల నిర్మాణంకోసం రూపొందించిన బడ్జెట్, సామాన్య భారతీయులకోసం కాదు.

ఉపాధి సృష్టిని ప్రభు త్వం పూర్తిగా పక్కన పెట్టింది. యువత ఆశలేని స్థితిలోకి నెట్టబడుతోంది. ప్రజల జేబులో డబ్బు లేకపోతే, బుల్లెట్ రైళ్లలో వారు ఎలా ప్రయాణిస్తారు? విద్యా బడ్జెట్‌ను కుదించారు. స్కాలర్‌షిప్‌లను తగ్గించారు. యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ నరెగ ద్వారా హామీ ఇచ్చి న ఉపాధి హక్కును ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. రైతుల హక్కులను కూడా క్రమంగా హరింపచేస్తుంది. ఉపాధి హక్కుని దూరం చేసిన ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్ గురించి మాట్లాడే అర్హత ఎలా ఉంటుంది? ఉపాధి భద్రతను పునరుద్ధరించకుండా, రైతుల హక్కులు కాపాడకుండా, శ్రమ గౌరవా న్ని నిర్ధారించకుండా ఇలాంటి నినాదాలు ఖాళీ మాటలు గా నే మిగిలిపోతాయి. ఇది సామాన్య ప్రజల బడ్జెట్ కాదు. వికసిత్ భారత్ అనే కథనం వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నదా అనే ప్రశ్న కూడా ఇక్కడ తలెత్తుతుంది. జల్ జీవన్ మిషన్ అమల్లో విస్తృత అవినీతి, దుర్వినియోగం చోటుచేసుకున్నాయి. భారీ గా ఖర్చు చేసినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు మారలేదు. ఢిల్లీలో కూర్చున్నవారికి కళ్ళున్నా కనిపించడం లేదు.

బిసి కులాల అభివృద్ధికి పాటు పడుతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వాలు, ఆచరణలో ఈ కులాల అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. అత్యంత వెనుకబడిన కులాలు, సంచార జాతులను ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక రంగాల్లో అభివృద్ధి చేయవలసిన రాజ్యాంగ బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోంది. సైన్స్ అండ్ టెక్నాలజీ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. అన్ని రంగాల్లో మెకనైజేషన్ పెరుగుతోంది. ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక, వ్యవసాయ, సాంస్కృతిక రంగాల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. ఆధునిక టెక్నాలజీ అన్ని రంగాలకూ విస్తరిస్తోంది. ఈ పరిణామ క్రమంలో కులవృత్తులు–చేతివృత్తులు తమ ఆస్థిత్వాన్ని కోల్పోతున్నాయి. ఇంతవరకు ఈ వృత్తులపైనే ఆధారపడిన కులాలు, వర్గాలకు యాంత్రీకరణ కార్పొరేటీకరణ దక్కాలి. కానీ ప్రస్తుతం వ్యవస్థలో అలా జరగడం లేదు.

స్టీల్, ఐరన్ పరిశ్రమలతో కమ్మరి, కుమ్మరి, వడ్రంగి కులాలు తమ వృత్తులను కోల్పోయాయి. ప్లాస్టిక్ పరిశ్రమ కారణంగా మేద రి, కుమ్మరి వృత్తులు మరుగున పడ్డాయి. జెసిబిలు, హిటాచీ మెషిన్లతో వడ్డెర్ల బతుకులు ఆగమై కూలీలుగా మారారు. ట్రాక్టర్లు–సా మిల్లులు రావడంతో వడ్రంగి, కమ్మరి పని దెబ్బతింది. డ్రై క్లీనింగ్ షాపులు వల్ల చాకలి, నేత మిల్లులు రావడం తో నేత వృత్తి, బ్యూటీపార్లర్లు, హెయిర్ కటింగ్ సెలూన్ల రాక తో మంగలి, రెడీమేడ్ దుస్తులతో దర్జీలు, జ్యూయలరీ షాపులతో విశ్వబ్రాహ్మణ వృత్తులు దెబ్బతిన్నాయి. ఎన్నికల సమయంలో ప్రతి దరఖాస్తుదారునికి సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించారు. ఏళ్ళు గడుస్తున్నా కొత్త రుణాల కోసం నోటిఫికేషన్లు ఇవ్వడం లేదు. బిసి కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. కులాల సమస్యలపై అవగాహన ఉన్న వారు తమకు కావలసిన పథకాలు డిజైన్ చేయగలరు. సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినా స్పందించడం లేదు.

యాంత్రీకరణతో కార్పొరేట్ ప్రాబల్యం పెరిగిపోతోంది. కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రుణా లు ఇవ్వకపోగా, బిసిలకు రూ.లక్ష, రూ.2లక్షల రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు కూడా ముందుకు రావడం లేదు. కానీ, బడా కంపెనీలకు, పారిశ్రామిక వేత్తలకు వేలకోట్ల రుణాలు ఇస్తున్నారు. వారు వాటిని కట్టకపోతే మాఫీ చేస్తున్నారు. ఆకలి, అజ్ఞానం, అమాయకత్వం, అనారోగ్యం, పేదరికం లేనటువంటి సమాజ నిర్మాణం జరగాలం టే జాతి, వనరులు, సంపద, అధికారం అన్ని వర్గాలకూ సమానంగా దక్కాలి. శ్రమ సంస్కృతి పెరగాలి. మానవ వనరులు పూర్తి స్థాయిలో వాడుకోవాలి. శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే తమ హక్కుల కోసం ఈ కులాలు ఉద్యమం చేయడం తప్పదు.

వెనుకబడిన తరగతులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి, అలాగే బడ్జెట్ కేటాయింపులు లక్ష కోట్లు తక్కువ కాకుండా బడుగుల జీవితాలు మార్చాలి. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిన, అధిక ద్రవ్యోల్బణం, గరిష్ట స్థాయికి నిరుద్యోగం, ప్రజాస్వామ్యం అణచివేత, విద్వేష రాజకీయాలు, రూపాయి విలువ భారీగా పతనం కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ సమాజంలో విభజన దేశ భద్రతలో వైఫల్యం, ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సహనం, అథఃపాతాళానికి ఆర్థిక ప్రగతి అన్ని రంగాల్లో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయి. దేశ సంపద సృష్టించడంలో, దేశాన్ని నిర్మించడంలో వెనుకబడిన కులాల పాత్ర శ్లాఘించి తగ్గదు. ఇలాంటి వెన్నెముక కులాల సంక్షేమం విస్మరిస్తే దేశ భవిష్యత్తు అధోగతే.

**డా.ముచ్చుకోట సురేష్ బాబు,**
9989988912

# అందరికీ సమాన అవకాశాల కల్పన



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం, ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పలు సంక్షేమ శాఖల ఆద్వర్యంలో బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్బంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తుందని వివరించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు నిబంధనలకు అనుగుణంగా తమ కార్యాలయంలోని అటెండర్ నుంచి అన్ని స్థాయిల అధికారులకు సమాన అవకాశాలు కల్పించాలని, అన్ని వర్గాల పేద, బడుగు బలహీన వర్గాల వారికి ప్రభుత్వ ఫలాలు అందించాలని సూచించారు. ప్రభుత్వ హాస్టళ్లలో చదివే అవకాశం వచ్చిన విద్యార్థులు మంచిగా అభ్యసించి, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉన్నత ఉద్యోగాలు, స్థానాల్లో స్థిరపడి తమ ప్రాంతంలోని వారికి ఆదర్శంగా నిలువాలని పిలుపు నిచ్చారు. ఈ ఏడాది యూనైటెడ్ బై యూనిక్యూ అనే నినాదంతో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని వైద్యశాలల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రోగ నిర్ధారణ జరిగితే ఉన్నత దవాఖానల్లో వైద్యం, మందులు అందిస్తున్నారని తెలిపారు. క్యాన్సర్ అంటూ వ్యాధి కాదని, వారిని చేరదీసి వైద్య సహాయం అందించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాల్లో అన్ని వర్గాలతో ముందుకు వెళ్ళాలనేది ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి సౌజన్య, మైనార్టీ సంక్షేమ అధికారి భారతి, సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీ రాజం, సీపీఓ శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/దుబ్బాక:** ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. దుబ్బాక మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్‌చెక్‌పోస్ట్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి వావాహాన్ని తనిఖి చేయాలని, తనిఖీ చేసే ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. వాహనాల తనిఖీ వద్ద ఏర్పాటు చేసిన రికార్డును పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. అనంతరం దుబ్బాక మండల పరిధిలోని బల్వంతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ పనులను పరిశీలించారు. మంజూరైన ఇంటి నిర్మాణా పనులు ఎందుకు మొదలు పెట్టాలేదని ఎంపిడివో వైఖరిపై అసహనం వ్యక్తం చేశారు. ఇందిమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. హాబ్సిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్ వాడీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మోను ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని అధికారులకు సూచించారు. మోను ప్రకారమే భోజనం పెడుతున్న సాంబర్ పలచగా ఉందని ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు.

# వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుదటమైన చర్యలు తీసుకుంటుందనిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకలలో అదనపు కలెక్టర్ డి. వేణుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 4, 2024 నాడు తెలంగాణ ప్రభుత్వ కేబినెట్ కుల సర్వే నిర్వహణకు, ఎస్సి కుల వర్గికరణ కు అనుకూలంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో శాస్త్రీయంగా కుల సర్వే ప్రభుత్వం నిర్వహించిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం క్యాబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ఫిబ్రవరి 4వ తేదీ నాడు సోషల్ జస్టిస్ రోజుగా జరుపుకుంటామని అన్నారు. సోషల్ జస్టిస్ రోజు నాడు సమాజంలో రావాల్సిన సామాజిక మార్పుల పై చర్చిస్తామని, ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకొని భవిష్యత్తులో మరింత మెరుగ్గా సోషల్ జస్టిస్ డే నిర్వహిస్తామని అన్నారు.సోషల్ జస్టిస్ డే సందర్భంగా ప్రభుత్వం వివిధ సామాజిక వర్గాలకు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని అన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుదిట్టమైన కృషి చేయడానికి మరోసారి కంకణ బద్ధులై ముందుకు సాగేలా అధికార యంత్రాంగానికి సోషల్ జస్టిస్ వేడుకలు ప్రేరేపితం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు, అనంతరం జిల్లా అధికారులు తో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, కలెక్టరేట్ ఏవో బి. ప్రకాష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థిని ఆశీర్వదించండి



**ప్రజాపక్షం/కరీంనగర్:** తొమ్మిదో డివిజన్ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి పడిశెట్టి వసంత లక్ష్మినీ అత్యధిక మెజార్టీతో కార్పొరేటర్ గా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ లోని 9వ డివిజన్ కోతిరాంపూర్లో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ అభివృద్ధి కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందని ఓటర్లకు వివరించారు. టిఆర్ఎస్ బిజెపి తో సాధ్యం కాదని వారితో ఏ పని కాదని రాజేందర్ రావు పేర్కొన్నారు. వారికి ఓటు వేస్తే వృధానేనని తెలిపారు. ప్రజలంతా పడిశెట్టి వసంతలక్ష్మిని ఆశీర్వదించి అండగా నిలిచి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్ రెడ్డి, గడ్డం విలాస్ రెడ్డి, పడిశెట్టి భూమయ్య, ఫణిత శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టండి

### ఎమ్మెల్యే సత్యంతో కలిసి సిఎం సభ ఏర్పాట్లు పరిశీలన
### మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/చొప్పదండి:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టి జైత్ర యాత్ర కొనసాగించాలని కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొననున్న సభ స్థలిని ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తు తెలంగాణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహర్నిషలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధిపై పట్టుదలతో పనిచేస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సహకరించకపోయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి గుండె ధైర్యంతో అభివృద్ధి పథకాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. మెట్ట నియోజకవర్గమైన చొప్పదండికి నీటి వసతులతో పాటు కళాశాలను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంబించుకోనున్నట్లు తెలిపారు. పనికిమాలిన విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జైత్ర యాత్రను మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చేసే వారికి మున్సిపల్ ఎన్నికల్లో పట్టం కట్టాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగించాలంటే కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో సాగునీటి కోసం భూమి పూజలు చేసి వదిలేసారని, కాంగ్రెస్ హయాంలో వరద కాలువ నిర్మాణం చేసి సాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ పనులు త్వరలోనే పూర్తి కాబోతున్నట్లు పేర్కొన్నారు. కొండగట్టు దేవాలయానికి గత ముఖ్యమంత్రి కెసిఆర్ రూపాయి ఇవ్వలేదని, కొండగట్టు దేవాలయం మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పథకాలు ప్రవేశపెట్టడం కాంగ్రెస్ ఘనత అని తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, రాజేందర్ రావు, శ్రీనివాస్ రెడ్డి, మహేష్, రాజేందర్, ఆనంద్, చందు, కోమటి రెడ్డి పద్మాకర్‌రెడ్డి, నాయకులు మునిగాల చందు, సుధాకర్, కృష్ణాహరి పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నాం

### పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఐటి పార్కు
### మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విజయరమణరావు పిలుపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గోల్డెన్ తులిప్ బ్యాంకెట్‌హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసిన కూడా కాంగ్రెస్ దాన్ని గాడిలో పెట్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకెళ్తున్నాం. బిఆర్ఎస్ 10 ఏళ్ల పరిపాలనలో పట్టణాలను, పల్లెలను గాలికొదిలేసారుఅని అన్నారు. ఏం మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారు అనిఎన్నికలు వస్తె అడ్డగోలుగా మాటలు చెప్పే పార్టీ బిఆర్ఎస్ పార్టీ మరియు బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి పెద్దపల్లి జిల్లాకు నిధులు కేటాయించలేదని పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తాం అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత డబుల్ బెడ్ రూంలకు మౌలిక సదుపాయాలు కల్పించి అందించిన ఘనత మీ ఎమ్మెల్యే విజయరమణ రావుగారిదే అని అన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# చేర్యాల పట్టణంలో సిపిఐ రాజీలేని పోరాటం

### 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రామగళ్ళ నరేష్‌ను గెలిపించండి
### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్

**ప్రజాపక్షం/చేర్యాల:** చేర్యాల మున్సిపాలిటీలో నెలకొన్న ప్రజా సమస్యలపై సిపిఐ రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ అన్నారు. సిపిఐ 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రామగళ్ళ నరేష్‌ను భారీ మెజారిటీతో గెటిపించాలని కోరుతూ బుధవారం సిపిఐ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ చదువుకున్న వ్యక్తిగా ప్రజా సమస్యలపై అవగాహన ఉండి పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తి రామగళ్ళ నరేష్ అని అన్నారు. ప్రజలు అదరించి ఆశీర్వదిస్తే సేవకుడిగా పని చేస్తానని అన్నారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు ఏసి భారీ మోజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనకబాబు, బండయ్య, అశ్వీని, సత్తయ్య, సురేందర్, పరమేష్, రాజు, యాదగిరి, మల్లేశం, రజిత పాల్గొన్నారు.

# ధర్మపురి క్షేత్రాభివృద్ధిపై మాట తప్పిన కెసిఆర్

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీలక్ష్మి నర్సింహస్వామి క్షేత్రాభివృద్ధికై రూ. 500 కోట్లు ఇస్తానన్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట తప్పరని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మపురి పట్టణంలోని 1వ వార్డు, 9వ వార్డులలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2018 ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన కేసీఆర్ ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి రూ. 500 కోట్లు నిధులు అందిస్తానని వేలాదిమంది సాక్షిగా వాగ్దానం చేసి మాట తప్పారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.యాదాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ధర్మపురి ఆలయాన్ని మాత్రం విస్మరించారని మంత్రి పేర్కొన్నారు.ప్రజల ఆశీస్సులతో గెలిచిన తాను గడిచిన రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజా సంక్షేమానికి అనేక పథకాలను ఆమలు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే మున్సిపాల్ ఎన్నికల్లో 15వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే గోదావరి పుష్కరాలకు పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి ధర్మపురి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వంలో ఇప్పటికే నాలుగు గ్యారంటీలు అమలు చేస్తున్నామని రానున్న రోజుల్లో మిగిలిన రెండు గ్యారంటీలు అమలు చేస్తామని మంత్రి అన్నారు. 10ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఖజానా ఖాళీ కావడంతో రెండు గ్యారంటీల అమలు ఆలస్యం అవుతున్నదని మంత్రి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మిగిలిన రెండు గ్యారంటిలను సైతం త్వరలోనే అమలు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పెద్ద మెజారిటీతో గెలిచించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# ఒక్కసారి అవకాశం ఇస్తే సిరిసిల్ల అభివృద్ధి ఏందో చూపిస్తాం

### మంత్రి బండి సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఒక్కసారి అవకాశం ఇచ్చి సిరిసిల్ల మున్సిపాలిటీని మాకు అప్పజెప్పండని, సిరిసిల్ల అభివృద్ధి ఏందో, పేదల బతుకులను ఏ విధంగా బాగు చేయాలో మాకు వదిలేయండని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సిరిసిల్ల అభివృద్ధి కోసం, నిబద్ధతతో పార్టీ కోసం పని చేస్తూ ఎలాంటి అవినీతికి పాల్పడమని మా అభ్యర్థులతోని అంబేద్కర్ సాక్షిగా ప్రమాణం చేపిస్తామని,బిఆర్ఎస్,కాంగ్రెస్ అభ్యర్థులతో ప్రమాణం చేపించే దమ్ముందా అని సవాలు విసిరారు. మా అభ్యర్థులకు డబ్బులు లేకున్నా కొట్లాడి నిధులు తెప్పించే దమ్ముందని అన్నారు. మీకు నిధులు తీసుకొచ్చే అభ్యర్థులు కావాలా, వచ్చిన నిధులను దారి మళ్లించే అభ్యర్థులు కావాలో నిర్ణయించుకోవాలని అన్నారు. దేశం మొత్తం సిటీలో ఉన్న మురికి నీటిని బయటకు పంపిస్తే మన కేటీఆర్ బయట మురికి నీటిని సిటీలోకి తీసుకొచ్చిన ఘనత కేటీఆర్ ది అని ఎద్దేవ చేశారు. వర్ష కాలం వస్తే వరదలతో సిరిసిల్ల వరదకు గురవుతుందో లేదో చెప్పాలన్నారు. వస్త్ర పరిశ్రమ సిరిసిల్లలో ఉంటే యారన్ డిపో వేములవాడలో ఏర్పాటు చేసి పుండు ఒకచోట అయితే మందు ఒకచోట పెట్టినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. అపరిల్ పార్క్ అని షెడ్లేసి ఎవరికి ఇవ్వలేదని మండిపడ్డారు. సిరిసిల్ల మున్సిపాలిటీకి 15వ ఆర్థిక సంఘం నిధులను 29 కోట్లు, అమృత్ నిధులు 50 కోట్లు ఇచ్చామన్నారు. 40 వేల ఓటర్లకు గాను 11వేల ఓటర్లకు ఎలాంటి పూచికత్తు లేకుండా ఒక్కరికి పదివేల రూపాయలు ఇరవై ఒక్క కోట్ల 52 లక్షల రూపాయలను ఇచ్చామన్నారు. మోడీ ప్రభుత్వం ఏమి ఇచ్చింది అనేది ఒక్కొక్కరికి ఇంటింటికీ బుక్కు ప్రింట్ చేసి పంపిస్తామన్నారు. కేటీఆర్‌కు కూడా ఇది పంపిస్తామని కేటీఆర్ కు ఎందుకు ఓట్లు వేయాలో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, శ్రీకాంత్, సిరిసిల్ల మున్సిపల్ 39 వార్డుల అభ్యర్థులు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చైన్‌మేన్ సస్పెండ్

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చైన్ మేన్ ఈ. రఘును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం మంథని రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో డిప్యూటీషన్ పై చైన్ మేన్ గా పని చేస్తున్న ఈ.రఘు విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అనేకసార్లు మెమోలు జారీ చేసినప్పటికీ ఎటువంటి మార్పు లేకుండా జనవరి 13, 2026 నుంచి ఎటువంటి సమాచారం అందించకుండా విధులకు గైర్హాజరు కావడం గమనించామని మంథని ఆర్.డి.ఓ.నివేదిక సమర్పించారని అన్నారు.అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించి కమాన్ పూర్ తహసిల్దార్ కార్యాలయం లో చైన్ మేన్ గా పని చేస్తున్న ఈ. రఘు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా సస్పెండ్ చేస్తున్నట్లు, సస్పెన్షన్ కాలంలో అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ దాటి వెళ్లడానికి వీలు లేదని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం

### బందోబస్తును కలెక్టర్‌తో కలిసి సమీక్షించిన సిపి

**ప్రజాపక్షం/కరీంనగర్:** చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్ శివారులో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.గుమ్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం, హెలిపాడ్ మరియు పార్కింగ్ స్థలాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను ఆదేశించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు, సిబ్బందికి, సీపీ మ్యాప్ ద్వారా రూట్ మ్యాప్ మరియు విధులను వివరించారు. సభా ప్రాంగణం, చుట్టుపక్కల ప్రాంతాలను డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులతో పాటు రెవెన్యూ, ఫైర్, ఆర్ అండ్ బి ఫారెస్ట్, వైద్య, ఎక్సైజ్, ఐ అండ్ పిఆర్ విభాగాల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వంతోనే అభివృద్ధి: కలెక్టర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** సామాజిక సమానత్వం ద్వారానే అన్ని వర్గాలు, తద్వారా దేశం అభివృద్ధి చెందుతాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. భగత్ నగర్ లోని ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దివ్యాంగులు, నిరుపేదలందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, వృద్ధులకు న్యాయం, సేవా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ ఒకరికి ఒకరు సహకరించుకుంటూ సమాజాన్ని గొప్పగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గొప్ప ఆశయంతో ముందుకు వెళ్లాలని, ముఖ్యంగా బాలికలు ఉన్నత విద్య అభ్యసించి ఉపాధి అవకాశాలతో ఆర్థిక సాధికారత సాధించాలని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. సామాజిక న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్లో విద్యార్థుల కోసం అమర్చిన గీజర్, పలు సౌకర్యాలు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు. తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవసందర్భంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్: 'సుడా' చైర్మన్

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి అభివృద్ధికి సహకరించాల్సిందిగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. 63వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి కర్రె పావనికి మద్దతుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా డివిజన్‌లో అభివృద్ధి కుంటుపడిందని, కర్రె పావనిని గెలిపించి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని , ఈ డివిజన్ అభివృద్ధికి తాను కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్ తదితరులున్నారు.

# ప్రతీ మున్సిపాల్టీకి 20 శాతం రిజర్వ్ సిబ్బంది: కలెక్టర్




**ప్రజాపక్షం/సిద్దిపేట:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి కేటాయించారు. సాధరణ మున్సిపల్ ఎన్నికల 2026 నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగనున్న చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్టీల ఎన్నికల పోలింగ్ ప్రైసిడింగ్, అసిస్టెంట్ ప్రైసిడింగ్ పోలింగ్ సిబ్బందిని రెండవ విడుత ర్యాండమైజేషన్ పద్దతిలో ఆన్‌లైన్‌లో కేటాయించారు. చేర్యాల మున్సిపాల్టీకి 122 మందిని, హుస్నాబాద్‌కు 200 మంది, దుబ్బాక మున్సిపాల్టీకి 205 మంది, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్టీకి 364 మందిని కేటాయించారు. వీరితో పాటు ప్రతి మున్సిపాల్టీకి 20శాతం ఆదనపు, ఎన్నికల పోలింగ్ (రిజర్వ్) అధికారులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఈనెల 7న ఐడిఓసి సమావేశమందిరంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ విధానంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ఈనెల 13న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందిని ర్యాండమైజేషన్ పద్దతిలో కేటాయించారు.హుస్నాబాద్‌కు 26, చేర్యాలకు 26, దుబ్బాకకు 26, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్టీకి 40 మంది సిబ్బందితో పాటు 20 మంది రిజర్వు సిబ్బందిని ర్యాండమైజేషన్‌లో కేటాయించారు. ఈనెల 9న ఐడిఓసి సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈప్రక్రియ మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధరణ పరిశీలకులు ఆయేషా ముష్రత్ ఖాన్ ఆన్‌లైన్ ద్వారా పర్యావేక్షించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ ఎఓ రాజ్‌కుమార్, డిఆర్‌డిశ జై దేవ్, ఆర్యా, డిఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల సిబ్బ ంది ట్రైని మాస్టర్ రామస్వామి, ఎలక్షన్ విభాగం అధికారులు, ఈడిఎం ఆనంద్. టెక్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవన.. నిర్మాణానికి శంకుస్థాపన

ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజాపక్షం/భైంసా : భైంసా మండలంలోని కుంసర గ్రామంలో మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో భూమి పూజ కార్యక్రమాన్ని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమి పూజ చేసి,పనులను ప్రారంభించారు.మహిళలు ఆర్థికంగా,సామాజికంగా అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు.గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని,విద్యా రంగం, మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.అలాగే కుంసర గ్రామం నుండి బైంసాకువెళ్లే రోడ్డు బ్రిడ్జి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని,గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అలాగా పనులు అభివృద్ధి చేపడతానని,గ్రామంలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఆయా గ్రామాల సర్పంచులు,మండల నాయకులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిసిలను రాజ్యాధికారానికి.. దూరం చేస్తున్న మోడీ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పనుల చంటి



ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మంగళవారం పాత్రికేయ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి పనుల చంటి మాట్లాడుతూ ఏప్రిల్ 30,2025న కేంద్ర కేబినెట్ జనగణన లోనే కులగణన నిర్వహిస్తామని చెప్పి జనవరి 22న కేవలం జనగణన కోసం నోటిఫికేషన్ విడుదల చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కులగణన జరిపి దేశానికే రోల్ మోడల్ గా నిల్చామని,కులాల వారీగా వాటాలు తేల్చి రాజకీయ రిజర్వేషన్లు కూడా కల్పించామని పేర్కొన్నారు.జనగణలో కేవలం ఎస్సీ,ఎస్టీల జనగణ మాత్రమే చేస్తున్నారని,అన్ని కులాలు,ఉప కులాల వారిగా నిర్ధారించి బడ్జెట్ కేటాయింపులు,సంక్షేమ ఫలాలు,ప్రత్యేక రాయితీలు కల్పించే అవకాశం ఉండాలి అని తెలిపారు.రాష్ట్రంలో బీసీ సంఘాలు బిజెపి ఎంపీలపై ఒత్తిడి పెంచి పార్లమెంట్లో చర్చ జరిగే విధంగా ఒత్తిడి చేయాలని పిలుపునిచ్చారు.అందూర్ గ్రామ సర్పంచ్ పెండూర్ వృద్ధి రాజ్,నక్కలవాడ గ్రామ సర్పంచ్ అడప నవీన్ కుమార్,దన్నూర్ సర్పంచ్ ఎల్ల రోహిత్ విజయ్ రెడ్డి,కుచలాపూర్ ఉప సర్పంచ్ సుద్దుల అరుణ్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ మహ్మద్ అబ్రార్,సీనియర్ నాయకులు మెరుగు భోజన్న,సన్నాల చమేందర్ రెడ్డి,కోల ప్రశాంత్,తరుణ్,యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి,ఎస్టీ సెల్ జిల్లా నాయకులు ఉమేష్ జాదవ్ పాల్గొన్నారు.

## మంత్రి సహకారంతో గ్రామం అభివృద్ధి సర్పంచ్ ఆనంద్



ప్రజాపక్షం/రేగోడ్ : ఒదల కేంద్రంలో ని లింగంపల్లి లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశాల మేరకు బుధవారం మహిళా సమైక్య భవనం నిర్మాణానికి భూమి పూజ సర్పంచ్ ఆనంద్ చేశారు ఈ కార్యక్రమంలో నాయకుడు శివాజిరావు నాయకు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను బలపరచండి

మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి మైపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/రామాయంపేట: అభివృద్ధికి పట్టం కట్టే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మైపాల్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం రామాయంపేట మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో ఎనిశెట్టి శ్రీవాణి అశోక్‌గుప్తాకు మద్దతుగా వార్డులో ప్రచారం చేశారు. ఈసందర్భంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడుగుతు ముందుకు సాగారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. శ్రీవాణి అశోక్ కౌన్సిలర్ మ్యానిఫెస్టో విడుదల చేశారు. వార్డులో ఆడపిల్ల వివాహానికి 11వేల రూపాయల నగదు, ఆపద సమయాల్లో 5వేల ఆర్థిక సహాయం, మురికికాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపడతానని హామీలు ఇచ్చారు. అంతకు ముందు 5వ వార్డు, 12 వార్డు, 9వ వార్డు, 10,11 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు గజవాడ నాగరాజు, సరాపు యాదగిరి, దేమె యాదగిరి, చింతల స్వామి, విప్లవ్‌కుమార్, చిలుక స్వామితో పాటు పాల్గొన్నారు.

## క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలిద్దాం

తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ



ప్రజాపక్షం/సంగారెడ్డి : ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి తారా ప్రభుత్వ కళాశాలలో జువాలజీ ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు వల్ల పలు రకాల అతి ప్రమాదకరమైన క్యాన్సర్ భారిన పడుతున్నారని ,ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవలసిన అవసరం ఉందని అయితే ఈ వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే వ్యాధి తీవ్రత తక్కువగా ఉంటుందని అన్నారు. తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవలసి ఉంటుందన్నారు. క్యాన్సర్ వ్యాధికి వయస్సుతో సంబంధం లేదని ఈ వ్యాధిని దేశం నుండి తరిమి వేయవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

## పకడ్బందీగా మున్సిపల్ ఎన్నికల..

# పోలింగ్ ప్రక్రియ చేపట్టాలి

ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్






ప్రజాపక్షం/మంచిర్యాల : మంచిర్యాల జి ల్లాలో రెండవ సాధారణ మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని కలెక్టర్ సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పిఓ, ఎపిఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండవ సాధారణ మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బంధీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగింధని, ప్రతీ పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం , ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై శిక్షణలో తెలియజేశారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో తాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ప్యాన్లు వంటి అన్ని మౌళిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. గర్భిణి స్త్రీలు, బాలింతలు మనహాయింపు కోరినట్లయితే ఆమోదించడం జరుగుతుందని మిగితా వారికి అత్యవసర ఆరోగ్య పరిస్థితులు, ఇతర ఇబ్బందులు తలెత్తినట్లయితే తప్ప పోలింగ్ విధులలో మినహాయింపు ఉండదని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుంధని 12వ తేదీన రీపోలింగ్ ఉన్నట్లయితే నిర్వహించి 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నగరపాలక సంస్థ కమీషనర్ అన్వేష్, మాస్టర్ ట్రైనర్ హరిప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి




ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కార్మిక శాఖ మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ నర్సాపూర్ రూపురేఖలు మారాలంటే కాంగ్రెస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించి నర్సాపూర్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరవేలు అన్నారు. అందరూ అభ్యర్థుల గెలుపున కోసం కృషి చేయాలన్నారు. అభ్యర్థులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల కదుపులో తలపెట్టి ఓటు అడగాలని సూచించారు నర్సాపూర్ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తే తను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎన్జీవో కాలనీలో రెండు, మూడు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, కౌన్సిలర్ అభ్యర్థులు పైడి శ్రీధర్ గుప్తా, సుధీర్ గౌడ్, దావుద్ తదితరులు ఉన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/నిజామాబాద్: మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులతో బుధవారం సమీక్ష జరిపారు. నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ ఏర్పాట్లపై కమీషనర్ దిలీప్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణ పూర్తయిన మీదట వివరాలు ఎక్కడ కూడా బయటకు వెల్లడి కాకుండా చూడాలని, ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ముద్రణ అనంతరం సాఫ్ట్ కాపీలను పూర్తి స్థాయిలో హార్డ్ డిస్క్ నుండి కూడా తొలగించేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎన్నికల సంఘం క్రిమినల్ చర్యలు చేపడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని బ్యాలెట్ పత్రాల ముద్రణ విషయంలో ఎంతో అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. కాగా, పోలింగ్ కేంద్రాలలో కనీస సదుపాయాలను మరోమారు క్షేత్రస్థాయిలో సరి చూసుకోవాలని సూచించారు.

## కెసిఆర్ ఆస్తులు పెంచుకోవడం కోసమే ఫోన్ ట్యాపింగ్

కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



ప్రజాసక్షం/రామాయంపేట: ఆర్ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసిఆర్ సొంత ఆస్థులను పెంచుకోవడం కోసమే చేశాడని కార్మిక, ఉపాదిశాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బుదవారం రామాయంపేటక వచ్చిన సందర్బంగా 5వ వార్డులో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ప్రజల సొమ్మును దోసుకొని దాచుకున్న కేసిఆర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు మంత్రి తెలిపారు. ఇదే విషయం కవిత మాట్లాడితే పార్టీ నుండి సస్పెండ్ చేసిన మాట వాస్తవం కాదా అన్నారు. మెదక్, రామాయంపేట మున్సిపాలిటిల్లో కాంగ్రెస్ జెండా ఎగురాలని పిలుపునిచ్చారు. వార్డుల్లో ప్రతి ఓటరును కలిసి ఓట్లు అభ్యర్థించాలన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసిఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చాడని విమర్శించారు. వారు చేసిన అప్పులకు ఈ ప్రభుత్వం ప్రతి నెలా వేల కోట్ల రూపాయలు వడ్డీలు కడుతుందన్నారు. అభివృద్ధి కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రేస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. యువ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ముఖ్యమంత్రితో కొట్లాడి నిదులు తెచ్చే సత్తా ఉందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ ప్రతి వార్డులో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు హితవు పలికారు. అనంతరం పోటీల్లో ఉన్న అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, సరాపు యాదగిరి, రమేష్‌రెడ్డి, మ్యాడం బాలక్రిష్ణ, చిటుకుల మైపాల్‌రెడ్డి, నాయకులు గజవాడ నాగరాజు, దేమె యాదగిరి, చింతల స్వామి, విప్లవ్‌కుమార్, డాకి స్వామి, గణేష్, రవీందర్‌రెడ్డి, ఎనిశెట్టి అశోక్‌గుప్తా, రాజిరెడ్డితో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## మేయర్ పీఠం కైవసం చేసుకుంటాం



ప్రజాపక్షం/నిజామాబాద్ : మేయర్ పీఠం కైవసం చేసుకుంటామని, కాంగ్రెస్ అభివృద్ధి సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని కేశాపూర్ గ్రామ సమీపంలో ఈనెల 6న సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికలు నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని, ఈ రోజు గుర్తులు కేటాయించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు, సన్నబియ్యం, రేషన్ కార్డు, ఆర్టీసీ ప్రయాణం, సన్నాలకు బోనస్, రుణమాఫీ, మహిళలకు జీరో వడ్డీకి రుణాలు, వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులు యువతకు ఉద్యోగ కల్పన కోసం స్కిల్ యూనివర్సిటీతో పాటు ఎన్నో పథకాలు రెండేళ్లలో మార్పు కనిపిస్తుందన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పోటీ చేసినప్పటికీ 60 శాతం కాంగ్రెస్‌కు వచ్చాయని అదే ఉత్సాహం రిపీట్ అవుతుందన్నారు. జిల్లాకు అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లడానికి సిఎం రూ.700 కోట్ల నిధులతో శంకుస్థాపనలు చేయనున్నారని, 20 కోట్లతో పూర్తయిన వాటిని ప్రారంభోత్సవం చేయబోతున్నారన్నారు. మూ డు ఇంటిగ్రేటర్ స్కూల్స్ నిజామాబాద్, బోధన్, ఆర్మూర్‌లకు సంబంధించిన 600 కోట్లతో శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. టియు వీసీ లేకుండా ఇన్‌చార్జిలతో నడిపించిన ఘనత బీఆర్ఎస పార్టీదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇంజనీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాలతో పాటు నాలుగు కోర్సులు ప్రారంభించటం జరిగిందన్నారు. టియులో ఆ డిటోరియం 18 కోట్లు, ఇంజనీరింగ్ కళాశాల తో పాటు మొత్తం 43 కోట్లు పనులకు మం జూరు చేశారన్నారు. సైన్స్‌ల్యాబ్ 18 కోట్లతో ఇందల్వాయి ఏకలవ్య స్కూల్‌కు 12 కోట్లు కేటాయించటం జరిగిందన్నారు. 50 వేల మందితో ఫిబ్రవరి 6 న సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించనున్నామని జిల్లా నుంచి కాంగ్రెస్ శ్రేణులు అభిమానులు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, డిచ్‌పల్లి సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు వాసుబాబు, సాయరెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు చిన్నబాల్‌రాజ్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా మొదలైన వివిధ పార్టీల ప్రచార పర్వం

మంచిర్యాల కార్పొరేషన్ బరిలో 240 అభ్యర్థులు

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ నెల 11న జరుగనున్న ఎన్నికల బరిలో వివిధ పార్టీల నుండి బరిలో ఉన్న 240 మంది మొదటి రోజు బుధవారం ఎవరికి నచ్చిన రీతిలో వారు అట్టహాసంగా ప్రచార పర్వంను మొదలు పెట్టారు. మున్సిపల్ కార్పోరేషన్‌లో 60 డివిజన్ లలో వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్ అభ్యర్థులు ప్రచారాన్ని నిర్వహించారు. మంచిర్యాల మునిస్పల్ కార్పోరేషన్‌లో 60 వార్డులలో కాంగ్రెస్ పార్టీ నుండి 59 మంది, సిపిఐ నుండి ఒకరు, బిజెపి నుండి 58 మంది, బిఆర్ఎస్ నుండి 58 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఏడుగురు, సిపిఎం నుండి ఇద్దరు, ఎంఐఎం నుండి ఇ ద్దరు, ఎఐఎఫ్‌బి నుండి 18 మంది, జెఎస్‌పి నుండి నలుగురు, వివిధ పార్టీల ను ండి ఐదుగురు, స్వతంత్ర్య అభ్యర్థులు 18 మంది అభ్యర్థులు బరిలో నిలి చారు.10, 54 వార్డుల నుండి ద్విముఖ పోటీ ఉండగా 21 వార్డులలోత్రిముఖ పోటీ, 18 వార్డులలో చతుర్ముఖ పోటీ ఉంది. మరో 14 వార్డులు ఐదుగురు, నాలుగు వార్డులలో ఆరుగురు, బరిలో నిలిచారు.

# బాల్యంపై నిర్మల్ పోలీసుల'చిరునవ్వు'

ఆపరేషన్ స్మైల్ - ద్వారా 66 మంది చిన్నారులకు విముక్తి , యజమానులపై 54 కేసులు నమోదు




ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : బాల కార్మిక వ్యవస్థ లేని జిల్లాగా నిర్మల్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్XII కార్యక్రమం జిల్లాలో దిగ్విజయంగా ముగిసింది.జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు జనవరి 1వ తేదీ నుండి నెల రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రమాదకర పనుల్లో మగ్గుతున్న 66 మంది చిన్నారులను రక్షించినట్లు ఎస్పీ తెలిపారు.అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి నోడల్ అధికారిగా వ్యవహరించిన ఈ ఆపరేషన్‌లో పోలీస్,విద్యా,రెవెన్యూ,కార్మిక,బాలల రక్షణ విభాగాలు సమన్వయంతో పనిచేసి అద్భుత ఫలితాలు సాధించాయి.జిల్లాలోని హోటళ్లు, పౌల్ట్రీ ఫామ్‌లు,ఇటుక బట్టీలు,వెల్డింగ్ షాపులు, గొర్రెల కాపరులుగా పని చేస్తున్న చిన్నారులను గుర్తించేందుకు స్మైల్ బృందాలు విస్తృతంగా గా లింపు చర్యలు చేపట్టాయి.ఈ క్రమంలో నిర్మల్ డివిజన్‌లో 34 మందిని,భైంసా సబ్ డివిజన్‌లో 32 మందిని,మొత్తం 66 మంది (61 మంది బాలురు,5 మంది బాలికలు) బాలకార్మికులను రక్షించారు.వీరిలో అత్యధికంగా 54 మంది చిన్నారులను పనుల్లో పెట్టుకున్న యజమానులపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయగా ,మిగిలిన వారికి జరిమానాలు విధించారు.ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపమని,పిల్లల భవిష్యత్తును చిద్రం చేసే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ఆర్థిక ఇబ్బందుల నెపంతో పనులకు పంపవద్దని,విద్య ద్వారానే వారి భవిష్యత్తు మారుతుందని హితవు పలికారు.జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిసిపిఓ మురళి,ఎస్ఐలు నరేష్,దయాళ్ సింగ్,హనుమాండ్లు,ఇతర పోలీస్ సిబ్బంది ,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిర్మల్ పోలీసింగ్‌లో 'నారీశక్తి' చాటింపు

సమస్యల పరిష్కారంలో స్పీడ్..అవగాహనలో అహర్నిశలు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ నాయకత్వంలో ప్రతి బుధవారం చేపడుతునన ''నారీశక్తి'' కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయంతంగా కొనసాగుతోంది.మహిళా పోలీస్ సిబ్బంది తమ విధుల్లో భాగంగా కేవలం పెట్రోలింగ్‌కే పరిమితం కాకుండా,డయల్ 100 కాల్స్‌కు తక్షణమే స్పందిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు.ముధోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో భార్యను వేధిస్తున్న భర్తపై వచ్చిన ఫిర్యాదుకు నారిశక్తి బృందం తక్షణమే స్పందించి,క్షేత్రస్థాయికి చేరుకుని ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను శాంతియుతంగా పరిష్కరించారు.కేవలం శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా,సామాజిక చైతన్యంలోనూ నారిశక్తి బృందాలు చురుకైన పాత్ర పోషిస్తున్నాయి.జిల్లాలోని వివిధ గ్రామాల్లో పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు.అలాగే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన,మైనర్ డ్రైవింగ్,మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు వివరించారు.విలేజ్ పోలీసింగ్‌లో భాగంగా కల్తీకల్లు,గంజాయి వాడకం,అక్రమ రవాణా వంటి సామాజిక దురాచారాల నిర్మూలనపై ప్రజలను చైతన్యపరిచారు.

# నిర్మల్ మున్సిపల్ పోరు: హస్తం దూకుడు... కమలం ఆత్మరక్షణ!


ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ పట్టణ రాజకీయ ముఖచిత్రం ఒక్కాసారిగా మారిపోయింది.మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి.ముఖ్యంగా ఈసారి నిర్మల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఆ పార్టీ అగ్రనేతలు పావులు కదుపుతున్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ బిజెపి తరపున ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించినప్పటికీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కావడంతో ఇప్పుడు ఓటర్ల ఆలోచనా ధోరణిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది.

### ఐక్యంగా కాంగ్రెస్ దిగ్గజాలు అధిష్ఠానం సీరియస్ ఆదేశాలు

నిర్మల్ కాంగ్రెస్‌లో గతంలో ఉన్న విభేదాలన్నీ ఇప్పుడు కనుమరుగయ్యాయి.మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడం ద్వారా పట్టణంలో పార్టీ పట్టును మళ్లీ నిరూపించుకోవాలని ముఖ్య నేతలందరూ ఏకతాటిపైకి వచ్చారు.అధిష్టానం నుండి వచ్చిన స్పష్టమైన ఆదేశాలతో, వ్యక్తిగత అజెండాలను పక్కన పెట్టి పార్టీ విజయం కోసం నడుము బిగించారు. రాష్ట్రం లో తమ ప్రభుత్వమే అధికారంలో ఉండటంతో, నిర్మల్ అభివృద్ధికి భారీగా నిధులు తీసుకురావచ్చని,తద్వారా పట్టణ రూపురేఖలు మార్చవచ్చని నాయకులు ప్రజల్లోకి వెళ్తున్నారు.

### బిజెపికి ఎమ్మెల్యే ఉన్నా.. ఓటర్లలో నిరాశే..!

నిర్మల్ నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఉన్నప్పటికీ,మున్సిపాలిటీ స్థాయిలో ఆ పార్టీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి.సాధారణంగా మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ వైపు మొగ్గు చూపడం ఓటర్లనైజం.ఎందుకుంటే అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచే మంజూరు కావాలి.బిజెపి అధికారంలో లేని రాష్ట్రంలో,కేవలం ఎమ్మెల్యే ఉన్నంత మాత్రాన పట్టణ ప్రగతి సాధ్యం కా దని ప్రజలు చర్చించుకుంటున్నారు.దీనికి తోడు బిజెపి స్థానిక నాయకత్వంలో చోటుచేసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు,కార్యకర్తలను విస్మరించడం ఆ పార్టీ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీస్తోంది.



### హ్యాట్రిక్ కౌన్సిలర్ దూరం బిజెపికి కోలుకోలేని దెబ్బ..

నిర్మల్ మున్సిపాలిటీలో బిజెపికి మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.వరుసగా మూడు సార్లు కౌన్సిలర్‌గా గెలిచి, ప్రజల్లో చెక్కుచెదరని ప్రజాదరణ కలిగిన కీలక నాయకుడు(హ్యాట్రిక్ కౌన్సిలర్) పార్టీని వీడటం ఇప్పుడు పట్టణంలో హాట్ టాపిక్ గా మారింది.బిజెపిలోని అంతర్గత కుమ్ములాటలు,కొందరి ఆధిపత్య ధోరణి భరించలేకే ఆయన పార్టీని వీడారని ఓటర్లు భావిస్తున్నారు.బలమైన నాయకులు వెళ్ళిపోతుండటంతో బిజెపి క్యాడర్‌లో నైతిక బలం తగ్గిపోతోంది.ఇది కాంగ్రెస్ పార్టీకి భారీగా కలిసి వచ్చే అంశంగా మారింది.

### కాంగ్రెస్ వైపు ఏకపక్షంగా ఓటర్ల మొగ్గు..

ప్రస్తుత పరిస్థితుల్లో నిర్మల్ ఓటరు స్పష్టమైన నిర్ణయంతో ఉన్నట్లు కనిపిస్తోంది.బిజెపి పట్ల పెరుగుతున్న వ్యతిరేకత,కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు'చేయి' గుర్తుకు అనుకూలంగా మారుతున్నాయి.పట్టణంలో మౌలిక వసతుల కల్పన,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల,నిధుల మంజూరు వంటి అంశాలు జరగాలంటే కాంగ్రెస్ చైర్మన్ ఉండాలని సామాన్య ప్రజలు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు నా యకుల ఐక్యతతో కాంగ్రెస్ దూసుకుపోతుంటే.. అంతర్గత సమస్యలు,వలసలతో బిజెపి ఆత్మరక్షణలో పడింది.ఈసారి నిర్మల్ మున్సిపల్ పీఠంపై హస్తం జెండా ఎగరడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## అండర్–19 వరల్డ్ కప్‌లో
# ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్



అండర్ 19 వరల్డ్‌కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఆఫ్ఘనిస్తాన్‌తో బుధవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం నమోదు చేసింది. అరోన్ జార్జి సెంచరీతో చెలరేగగా.. వైభవ్ సూర్యవంశీ దూకుడైన అర్ధసెంచరీతో భారీ విజయ లక్ష్యాన్ని ఇండియా సునాయాసంగా ఛేధించింది. హరారే వేదికగా జరిగిన మ్యాచులో మొదట ఆఫ్ఘనిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 310 పరుగులు చేసింది. ఆఫ్ఘన్ బ్యాటర్లలో ఇద్దరు సెంచరీలు సాధించారు. ఫైజల్ షినోజోదా 110 పరుగులు (93 బంతుల్లో 15 ఫోర్లు), ఉజైరుల్లా 101 పరుగులు, నాటౌట్ (86 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లు)తో ఆకట్టుకున్నారు. తర్వాత ఉస్మాన్ సాదత్ 39 పరుగులు, ఖలీద్ అహ్మద్జాయ్ 31 పరుగులు సాధించారు. ఇండియన్ బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ చెరో రెండు వికెట్లు సాధించారు. అనంతరం 311 పరుగుల భారీ లక్ష్యంతో భారత్ బ్యాటింగ్ ఆరంభించింది. ఓపెనర్ అరోన్ జార్జ్ 115 పరుగులు (104 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు)తో చెలరేగిపోయాడు. తర్వాత వైభవ్ సూర్యవంశీ 62 పరుగులు (33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు)తో విధ్వంసం సృష్టించాడు. ఆ తర్వాత కెప్టెన్ ఆయుష్ మాత్రే కూడా 62 పరుగులు (59 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లు)తో అదరగొట్టాడు. అలాగే విహాన్ మల్హోత్రా కూడా 38 పరుగులతో రాణించారు. భారత బ్యాటర్లు సమష్టిగా రాణించడంతో 41.1 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది. ఫైనల్కు దూసుకెళ్లింది. ఈ నెల 6, శుక్రవారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య ఈ తుదిపోరు ఉంటుంది.

# అమ్మో అది మనవల్ల కాదులే..

### క్రికెట్ కామెంట్రీ గురించి ధోని ఆసక్తికర వ్యాఖ్యలు



క్రికెట్ కామెంట్రీ గురించి టీమిండియా మాజీ కెప్టెన్ ఎమ్మెస్ ధోని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. క్రికెట్ కామెంట్రీ అనేది ఓ కళ అని అన్నాడు. కామెంటర్‌గా చేయాలంటే చాలా టాలెంట్ ఉండాలన్నాడు. క్రికెట్ గురించి అందులో నెంబర్స్ గురించి పూర్తిగా తెలుసుండాలి సమయానికి అన్నీ గుర్తుండాలి. ఎంతో చమత్కారంగా, ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా లైవ్ కామెంట్రీ చెప్పడం చాలా కష్టం. అది అందరికీ సాధ్యం కాదన్నారు. మొబైల్ ఫోన్‌లోనే ఇతరులతో మాట్లాడాలంటే నేను ఎంతో ఇబ్బంది పడతాను, అలాంటిది కామెంట్రీ చెప్పడమా?.. అది మనవల్ల కాని పనిలే అని కామెంట్రీ గురించి అన్నాడు. క్రికెట్ మ్యాచ్ లైవ్‌లో ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా కామెంట్రీని ఎంతో ఆసక్తికరంగా చెప్పడం ఓ కళ అని ధోని పేర్కొన్నాడు. ప్లేయర్స్ భారీ షాట్స్ కొట్టినపుడు, గెలుపోటములు విశ్లేషించేటపుడు ఎవరూ నొచ్చుకోకుండా రన్నింగ్ కామెంట్రీ చెప్పడం చాలా కష్టమని, క్రికెట్ ప్లేయర్స్ అందరీ రికార్డ్స్ మొదలు కొని పాత మ్యాచ్‌ల గణంకాలు గుర్తు పెట్టుకోవాలి. ఇది అందరికీ సాధ్యమయ్యే విషయం కాదు. నా గణాకాంలే నాకు గుర్తుకుండవు అని ధోని అన్నాడు.


# బెంగళూరుతో టైటిల్ పోరుకు ఢిల్లీ సిద్ధం



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరింది. టోర్నీ ఆరంభ దశలో పడుతూ లేస్తూ ఆడిన ఆ జట్టు.. కీలకమైన ఎలిమినేటర్ పోరులో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటింది. వడోదరలో గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన పోరులో ప్రత్యర్థిని 7 వికెట్ల తేడాతో చిత్తుచేసిన ఢిల్లీ.. ఈనెల 5న (గురువారం) ఇదే వేదికలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి)తో అమీతుమీ తేల్చుకోనుంది. మంగళవారం గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో నిర్దేశించిన 169 పరుగుల లక్ష్యాన్ని క్యాపిటల్స్ 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. లిజెల్లె లీ (24 బంతుల్లో 43, 8 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (23 బంతుల్లో 41, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 వద్దే పరిమితమైంది. బెత్ మూనీ (51 బంతుల్లో 62 నాటౌట్, 6 ఫోర్లు), జార్జియా వర్హైమ్ (35) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు.

**ఆడుతూ పాడుతూ..**లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఎప్పట్లాగే ఢిల్లీకి ఓపెనర్లు మెరుపు ఆరంభాన్నిచ్చారు. లీ, షెఫాలీ (21 బంతుల్లో 31, 7 ఫోర్లు) దూకుడుగా ఆడటంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు వికెట్లేమీ నష్టపోకుండా 75 రన్స్ చేసింది. మొదట రాజేశ్వరి 3వ ఓవర్లో షెఫాలీ రెండు బౌండరీలు బాదగా డివైన్ ఓవర్లో రెండు ఫోర్లతో కలుపుకుని 17 పరుగులొచ్చాయి. రేణుకా 5వ ఓవర్లో అయితే లీ హ్యాట్రిక్ ఫోర్లతో చెలరేగగా షెఫాలీ రెండుసార్లు బంతిని బౌండరీ లైన్ దాటించింది. వర్హైమ్ రాకతో గుజరాత్కు డబుల్ బ్రేక్ దక్కింది. ఆమె వేసిన 8వ ఓవర్ తొలి బంతికి లీ వికెట్ల ముందు దొరికిపోగా ఆఖరి బంతికి షెఫాలీ వర్హైమ్కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించింది. కానీ అప్పటికే ఢిల్లీ లక్ష్యంలో సగాన్ని ఊదేసింది. వారి స్థానాల్లో క్రీజులోకి వచ్చిన వోల్వార్ట్ (32*), జెమీమా నిలకడగా ఆడి ఆ జట్టును గెలుపు దిశగా మరింత చేరువ చేశారు. క్రీజులో కుదురుకున్నాక ధాటిగా ఆడిన జెమీమా.. విజయానికి 9 పరుగుల దూరంలో ఔట్ అయినా వోల్వార్ట్, కాప్ (4*) లాంఛనాన్ని పూర్తిచేశారు. రెండో ఓవర్లోనే డెవిన్ (6)వికెట్ కోల్పోయినా పవర్ ప్లేలో గుజరాత్ నిలకడగానే ఆడింది. కాప్ వేసిన 4వ ఓవర్లో 17 పరుగులు రాబట్టి జోరు మీద కనిపించిన ఆ జట్టుకు ఆరో ఓవర్‌లో బంతినందుకున్న నందని వరుస బంతుల్లో షాకిచ్చింది. తొలి బంతికి అనుష్క(16)ను వెనక్కిపంపిన ఆమె.. రెండో బంతికి గుజరాత్ సారథి ఆష్లీ గార్డ్నర్ను డకౌట్ చేసి కోలుకోలేని దెబ్బకొట్టింది. దీంతో గుజరాత్ స్కోరు వేగం నెమ్మదించింది. 9వ ఓవర్‌లో మిన్ను మణి.. కనిక అహుజా(6)నూ బోల్తా కొట్టించడంతో క్రీజులోకి వచ్చిన వర్హైమ్(35)తో కలిసి మూనీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. కానీ హెన్రీ 17వ ఓవర్‌లో గుజరాత్‌కు డబుల్ షాకులిచ్చింది. వర్హైమ్తో పాటు ఫల్మలిని ఔట్ చేసి ఆ జట్టు భారీ స్కోరు చేయకుండా అడ్డుకట్ట వేసింది.

# శతాబ్దాల నాటి ఘన చరిత్ర 'ఇన్కా'




కుస్కో (పెరూ) నగరంలో నిలిచిన రాతి గోడలు ఇన్కా సామ్రాజ్యపు అపూర్వమైన వారసత్వానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. 15, 16వ శతాబ్దాల మధ్య కాలంలో నిర్మితమైన ఈ గోడలు, అప్పటి ఇన్కా నాగరికత ఎంతటి అభివృద్ధి చెందినదో తెలియజేస్తాయి. ఆధునిక యంత్రాలు, లోహ పరికరాలు లేకపోయినా, వారు సాధించిన నిర్మాణ నైపుణ్యం నేటికీ ఇంజినీర్లు, చరిత్రకారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ గోడల ప్రత్యేకత వాటి నిర్మాణ శైలిలో దాగి ఉంది. భారీ పరిమాణంలో ఉన్న అసమానాకార రాళ్లను అత్యంత నైపుణ్యంతో చెక్కి, ఒకదానితో ఒకటి అచ్చుగుద్దినట్లుగా అమర్చారు. ఈ రాళ్లను బలంగా ఒకదానితో మరొకటి అనుసంధానం చేశారు వాటి మధ్య ఒక కత్తి లేదా కూడా ప్రవేశించలేనంత కచ్చితత్వం ఉంది. ముఖ్యంగా గమనించాల్సిన విషయం ఏమిటంటే..ఈ నిర్మాణంలో ఎక్కడా సిమెంటు లేదా మోర్టార్ వాడలేదు. రాళ్ల మధ్య ఉన్న సహజ సమతుల్యతే ఈ గోడలకు అసాధారణమైన బలం చేకూర్చింది. ఇన్కా శిల్పులు రాళ్ల ఆకృతులను సహజంగా మార్చి, వాటి బరువు, కేంద్రబలం, పరస్పర ఒత్తిడిని గణితపూర్వకంగా అర్థం చేసుకుని నిర్మాణం చేశారు. ఫలితంగా ఈ గోడలు భూకంపాల సమయంలో కదిలినా కూలిపోవు. శతాబ్దాలుగా పెరూ ప్రాంతంలో అనేక తీవ్ర భూకంపాలు సంభవించినా, కుస్కో రాతి గోడలు మాత్రం అచంచలంగా నిలిచి ఉన్నాయి. ఇది ఇన్కా ప్రజలకు ప్రకృతి శక్తులపై ఉన్న లోతైన అవగాహనను స్పష్టంగా చూపిస్తుంది. ఈ గోడలను కేవలం రాతి నిర్మాణాలుగా చూడడం సరికాదు. ఎందుకంటే, అవి ఇన్కా సమాజపు శాస్త్రీయ దృష్టికోణం, కళాభిరుచి, క్రమశిక్షణను ప్రతిబింబిస్తాయి. ప్రతి రాయి ఒక ప్రత్యేక ఆకారంలో ఉండి, పక్కనున్న రాళ్లతో సమన్వయంగా కలిసిపోతుంది. ఈ సమన్వయాన్ని 'వ్యక్తి, సమాజం, ప్రకృతి మధ్య సమతుల్యత' అనే ఇన్కా తత్వశాస్త్రానికి కూడా ప్రతీకగా భావించవచ్చు. నేటి రోజుల్లో కుస్కో గోడలు పురావస్తు అవశేషాలుగా మాత్రమే కాకుండా, మానవ ప్రతిభకు చిరస్థాయిగా నిలిచిన చిహ్నాలుగా కనిపిస్తాయి. 'సాంకేతికత కంటే మేధస్సు, ప్రకృతితో స్నేహం, దూరదృష్టి ఉన్నపుడు నాగరికతలు శతాబ్దాలను దాటి నిలిచే సృష్టులను నిర్మించగలవు' అనే వాస్తవాన్ని అవి మనకు గుర్తు చేస్తాయి. కుస్కో రాతి గోడలు ఇప్పటికీ మౌనంగా నిలిచి, ఇన్కా నాగరికత యొక్క మహోన్నత కథను ప్రపంచానికి చెబుతూనే ఉన్నాయి.





## టర్కీలో ప్రాచీన నగరం..

టర్కీ దేశంలోని బుర్దూర్ ప్రాంతంలో ఉన్న అద్భుతమైన టారస్ పర్వతాల నడుమ, గొప్ప ప్రాచీన నగరం సాగలస్సస్ విరాజిల్లుతోంది. ఒకప్పుడు పిసిడియా ప్రాంతానికి ప్రధాన నగరంగా ఉన్న ఈ విస్తారమైన పురావస్తు ప్రదేశం కాలయాత్రలా అనిపిస్తుంది. మేఘాల నగరంగా పేరుపొందిన సాగలస్సస్, పర్వతాల అద్భుత దృశ్యాల నడుమ నిలిచిన అద్భుతమైన అవశేషాలతో ప్రాచీన మహోన్నతతను గుర్తు చేస్తుంది. ఇక్కడికి వచ్చిన సందర్శకులు స్తంభాలతో అలంకరించిన వీధుల్లో నడుస్తూ రోమన్ యుగపు విశాలమైన నాటకశాల/ రంగస్థలాన్ని ఆశ్చర్యంగా వీక్షించవచ్చు. దాని శబ్ద ప్రతిధ్వని ఇప్పటికీ అద్భుతంగా వినిపిస్తుంది. అలాగే నియోన్ లైబ్రరీ, అంటోనిన్ ఫౌంటెన్ వంటి వైభవమైన స్మారక చిహ్నాలను కూడా చూడవచ్చు. ప్రత్యేకంగా, శ్రద్ధగా పునరుద్ధరించిన అంటోనిన్ ఫౌంటెన్ ఈరోజుకీ పర్వతాల నుండి వచ్చే స్వచ్ఛమైన నీటిని ప్రవహింపజేస్తోంది. ప్రాచీన నగరాల్లో అత్యంత బాగా సంరక్షించబడిన నగరంగా సాగలస్సస్, హెల్లెనిస్టిక్ మరియు రోమన్ యుగాల సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తుంది. దాని మెట్లు, ప్రజా ప్రాంగణాలు, నిర్మాణ పద్ధతులు చూసినప్పుడు అక్కడి ప్రజల ఆధునిక పట్టణ ప్రణాళికా నైపుణ్యం, కళాత్మకత స్పష్టంగా కనిపిస్తుంది. సాగలస్సస్ సందర్శన కేవలం పురాతన అవశేషాల పర్యటన మాత్రమే కాదు.. ఒక గాఢమైన చారిత్రక అనుభవం.



## తొలి ఎలక్ట్రిక్ వాహనం 'పోర్షే పి1'

ఫెర్డినాండ్ పోర్షే 1898లో రూపకల్పన చేసి ప్రదర్శించిన 'పోర్షే పి1' కారు, ప్రపంచ ఆటోమోటివ్ చరిత్రలోనే కాకుండా ఎలక్ట్రిక్ వాహనాల అభివృద్ధిలో ఒక విప్లవాత్మక మైలురాయిగా నిలిచింది. ఇది పూర్తిగా విద్యుత్ శక్తితో నడిచిన తొలి కార్లలో ఒకటి కావడం విశేషం. ఆ కాలంలో పెట్రోల్ వాహనాలే ప్రాధాన్యం పొందుతున్న సమయంలో, విద్యుత్ ఆధారిత వాహనాన్ని ఊహించడం పోర్షే దూరదృష్టికి నిదర్శనం. ఈ కారులో 3 హార్స్‌పవర్ ఎలక్ట్రిక్ మోటార్, 12స్పీడ కంట్రోలర్ అమర్చబడ్డాయి. గరిష్టంగా గంటకు సుమారు 35 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలిగే ఈ వాహనం, అప్పటి సాంకేతిక పరిమితులను దాటింది. జర్మనీలోని స్టుట్గార్ట్‌లో ఉన్న పోర్షే మ్యూజియంలో ఈ చారిత్రక వాహనం దర్శనమిస్తుంది. ఇది పోర్షే సంస్థ యొక్క ఆవిష్కరణాత్మక ప్రయాణానికి తొలి అడుగుగా గుర్తింపు పొందింది.



# మిత్రద్రోహి ఎమ్మెల్యేకు గుణపాఠం చెప్పండి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
### మానుకోటలో సిపిఐ ఎన్నికల ప్రచారం ప్రారంభం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** కమ్యూనిస్టులకు మిత్రద్రోహిగా మారిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు మున్సిపాలిటీ ఎన్నికలలో గుణపాఠం చెప్పాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్‌లో జరిగిన సిపిఐ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మానుకోట 36వ వార్డు అభ్యర్థి, సిపిఐ మహబూబాబాద్ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రచార సభలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత శాసనసభ ఎన్నికల్లో సిపిఐ మద్దతుతో గెలుపొంది, అధికారంలోకి వచ్చిన తరువాత, మిత్రులైన కమ్యూనిస్టులను మర్చిపోయిన మహబూబాబాద్ ఎమ్మెల్యే వైఖరిని ప్రజలు గమనించాలన్నారు. ఎమ్మెల్యే మురళీనాయక్ ఒంటెద్దు పోకడలతో ఉభయులకు నష్టం జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో గత శాసనసభ ఎన్నికల అనంతరం తాము మిత్ర ధర్మాన్ని పాటిస్తూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లడం జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకత్వం కమ్యూనిస్టులతో కలిసి పనిచేస్తుంటే, మహబూబాబాద్ ఎమ్మెల్యే అందుకు విరుద్దంగా కమ్యూనిస్టులను దూరం పెట్టడం సరికాదన్నారు. మిత్రధర్మాన్ని పాటించకపోతే ఎమ్మెల్యేకు గుణపాఠం చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. డబ్బుసంచులు, మద్యం సీసాలతో వచ్చే వారిని ఓడించి, నిరంతరం ప్రజల పక్షాన నిలబడి మానుకోట అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పని చేసే సిపిఐ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్థులుగా గెలిపించాలని తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మానుకోట ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి, జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి, 33వ వార్డు అభ్యర్థి బి.అజయ్‌సారధిరెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, 36వ వార్డు అభ్యర్థి పెరుగుకుమార్, 18 వార్డు అభ్యర్థి రేషపల్లి నవీన్, 22వ వార్డు అభ్యర్థి చింతకుంట్ల శ్రీదేవి, 21వ వార్డు అభ్యర్థి ఎండి ఫాతిమా, 23వ వార్డు అభ్యర్థి నాగిల్లి యాకమ్మ 25వ వార్డు అభ్యర్థి నర్ర సంధ్య, 29వ వార్డు అభ్యర్థి నర శ్రావణ్ 24వ వార్డు అభ్యర్థి చింతకుంట్ల వెంకన్న 27వ వార్డు అభ్యర్థిని వెలుగు అశ్విని 31 వ వార్డు అభ్యర్థిని ఆబోతు సరళ తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురంలో సిపిఐ విస్తృత ప్రచారం

### సిపిఐ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరిన బాగం, దండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఐ అభ్యర్థులు ప్రజలతో మమేకమవుతూ పార్టీ చేసిన పోరాటం, అభివృద్ధిని వివరిస్తూ ముందుకుసాగుతున్నారు. ప్రజల ఆదరణ, మహిళ హారతులతో ఘనస్వాగతం అందుకుంటున్నారు. ప్రచారంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత్‌రావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ గడపగడకు తిరుగుతు అభ్యర్థుల గెలుపుకై ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎర్రజెండాల రెపరెపల సాక్షిగా సిపిఐ డివిజన్లు అరుణకాంతులీనుతున్నాయి. ఈ సందర్భం గా 28వ డివిజన్‌లో దండి రంగారావు, 24 నునావత్ పాండు రంగా, 23 చెరుకుపల్లి పవిత్ర, 19 సత్తి లక్ష్మి ప్రచారం ముమ్మరంగా సాగింది. ప్రచారం ఆద్యంతం ప్రజల దీవెనలు, ఎర్రజెండా ఖ్యాతిని ఇనుమడింపు చేస్తూ విశేష ఆదరణను పొందుతుంది. ప్రచార కార్యక్రమాలలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజ్మీరా రామ్మూర్తి నాయక్, సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, బానోత్ రాంకోటి, వెంపటి సురేందర్, కార్పోరేటర్ క్లైమంట్, సిపిఐ మున్సిపాలిటీ నాయకులు, యువజన సంఘం సభ్యులు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.







# పోరాటాలతోనే జగిత్యాల అభివృద్ధి

### సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం



**ప్రజాపక్షం/జగిత్యాల :** ప్రజా సమస్యలపై సిపిఐ చేబడుతున్న పోరాటాలతోనే జగిత్యాల ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని 5వ వార్డులో ఉన్న సిపిఐ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో 5వ వార్డు సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్న మహేష్ మద్దతుగా రూపొందించిన ఎన్నికల ప్రచార పోస్టర్లను విశ్వనాథం ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను నిరుపేదలకు అందించడమే లక్ష్యంగా సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. అనంతరం 5వ వార్డులోని సాయిరాం నగర్, బైపాస్ రోడ్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 5 వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహేష్‌ను అత్యదిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పనిచేసే సిపిఐ అభ్యర్థి వెన్న మహేష్ మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ కోరుట్ల కార్యదర్శి ముకర్రం, జగిత్యాల పట్టణ సీపీఐ కార్యదర్శి మాడిశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

### 57వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థిని లతశ్రీని గెలిపించాలని వెలిచాల ప్రచారం



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ కార్పొరేషన్ 57వ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని లతశ్రీ కసిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ అసెంబ్లీ ఇంచార్జీ వెలిచాల రాజేందర్ రావు ఓటర్లకు పిలుపునిచ్చారు. బుధవారం 57వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థిని ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాన్ని రాజేందర్ రావు ప్రారంభించారు. ఎన్నికల ప్రచారాన్ని ఎల్ఐసి కార్యాలయం చౌరస్తాలో ప్రారంభించి దోభివాడ, గణేష్ నగర్ ప్రాంతాలలో ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుతోనే నగరం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో కరీంనగర్ అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. 57వ డివిజన్‌ను పొత్తులో భాగంగా సిపిఐకి కేటాయించామని కాంగ్రెస్ బలపరిచిన సిపిఐ అభ్యర్థిని గెలిపించే బాధ్యత కాంగ్రెస్, సిపిఐ శ్రేణులపై ఉందన్నారు. డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండే లతశ్రీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని రాజేందర్‌రావు డివిజన్ ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, అభ్యర్థిని లతశ్రీ కసిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, న్యాలపట్ల రాజు, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపెల్లి రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మచ్చ రమేష్, నాయకులు గామినేని సత్యం, కూన రవి, నునావత్ శ్రీనివాస్, అంబరీష్ అంబ్రీష్ విష్ణు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# మతోన్మాద పార్టీలను ఓడించండి

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వామపక్ష పార్టీల అభ్యర్థులను గెలిపించండని, మతోన్మాద పార్టీలను ఓడించాలని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఓటర్లను కోరారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో సుధాకర్, రమేష్‌బాబు, వనమాల కృష్ణ, ఆకుల పాపయ్య, అనిల్‌లతో కలిసి మాట్లాడారు. ఈనెల 11న జరిగే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నిత్యం ప్రజా సమస్యలపై నిజాయితీగా పోరాడే వామపక్షపార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నగరంలో సిపిఐ అభ్యర్థులు 1వ డివిజన్‌లో రమేష్, 17వ డివిజన్‌లో స్వప్న, 10వ డివిజన్ వెంకట్రాములు, 11వ డివిజన్ సుజాత, 35వ డివిజన్ నూర్జహాన్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ 25వ డివిజన్ వనమాల కృష్ణ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ 7వ డివిజన్ ఆకుల పాపయ్య 24వ డివిజన్ ఆకుల అరుణ పోటీ చేస్తున్నారని వివరించారు. ప్రజాసమస్యలపై నిత్యం పేద ప్రజల పక్షాన పోరాడే నిజాయితీగా నిలబడే వ్యక్తులను కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిపించుకుంటే రాబోయే ఐదు సంవత్సరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండి వారి పక్షాన పోరాడే అవకాశముంటుందన్నారు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో ధనం, మద్యం, మతం పేరుతో ప్రజలను ప్రభావితం చేసి అధికారంలోకి రావలని బిజెపి, ఎంఐఎం ఇతర రాజకీయ పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని, వీటిని అరికట్టని, యెడల వివిధ కాలనీలో ఉన్న సమస్యలు మరింత పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులుంటాయన్నారు. ప్రజలు డబ్బు, మద్యం, మతం, కులం వాటికి ప్రభావం కాకుండా ప్రజల పక్షాన ఉండే వారిని ఆదరించాలని ఈ సందర్భంగా సుధాకర్ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఐఎంఎల్, మాస్‌లైన్, న్యూడెమోక్రసీ నాయకులు ఓమయ్య, సుధాకర్, నరేష్, గోపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.





## పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

**ప్రజాపక్షం/పరకాల :** గత బిఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యం వలన పరకాల పట్టణం అభివృద్ధిలో నిర్లక్ష్యానికి గురైందని, పరకాల పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్న కాంగ్రెస్‌ను మున్సిపల్ ఎన్నికలలో గెలిపించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణంలోని 3, 5, 16, 18, 19 వార్డులతోపాటు పట్టణంలోని వివిధ వార్డులలో అభ్యర్థులతో కలిసి ఆయన ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ మూడవవార్డు అభ్యర్థి పోరండ్ల మౌనిక వేణు, 4వ వార్డు అభ్యర్థి ఏకు దివ్య విద్యాసాగర్ 16వ వార్డు అభ్యర్థి బండి శ్రీధర్ గెలుపునకై టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతితో కలిసి పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రచారాన్ని నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని పరకాల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు.

## అతివేగంతో.. వాహనం బోల్తా



10 మందికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/ములుగు/మంగపేట/తాడ్వాయి:** చర్ల నుండి మేడారం అతి వేగంగా వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం తాడ్వాయి మండలం పరిధిలో బోల్తా పడింది. కామరాం గ్రామాన్ని దాటి గిన్నెలవాగు బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికుల్లో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే తాడ్వాయి ఎస్ఐ జగదీశ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో సమీప దవాఖానకు తరలించి తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

**ప్రమాద బాధితులను పరామర్శించిన మంత్రి సీతక్క...**

మేడారం సమీపంలో చెర్లలోని గన్నవరం కాలనీకి చెందిన భక్తులు వస్తున్న బోలెరో వాహనం మేడారం సమీపంలోని మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న సుమారు 25 మందికి గాయాలు కాగా 19 మంది ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వారిని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క బుధవారం పరామర్శించారు. తీవ్ర గాయాలపాలైన వారిని అత్యవసర చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజిఎంకు తరలించారు. ప్రస్తుతం ములుగులో చికిత్స పొందుతున్న వారిని వారి కుటుంబాలను మంత్రి సీతక్క పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. గాయాల పాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు.

## మీడియా సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/వరంగల్ :** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసిఎంసి) ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట మునిసిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, ఆర్డీఓ సుమా, డిపిఓ కల్పన, డిబిసిడిఓ పుష్పలత, ఆదనపు పీఆర్ఓ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/తొర్రూరు :** మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో గెలుపొంది కాంగ్రెస్ పార్టీ సత్తా చాటాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా పలు వార్డుల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మున్సిపాలిటీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో 16వార్డు కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం పూర్తిస్థాయిలో కృషి చేయాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులతో పాటు 50మంది వీరముష్టి ప్రజలు వార్డు అభ్యర్థి తాళ్లపల్లి శ్రీలత రమేశ్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారికి పార్టీ కండువాలను కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మున్సిపాలిటీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని పార్టీలో చేరుతున్నారని అన్నారు.

## అదృశ్యమైన బాలుడు అప్పగింత

**ప్రజాపక్షం/కమలాపూర్ :** కమలాపూర్ మండలం కాసీంపల్లి గ్రామానికి చెందిన ఎస్‌డి.అజ్మత్ (14 సంవత్సరాలు), హోలీ కుమారుడు ఎంజెపి గురుకుల పాఠశాలలో స్కూల్ చదువుతున్న ఆ విద్యార్థి అదృశ్యమైన ఘటనలో సమాచారం అందిన వెంటనే కమలాపూర్ ఇన్స్‌పెక్టర్ నవీన్ ఆదేశాల మేరకు ఎస్ఐ మధు, కానిస్టేబుళ్ళు ప్రమోద్, సాంబమూర్తి ఆధునిక సాంకేతికతను వినియోగించి బాలుడి ఆచూకిని గుర్తించారు. బాలుడిని సురక్షితంగా గుర్తించి అతని తల్లిదండ్రులకు వారి నివాసంలో అప్పగించారు. పోలీసుల సమయస్ఫూర్తితో బాలుడు సురక్షితంగా కుటుంబసభ్యుల వద్దకు చేరుకోవడం జరిగింది. దీంతో సిఐ నవీన్ పోలీసులను అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** ప్రజా సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు డివిజన్లలో మంత్రి కొండా సురేఖ పర్యటించి పలు అభివృద్ధి కొత్త పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎల్‌బి నగర్, వరంగల్ (13వ డివిజన్)లో నిర్మించనున్న ఉర్దూ ఘర్, షాదీఖానా పనులను ప్రారంభించి మైనార్టీ వర్గాలకు అవసరమైన మౌళిక వసతులు కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. అలాగే ఖిలా వరంగల్(36వ డివిజన్) పరిధిలోని చింతల్ ఈద్గా వద్ద చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో స్థానికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. (41వ డివిజన్) లోని శంభునిపేట మైనారిటీ కాలనీ, పూర్ణోదయ కాలనీల్లో సిసి రోడ్లు, సిసి డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించడం ద్వారా కాలనీల అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు నూతన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేరుస్తామని మంత్రి సురేఖ తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పేద సమస్యలు మానవత దృక్పథంతో అధికారులు పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ జోడొద్దుల్లా ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి సురేఖ తెలిపారు. రానున్న రోజుల్లో వరంగల్ జిల్లా అభివృద్ధి కొరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు వెళుతామన్నారు.



## రామప్పను సందర్శించిన ఎంసిహెచ్ఆర్‌డి అధికారులు

**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయంను ఎంసిహెచ్ఆర్డి శిక్షణ అధికారులు సందర్శించారు. బుధవారం మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి హైదరాబాద్ సంస్థలో శిక్షణ పొందుతున్న 80 మంది అధికారులు భారత్ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమాశంకర్లు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర శిల్పకళా ప్రాముఖ్యత గురించి వారికి వివరించారు. వారి వెంట ఎంసిహెచ్ఆర్డి అధికారులు, టూరిస్ట్ పోలీస్‌లు శ్రీనివాస్, భద్రులు ఉన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/జనగామ :** అభివృద్ధియే లక్ష్యంగా పనిచేసే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం జనగామ పట్టణంలోని 24, 25,26 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వయించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నుండి పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఓటు వేయడం వలన తమ వార్డు సమస్యలు తీరుతాయన్నారు. పట్టణ అభివృద్ధి లక్ష్యంగా బిఆర్ఎస్ పనిచేస్తుందని, గతంలో బిఆర్ఎస్ పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యతో పాటు ఇటీవల ప్రారంభించిన అభివృద్ధి పనులకు నిధులు బిఆర్ఎస్ హయాంలోనే వచ్చాయన్నారు. కూరగాయల మార్కెట్, ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల నిర్మాణం, బతుకమ్మ కుంట అభివృద్ధి బిఆర్ఎస్ హాయంలోనే జరిగిందన్నారు. పిలిస్తే పలికే నాయకులు బిఆర్ఎస్ నుండి పోటీ చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల బిఆర్ఎస్ ఇంఛార్జీలు 24వ వార్డు అభ్యర్థి గంగరబోయిన అనిత మల్లేశం, థాక్రె, చేవెళ్లి మధు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమానావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్




**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రతి సామాజిక వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని భీమారంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల కళాశాల వసతి గృహం (ధర్మసాగర్)లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, విద్యా సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వెనుకబడిన, అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సూచించారు.ఆర్థిక స్వాతంత్ర్యం సాధించిన తర్వాతనే బాలికలు వివాహం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులతో సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, హసన్ పర్తి తహసిల్దార్ కిరణ్ కుమార్, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సంపూర్ణ, వసతి గృహ వార్డెన్ ప్రియాంక, అధ్యాపకులు, వసతిగృహం విద్యార్థినులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో ఓటు అడిగే నైతిక హక్కు కడియంకే ఉంది

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/స్టేషన్ ఘన్‌పూర్ :** స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఘన్‌పూర్ మున్సిపాలిటీ శివునిపల్లి పరిధిలోని 2, 3, 4, 5 వార్డుల్లో ఆమె విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ స్థానికులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ సమగ్ర అభివృద్ధే ఏకైక లక్ష్యంగా ముందడుగు వేస్తున్న కడియం కుటుంబానికి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. తన తండ్రి కడియం శ్రీహరికి రాజకీయ జన్మనిచ్చిన ఘన్‌పూర్ సమగ్ర అభివృద్ధి ఆచరణ రూపం దాల్చాలంటే ఘన్ పూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో వివిధ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి బుధవారం ఎంపీ శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయకత్వంలో నియోజకవర్గంలో సాగునీరు, త్రాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఘనపూర్ మున్సిపాలిటీగా ఏర్పడిన అనంతరం ఇప్పటికే రూ.50 కోట్లతో పట్టణాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటును చేయి గుర్తుకు వేసి కాంగ్రెస్ వార్డు అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు అభ్యర్థి గుర్రం హరినాథ్, 3వ వార్డు అభ్యర్థి గుర్రం హైమా, 4వ వార్డు అభ్యర్థి బూర్ల శంకర్, 5వ వార్డు అభ్యర్థి కొంతం రజిత, వార్డు అబ్జర్వర్లు ఇన్చార్జిలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎం అండ్ హెచ్ఓకు సమ్మె నోటీస్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రామ రాజేష్ ఖన్నా, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు బత్తిని సదానందం గౌడ్ సమ్మె నోటీసును డిఎం అండ్ హెచ్ఓకు డాక్టర్ అల్లం అప్పయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని సదానందం గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ కేంద్ర, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, విబిజి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ నూతన చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, 106 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఈ.ఎస్.ఐ., పీ.ఎఫ్. ప్రతినెల ఉద్యోగుల ఖాతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల వేతనాలు అక్టోబర్ నవంబర్ డిసెంబర్, జనవరి వేతనాలు వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో నిరవేదిక సమ్మె కూడా వెనుకాడమని తెలియజేశారు. ఫిబ్రవరి 11వ తేదీలోపు 4 నెలల వేతనాలు ఉద్యోగుల ఖాతాలో జమ చేయకుంటే ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఎన్‌హెచ్ఎం హనుమకొండ జిల్లా ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొంటారన్నారు.

## భూపాలపల్లి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం సహకారంతో కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరుగుతుందని, రాష్ట్రంలోనే భూపాలపల్లి మున్సిపాలిటీని నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7, 26, 24, 25, 23 వార్డులు టీ 2 క్వార్టర్స్, కారల్ మార్క్స్ కాలనీ, 6 ఇంక్లైన్ రోడ్డు, రాజీవ్ నగర్ కాలనీలల్లో సిపిఐ, సిపిఐ (యం) పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు నూకల భూలక్ష్మి చంద్రమౌళి, ఓరుగంటి రాధ ఐలయ్య, వేముల జ్యోతి శ్రీకాంత్, పొనకంటి మేఘన శ్రీనివాస్, శిరుప స్వప్న అనిల్‌ల గెలుపు కొరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజుకుమార్, సీపీఐ (యం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, ముఖ్య నాయకులు, ఆయా వార్డుల ఎన్నికల ఇంచార్జీలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ముంజాల రవీందర్ గౌడ్‌కు చెందిన ఎన్నికల ప్రచార రథాన్ని ఎమ్మెల్యే జీఎస్సార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి సమగ్ర అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీలు బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని సత్యనారాయణ రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుజపెల్లి సుధాకర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు చాడ రఘునాథ్ రెడ్డి, స్థానిక నాయకులు మాజీ కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, వార్డు ఇన్చార్జిలు దొడ్డి కిష్టయ్య, డబ్బేట రమేష్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.


## 38 మంది బాల కార్మికులకు విముక్తి

జిల్లా ఎస్‌పి డా.శబరీష్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు లక్ష్యంగా మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జనవరి నెల రోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ – XII కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. 2026 జనవరి 1 నుండి 31 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టి మొత్తం 38 మంది బాలకార్మికులను గుర్తించి విముక్తి కల్పించామని, వారిలో 33 మంది బాలురు, 5 మంది బాలికలు ఉన్నారని వెల్లడించారు. వీరిలో 14 సంవత్సరాలలోపు 4 మంది, 14 సంవత్సరాల పైబడిన 34 మంది చిన్నారులు ఉన్నారని వివరించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై మొత్తం 18 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

## తండాలను పంచాయతీలుగా చేసే బాధ్యత నాది


వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 6వ వార్డు అభ్యర్థి మాలోతు దేవేందర్ చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతూ డీసీ తండాలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్.నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, టెస్కాబ్ క్యాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేస్తూ మాలోతు దేవేందర్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని తండా వాసులను కోరారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 10వ వార్డు అభ్యర్థి శ్రీమతి కొండేటి రజిత – సాంబయ్య చేతి గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతూ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి 10వ వార్డు అభ్యర్థి కొండేటి రజితను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు.

# జోరూ.. హుషారు..!

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం/జనగామ :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరూగా.. హుషారుగా సాగుతోంది. బిఫాంలు, విత్‌డ్రాల అనంతరం అభ్యర్థుల ప్రకటన పూర్తి కావడంతో అన్ని పార్టీలు పోటీ పడి ప్రచారం చేస్తున్నాయి. సమయం తక్కువగా ఉండడంతో ఉదయం, పగలు, రాత్రి తేడా లేకుండా ఇళ్లిల్లు తిరుగుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులు ఇంఛార్జీలుగా ఇక్కడే తిష్టవేయడం, వారి కుటుంబీకులు, పరిచయస్తుల ఓట్లు రాబట్టే పనిలో ఉన్నారు. ఆయా పార్టీల నాయకులు సైతం సుడిగాలి పర్యటన చేస్తున్నారు. మరో వైపు సమయం పడుతుండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 మున్సిపాల్టీలు ఉండగా 260 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్లు, విత్‌డ్రా అనంతరం 1072 మంది బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుండి 249 మంది, బిఆర్ఎస్ నుండి 259 మంది, బిజెపి నుండి 238 మంది ఉండగా ఇతరులు 326 మంది ఉన్నారు. సిపిఎం, సిపిఐకి సంబందించి 11 మంది పోటీలో ఉన్నారు. జనగామ జిల్లాకు సంబందించి రెండు మున్సిపాల్టీలు ఉండగా జనగామలో 30 వార్డులకు 127 మంది బరిలో ఉండగా కాంగ్రెస్ 27, బిఆర్ఎస్ 29, బిజెపి 26, సిపిఎం 3, సిపిఐ 1 బరిలో ఉన్నారు. స్టేషన్ ఘనపూర్‌లో 18 వార్డులు ఉండగా 82 మంది బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుండి 18, బిఆర్ఎస్ నుండి 18, బిజెపి 13, సిపిఎం ముగ్గురు బరిలో ఉన్నారు. కాగా సిపిఎం, సిపిఐలు పలు చోట్ల కాంగ్రెస్‌లో పొత్తు పెట్టుకుంది. అక్కడక్కడ జనసేన పార్టీ కూడా బరిలో ఉంది. జనగామ నుండి ఒకరు జనసేన నుండి బరిలో ఉన్నారు.

**పార్టీల ప్రచార జోరూ..**బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య తేలిపోవడంతో అన్ని పార్టీలు ప్రచారం జోరులో ఉన్నాయి. జనగామలో బిఆర్ఎస్ గత వారం రోజుల క్రితమే ప్రచారం మొదలుపెట్టగా కాంగ్రెస్ బుధవారం ప్రారంభించింది. పాల్వంచ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దగ్గర ఉండి ప్రచారం చేస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలలో ఆయన ఎన్నికలు ముగిసే వరకు జనగామలోనే ఉండనున్నారు. బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆహర్నిషలు కృషి చేస్తున్నారు. ఇక సిపిఎం, సిపిఐ అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల జిల్లా కార్యదర్శులు, నాయకత్వం ప్రచారం చేస్తుంది. డప్పు చప్పుల్లు, మైక్ మోతలు, కార్నర్ మీటింగ్‌లు, కార్యాలయాల ఓపెనింగ్‌లో మున్సిపాల్టీలు మారు మోగుతున్నాయి. సమయం ఆరు రోజులు మాత్రమే ఉండడంతో నాయకులు సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఒక్క రోజు ఐదు నుండి ఆరు వార్డుల్లో ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం పోలింగ్ గడువు తక్కువగా పెట్టింది. విత్‌డ్రాల అనంతరం ఆరు రోజుల గడువు మాత్రమే విధించింది. 11న పోలింగ్ జరగనుండగా 9వ తేది సాయంత్రం వరకే ప్రచారం ముగించాల్సి ఉంది. దీనితో నాయకులు ఎక్కువగా ప్రచారంపై దృష్టి పెట్టారు. సమయం తక్కువగా ఉండడంతో అన్ని ఇళ్లకు వెళ్లి ఓట్లు అడగడం కష్టంగా మారింది. దీనితో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది.

## ఉత్కృష్ట పతకాన్ని అందుకున్న డిసిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్/జనగామ :** పోలీస్ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం బెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్‌కు ప్రకటించిన ఉత్కృష్ట పతకాన్ని, బుధవారం సిపి క్యాంపు కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా డిసిపి రాజమహేంద్ర నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డిసిపికి అభినందనలు తెలియజేయడంతో పాటు విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచే అధికారులకు శాఖాపరమైన గుర్తింపుతో పాటు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కూడా లభిస్తుందని సిపి తెలియజేశారు. 2010 డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరిన రాజమండ్రి నాయక్ నెల్లూరు జిల్లాతో, వరంగల్ సిసిఎస్, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో డి.ఎస్పీగా పని చేసి 2017 అదనపు ఎస్పీగా భూపాలపల్లి, ఇంటెలిజెన్స్ పనిచేసి, 2021లో ఎస్పీ పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేసారు ప్రస్తుతం సెంట్రల్ జోన్ డిసిపి ఎంతో సమర్థవంతంగా పనిచేయడమే కాకుండా తను పని చేసిన సమయంలో ఎన్నో కీలక కేసులను పరిష్కరించడం డిసిపి రాజ మహేంద్ర నాయక్ కీలకంగా నిలిచారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది డీసీపీ అభినందనలు తెలిపారు.

## అశ్వారావుపేట అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వరు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాలిటీ అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా టిడిపి బలపర్చిన బిఆర్ఎస పార్టీ 10వ వార్డు అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ వార్డు అభ్యర్థి కోటగిరి కిషోర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేని, గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, అభివృద్ధి కేవలం బిఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. మున్సిపాల్టీ పురోభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, మండల నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతన్నలు



**ప్రజాపక్షం/గుండాల :** మండల పరిదిలోని సాయనపల్లి గ్రామానికి చెందిన పలువురి రైతులు యాసంగి మొక్కజొన్న పంట సాగుచేయగా రెండునెలలు గడుస్తున్నప్పటికి పంట అరమీటరు ఎత్తు ఎదిగి తలపూత రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుండాల వ్యాపారుల వద్ద కావేరి సీడ్స్ వారి ఎక్కా, నూజివీడు సీడ్స్ వారి బాండు సీడ్స్‌తో పాటు మరో సినిమాపేర్లను తలపించే విత్తనాలను కొనుగోలు చేసి విత్తగా ఎలాంటి ఎదుగు బొదుగు లేక పోగ అరమీటర్ ఎదిగి తలపూతకు రాగ రెండునెలలు కష్టించి శ్రమ వృదాఅయిందని రైతులు తోలెం సాంబయ్య, బొమ్మెర్ల రాంబాబు, తోలెం సుదాకర్, రామరావు, ఇర్పవిష్ణు విలేకర్ల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. పైన పేర్కొన్న విత్తన కంపెనీలవారు తమ పంట చేలను పరిశీలించి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. విత్తన కంపేనీల వారితో వ్యాపారులు మిలాకత్ అయ్యి రైతులు మోసం చేయడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. విద్యుత్ అంతారాయంతో రాత్రిబగులు కష్టపడ్డ శ్రమ అంతా వృదా అయిందని వాపోయారు. ఇప్పటికైన విత్తన కంపెనీల వారిపై తగిన చర్యలు తీసుకొని తమకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఐ(ఎం) సంయుక్త పోరు

మాజీ ఎంఎల్ఎ సండ్ర వెంకట వీరయ్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఈ నెల 11 న జరగనున్న సత్తుపల్లి మున్సిపల్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సిపిఎం) సంయుక్తంగా పోటీ చేస్తున్నాయని మాజీ ఎంఎల్ఎ సండ్ర వెంకట వీరయ్య తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. మొత్తం 23 వార్డుల్లో 22 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు, ఒక వార్డులోసిపిఎం అభ్యర్థి బరిలో ఉన్నారని వెల్లడించారు.అన్ని వర్గాలు, అన్ని కులాలు, అన్ని మతాలకు సముచిత ప్రాధాన్యత ఇచ్చేలా అభ్యర్థులను ఎంపిక చేశామని, నామినేషన్లు ఉపసంహరించుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే 02వ వార్డులో పార్టీ నిర్ణయాన్ని గౌరవించకుండా ఒక అభ్యర్థి ఇంకా పోటీలో కొనసాగుతున్నారని, తక్షణం తప్పుకోకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.కల్లూరు, సత్తుపల్లిలో కూడా బిఆర్ఎస్, సిపిఎం కలిసి పోటీ చేస్తున్నట్టు వివరించారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించిన వీరయ్య, బిఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప వారు చెప్పుకోదగిన పని ఏమీ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కూరాకుల నాగభూషణం, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, మోరంపూడి ప్రభాకర్, అమరవరపు కృష్ణారావు, సత్యనారాయణ రెడ్డి, బారతి, మోరంపూడి పాండు, రాజబాబు, మహమూద్, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా తుమ్మల యుగంధర్ పుట్టినరోజు వేడుకలు




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** కాంగ్రెస్ జిల్లా యువ నాయకుడు తుమ్మల యుగంధర్ పుట్టిన రోజు వేడుకలను రఘునాథపాలెం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం తుమ్మల యుగంధర్ పుట్టినరోజు సందర్భంగా రఘునాథపాలెం ఆపిల్ సెంటర్ వద్ద వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మథర్‌థెరిసా అనాథ్రశమంలో దివ్యాంగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సర్పంచ్ కాపా ఆదినారాయణ, నాయకులు దేవ్ సింగ్, బండి వెంకన్న, బోయనపల్లి లక్ష్మణ్ గౌడ్, కోటేష్ నాయక్, రామ్మూర్తి, పూర్ణచందర్‌రావు, మంగీలాల్, నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

విజయవంతం చేయాలని
ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి
శింగు నర్సింహారావు పిలుపు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈనెల 12న అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో సార్వత్రిక సమ్మెకు సంబంధించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శింగు నర్సింహారావు మాట్లాడుతూ నవంబర్ 21న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకే లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చారని ఆయన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లలో కార్మికుల సంక్షేమం గురించి ఎక్కడ లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి పది గంటల పని విధానాన్ని లేబర్ కోడ్‌ల ద్వారా ప్రవేశ పెట్టినట్లు ఆయన తెలిపారు. ఆరేండ్ల క్రితం ఆమోదింపజేసిన లేబర్ కోడ్‌లను ఇప్పుడు అమలు చేయడానికి గల కారణాలు ఏమిటో కార్మికులు గ్రహించాలన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పేరుతో స్వదేశీ కంపెనీలన్నింటిని విదేశాలకు అమ్మె కుట్రలో భాగమే ఈ లేబర్ కోడ్‌లన్నారు. కనీస వేతనాల చట్టం 1948, వేతనాల చెల్లింపు చట్టం 1936, బోనస్ చెల్లింపుల చట్టం 1965, సమాన ప్రతిఫల చట్టం 1976 లాంటి చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. సమాన పనికి సమాన వేతనం, సమాన ప్రతిఫల చట్టం, కనీస వేతనాల చట్టం ఈ లేబర్ కోడ్‌లలో ఊసేలేదన్నారు. లేబర్ కోడ్‌లను తీసివేయడం, ఆరు వారాల ముందు సమ్మె నోటీసు ఇవ్వడం కార్మికుల హక్కులను కాలరాయడమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. 12న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక లోకం అంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహలక్ష్మి, ఎండి జాకీరుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శి పేరబోయిన మోహన్‌రావు, జిల్లా సమితి సభ్యులు నకిరికంటి కృష్ణ, ముండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రావణ కాష్టాన్ని పారదోలారు...

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాష్ట్ర ప్రజలు పదేళ్ల రావణాసుర పాలనను అంతం చేసి, ప్రజా పరిపాలనను తెచ్చుకున్నారని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 10,11,28,29,30 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు..గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, పేదల ఇళ్ల కంటే దొరల ఇళ్లకే ప్రాధాన్యత ఇచ్చిందని, ఆరోపించారు. కీనసం హాస్టల్ విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టలేని వారు నేడు కబుర్లు చెబుతున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.22వేల500వందల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని వచ్చే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తామని వెల్లడించారు.ఏదులాపురంమున్సిపాలిటీనరి రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకుంటానని అన్నారు. మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ సమస్యలన్నీ తీరుస్తాను. తాగు నీరు, రోడ్డు, డ్రైనేజీ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాను అని భరోసా ఇచ్చారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల ప్రజలు హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

## ఐదవ వార్డులో పోటీ నుంచి తప్పకుంటున్నాం

-బిఆర్ఎస్ కూటమి అభ్యర్థికే మద్దతు



**ప్రజాపక్షం/ వైరా :** వైరా మున్సిపల్ ఎన్నికల్లో ఐదవ వార్డులో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి యర్రాబాబు తెలిపారు. ఐదవ వార్డులో బిఆర్ఎస్, సిపిఎం కూటమి అభ్యర్థి కట్టా స్వరూపరాణికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు. వైరా పట్టణ సిపిఐ కార్యకర్తల సమావేశం బుధవారం మండల కార్యదర్శి యమాల గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో యర్రాబాబు మాట్లాడుతూ వైరా మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్, సిపిఎం కూటమితో సిపిఐకి ఎన్నికల అవగాహన కుదిరిందని ఈ అవగాహనలో భాగంగా 15వ వార్డులో సిపిఐ అభ్యర్థిగా నల్లమోతు శైలజ పోటీ చేస్తుందన్నారు. మిగిలిన 19 వార్డుల్లో బిఆర్ఎస్, సిపిఎం అభ్యర్థులకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఐదవ వార్డులో పోటీ చేస్తున్న మిట్టపల్లి రాఘవరావుకు సిపిఐతో సంబంధం లేదని ఆ వార్డులోని ఓటర్లు బిఆర్ఎస్ అభ్యర్థి కట్టా స్వరూపరాణి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని యర్రాబాబు కోరారు. స్థానిక పరిస్థితులు పార్టీ జిల్లా సమితి ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ కార్యకర్తలు వైరా మున్సిపల్ పరిధిలో బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని బాబు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి ముటకొండ, పట్టణ నాయకులు గారపాటి అశోక్, దొబ్బల కృష్ణ, రామకృష్ణ, తగరం గురుమూర్తి, ఎస్‌కె జాని పాల్గొన్నారు.

# ఉన్నతస్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ మధిర :** విద్యార్థులు మంచిగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి అని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ సామాజిక ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ వివక్ష లేని సమాజం తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి రిపోర్టును ఫిబ్రవరి 4 2025న అసెంబ్లీలో ప్రవేశపెట్టిందని అన్నారు. కుల, మత విబేధాలు లేకుండా ప్రతిఒక్కరూ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40శాతం పెంచడం జరిగిందని, పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడం కోసం సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టిందన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వ గురుకులాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని అన్నారు. విద్యా సంస్థల్లో నేడు పిల్లలు చదువుతున్నారని, అనేక ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన ల్యాబ్, క్రీడలు ఆడేందుకు వసతులు మన గురుకులాల వద్ద ఉన్నాయని తెలిపారు. పిల్లలు ఉన్నతస్థాయికి చేరుకోవమే తల్లిదండ్రులకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి అవుతుందని, భవిష్యత్‌లో ఎట్టి పరిస్థితుల్లో రిగ్రెట్ ఫీల్ కాకుండా ఉండాలని అన్నారు. చదువు, క్రీడలు, మనం చేసే పనిలో పిల్లలు తమ ఎనర్జీని నూరుశాతం అందించాలని అన్నారు. విజయం వెంటనే రాదని, అనేక ఓటములు అడ్డంకులను అధిగమిస్తే నుంచి విజయం సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉతీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు.

**అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి**

అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొని మండలంలోని ప్రగతి పనులను త్వరితగతని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఎర్రుపాలెంలో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను తనిఖీ చేసి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి అనుకున్న సమయానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు నర్సింహారావు, ఎర్రుపాలెం మండల తహశీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపిడిఓ సురేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నతనం నుంచే మంచి విలువలు అందించాలి


గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన
అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చిన్నతనం నుంచే పిల్లలకు మంచి విలువలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా సాధికారిక కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలికల దినోత్సవ వేడుకల సందర్భంగా బాలల సదనం పిల్లలు స్వాగతం స్వాగతం అంటూ చేసిన నృత్య ప్రదర్శన, ఖమ్మం అర్బన్ రూరల్ ప్రాజెక్టు అంగన్‌వాడీ పిల్లలు వెల్‌బేబీ షో ప్రదర్శన ఆకట్టుకున్నాయి. గుట్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై కెజిబివి విద్యార్థినిలు నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో చిన్నారి అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి విద్యా సంస్థల్లో పర్యటించి పిల్లలకు చిన్నతనంలోనే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించామన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై ప్రతి ఇంట్లో పిల్లలకు మనం అవగాహన కల్పించాలని పిల్లలు ప్రతి విషయం మనతో పంచుకునేలా వారికి స్వేచ్ఛ కల్పించాలన్నారు. ఇంట్లో ఉన్న మగ, ఆడ పిల్లలకు సమానంగా చూడాలని ఇతరులను ఎలా గౌరవించాలో నేర్పించాలన్నారు. చిన్నతనం నుంచే సెల్‌ఫోన్‌ను పిల్లలకు అలవాటు చేయవద్దన్నారు. పిల్లల పెంపకంలో ప్రతి దశలో తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. మంచి చదువుతో పాటు సంస్కారం కూడా ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే ఇతరులను గౌరవిస్తూ సమానత్వంతో ఎలా జీవించాలో నేర్పాలన్నారు. మన ప్రవర్తన నుంచి పిల్లలు చాలా నేర్చుకుంటారని తెలిపారు. పిల్లల మధ్య ఎటువంటి తేడాలు చూపకుండా పెంచాలని సూచించారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అదనపు కలెక్టర్ చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి వెల్పుల విజేత, సిడబ్ల్యూసి ఛైర్మన్ భారతి, ప్రతినిధులు, సిడిపివో, డిహెచ్ ఈడబ్ల్యూ సమ్రిన్, సంబంధిత అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## మగ్దూం ఆశయ సాధనకు కృషి

జయంతి సందర్భంగా సిపిఐ నివాళి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రముఖ ఉర్దూ కవి మగ్దూం మోహినుద్దీన్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. మగ్దూం మోహినుద్దీన్ జయంతి సందర్భంగా బుధవారం గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి బాగం హేమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం మాట్లాడుతూ నిరంకుశ పాలన నుంచి విముక్తికై సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన వీరుడు మగ్దూం మోహినుద్దీన్ అని బాగం గుర్తు చేశారు. ఆ పోరాట ఫలితంగానే నిజాం పాలన రద్దయిందన్నారు. వీరుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తి అన్నారు. మగ్దూం ఆశయ సాధన కోసం సిపిఐ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహలక్ష్మి, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, గాదె లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ప్రభుత్వపథకాలతో ఆర్థికంగా ఎదగాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తెలిపారు. సోమవారం ఎర్రుపాలెం మండలం రాజుపాలెం గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద నిర్మాణంలో ఉన్న ఒక మెగావాట్ సామర్థ్యపు సోలార్ పవర్ ప్లాంట్ పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. ప్లాంట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు, సాంకేతిక అంశాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ప్రస్తుత పనుల పురుగోతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ ఇంజనీర్స్, ప్లాంట్ నిర్మాణం, భవిష్యత్ విద్యుత్ సరఫరా అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారతకు బలమివ్వడం పథకం ముఖ్య లక్ష్యమని అన్నారు. త్వరలో పవర్ ప్లాంట్‌ను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యతతో ఎటువంటి లోపాలు లేకుండా నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. ప్లాంట్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై పూర్తి అవగాహన మహిళా సంఘాలకు కల్పించాలన్నారు. మండల సమాఖ్యకు రోజువారీ నిర్వహణపై షెడ్యూల్ ఇవ్వాలన్నారు. రిజిష్టర్ల నిర్వహణ, రీడింగ్స్ నమోదు, ప్రతి రోజు చేపట్టాల్సిన పనులపై పూర్తి అవగాహన రావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డిఆర్‌డిఓ కొండపల్లి శ్రీరామ్, రెడ్కో డ్రిస్టిక్ట్ మేనేజర్ పి.అజయ్‌కుమార్, డిఆర్‌డిఓ ఎపిడి జయశ్రీ, ఎడిఎ విజయచందర్, ఎఎంసి ఛైర్మన్ బండారు నర్సింహారావు, డిపిఎం శ్రీనివాస్, ఎపిఎం హరినాథ్, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, చైతన్య మహిళా సంఘం బాధ్యులు వి.జ్యోతి, రత్నకుమారి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటిస్తూ.. మంచిగా పనిచేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు:** సమయ పాలన పాటిస్తూ మంచి ప్రవర్తన కలిగి అందరి మన్ననలు పొందాలని అప్పుడే మనం చేసే పని సార్థకమవుతుందని దీనికోసం కలిసిమెలిసి అన్నదమ్ముల ఐక్యంగా ముందుకు సాగాలని ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు లు పిలుపునిచ్చారు బుధవారం సిపిఐ కార్యాలయంలో బోసేట్టి సంపత్ అధ్యక్షతన వైన్ షాప్ కార్మికుల అసోసియేషన్ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా వీరు హాజరై మాట్లాడుతూ కార్మికులు సమయపాలన పాటించాలని షాప్ కు టైం ప్రకారం రావాలని,షాప్ యజమానులకు అందుబాటులో ఉండాలని, మంచి ప్రవర్తన కలిగి పనిచేయాలని, సూచించారు. పనిలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల కోసం ఎఐటియూసి, సిపిఐ నిరంతరం మీకు అండగా నిలుస్తుందని, మీరు కూడా పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు అదెర్ల రాములు వైన్ షాప్ అసోసియేషన్ కార్మికులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న 'ఎస్‌బిఐటి' విద్యార్థులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భారత ప్రభుత్వ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026 పోటీల్లో తమ కళాశాలకు చెందిన సిఎస్ఈ విద్యార్థి కె. శివకౌశిక్ పాల్గొన్నట్లు ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. జాతీయ స్థాయిలో తమ విద్యార్థి పాల్గొనడం తమ కళాశాలతో పాటు జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ 2047 నాటికి యువతను శక్తివంతులుగా చేసే ఆశయంతో నిర్వహించే వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో తమ కళాశాల భాగస్వామ్యం కావడం హర్షించదగ్గ విషయమని ఆమె తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన మూడువేల మందిని జాతీయ స్థాయిలో ఐడియా ప్రదర్శించేందుకు ఆహ్వానించారని ఇందులో తమ విద్యార్థిని నిలవడం తమ కళాశాలకు గర్వకారణమని వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ పోటీలకు దేశ వ్యాప్తంగా 50 లక్షల ఐడియాలు సమర్పించారని వీరిలో మూడువేల మందిని మాత్రమే దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆహ్వానం అందిందన్నారు. భారత్ సాఫ్ట్ పవర్, కల్చరల్ డిప్లమాసీ అండ్ గ్లోబల్ ఇన్ఫ్లూయన్స్ అనే అంశానికి గాను తమ కళాశాల విద్యార్థి కొల్లు శివ కౌశిక్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థిని ప్రోత్సహించిన తల్లిదండ్రులకు కళాశాల ఇన్నోవేషన్ సెల్ బాధ్యులు డా॥ మురళీమోహన్, అశ్విని లతో పాటు విద్యార్థి శివకౌశిక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, సిఎస్ఈ విభాగాధిపతి డా॥ సుప్రియ మీనన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
05-02-2026
www.prajapaksham.in

> నటుడు ప్రభాకర్ తనయుడు చంద్రహాస్ నటించిన బరాబర్ ప్రేమిస్తా సినిమా ఈవెంట్‌లో అసభ్య కరమైన పదజాలంతో పాట పాడిన సాహిత్యం తీవ్ర వివాదం రేపింది. సమాజం మాట్లాడుకోవడానికి కూడా ఉపయోగించుకోలేని పదాలతో చంద్రహాస్ పాట పాడారు.



## ఏప్రిల్ 30న 'పెద్ది'

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం పెద్ది. ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని ఖరారు చేశారు. ఒక పక్క షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సినిమా విడుదల తేదీని ఖరారు చేశారు. ఏప్రిల్ 30న తేదీన ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే 'చికిరి చికిరి' పాట అనే పాపులర్ అయింది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ చిత్రానికి రత్నవేలు సినిమాటోగ్రఫర్ గా, నవీన్ నూలి ఎడిటర్ గా పని చేస్తున్నారు.




## 'లీడర్' సినిమా గ్లింప్స్

శరవణన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'లీడర్'. ఈ చిత్రాన్ని లెజెండ్ శరవణ స్టోర్స్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. దర్శకుడు ఆర్ ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్ పుత్ హీరోయిన్ గా నటిస్తోంది. 'లీడర్' సినిమా ఏప్రిల్ లో థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ తో వచ్చిన 'లీడర్' గ్లింప్స్ ఆకట్టుకుంటోంది. ఈ గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే విలన్ కు చెందిన 9 కంటెయినర్లు కనిపించకుండా పోతాయి. ఆ కంటెయినర్స్ కోసం విలన్ అనుచరులు వెతుకుతుంటారు. ఒక చోట 9 కంటెయినర్లు కనిపిస్తాయి. కానీ ఆ కంటెయినర్స్ డ్రైవర్స్, రౌడీలు చనిపోయి ఉంటారు. వాళ్లను వెతుక్కుంటూ వచ్చిన రౌడీలను కూడా హీరో మట్టుబెడతాడు. ఎవరు చంపారని ఆరా తీస్తే అక్కడ ఉన్న అమ్మాయి వాళ్ల నాన్న అని తెలుస్తుంది. ఏరా నువ్వు హీరోవా అని విలన్ ఫోన్ చేసి అడిగితే, అవును హీరోనేరా ఏ బిడ్డకైనా తండ్రే హీరోరా అనే డైలాగ్ తో గ్లింప్స్ ఆకట్టుకుంది.ఈ సినిమా గురించి దర్శక నిర్మాతలు మాట్లాడుతూ కొన్ని అనుకోని పరిస్థితుల్లో అండర్ వరల్ మాఫియా, పోలీసుల ఫోర్స్ మధ్య చిక్కుకున్న ఓ సాధారణ వ్యక్తి కథ ఇది. ఈ రెండు వర్గాల సంఘర్షణ మధ్య తనని తాను రక్షించుకుంటూ ఈ సాధారణ వ్యక్తి ఎలా బయటపడ్డాడు అనేది ఆద్యంత ఆసక్తికరంగా ఈ సినిమాలో ప్రేక్షకులు చూడబోతున్నారు. అని తెలిపారు. కోడి, పట్టాస్, గరుడన్ వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు ఆర్ఎస్ దురై సెంథిల్ కుమార్ 'లీడర్' చిత్రాన్ని ఒక మంచి ఎంటర్‌టైనర్ గా రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని జైపూర్, ఊటీ, జార్జియా, చెన్నై వంటి లోకేషన్స్ లో మాస్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో తెరకెక్కించారు. త్వరలోనే ఈ చిత్ర ఆడియోను విడుదల చేయబోతున్నారు.పాయల్ రాజ్ పుత్, శ్యామ్, ఆండ్రియా, సంతోష్ ప్రతాప్, లాల్, బాహుబలి ప్రభాకర్, అమృత అయ్యర్, వీటీవీ గణేష్, ఐశ్వర్య, అరంతంగి నిశా, ఐయాల్, జయమిత్రా, పత్మాన్, యోగిరామ్, ఓక్ సుందర్, మహానది శంకర్, మరియమ్ జార్జ్, ఆదిత్య కతియార్, వేల్ అరుణాచలం, నిరంజన్, శోభన్ బాబు, అశోక్ పాండియన్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్షన్ జి.దురైరాజ్, స్టంట్స్ మహేశ్ మాథ్యూ, ఎడిటింగ్ ప్రదీప్ ఇ.రాఘవ్, సినిమాటోగ్రఫీ ఎస్. వెంకటేష్మ్యూజిక్ జిబ్రాన్ వైభోద అందిస్తున్నారు.



## మార్చి 26న 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. తెలుగు సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని 2026 మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది.ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన తొలి గీతం 'దేఖ్లేంగే సాలా'లో పవన్ కళ్యాణ్ కనిపించిన తీరు కట్టిపడేసింది. లుక్, ఎనర్జీ, స్టెప్పులు పరంగా వింటేజ్ పవర్స్టార్ ను ఆవిష్కరించింది ఈ పాట. హరీశ్ శంకర్, పవన్ కళ్యాణ్ తో రూపొందించిన గత చిత్రం 'గబ్బర్ సింగ్'తో ఎంతటి సంచలనాలు సృష్టించారో తెలిసిందే. ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్'తో అంతకుమించిన సంచలనాలు సృష్టించడానికి సిద్ధమవుతున్నారు. కుటుంబాలతో కలిసి ప్రేక్షకులు థియేటర్లకు తరలి వెళ్లి, పవర్ప్యాక్డ్ వినోదాన్ని ఆస్వాదించేలా 'ఉస్తాద్ భగత్ సింగ్' రూపుదిద్దుకుంటోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. మార్చి 26న అసలుసిసలైన పవర్స్టార్ వేడుకకు సిద్ధంగా ఉండండి. పవన్ కళ్యాణ్, శ్రీలీల, రాశి ఖన్నా, పార్థిబన్ కె యస్ రవికుమార్, ఎల్ బి శ్రీరామ్, రావు రమేష్, రాంకీ, కె జి ఎఫ్ అవినాష్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, కథనం: కె. దశరథ్, రమేష్ రెడ్డి,రచనా సహకారం: ప్రవీణ్ వర్మ, చంద్ర మోహన్,కూర్పు: కార్తిక శ్రీనివాస్, కళ: ఆనంద్ సాయి,ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్లు: ఆర్. చంద్రశేఖర్, దినేష్ నరసింహన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: హరీష్ పై, ,ఫైట్స్: రామ్‌లక్ష్మ ణ్, నబకాంత్, పృథ్వీ.




## నేడు సైబర్ సెక్యూరిటీ బ్యూరో షీల్డ్ 2.0

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఐసిసిసి ఆడిటోరియంలో జరగనున్న 'షీల్డ్ 2.0' కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. జాతీయ స్థాయి సైబర్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 'సైఫర్ స్ప్రింట్' కార్యక్రమం 'బాధితులకు రక్షణ డిజిటల్ భవిష్యత్తుకు భద్రత' అనే నినాదంతో నిర్వహించనున్నారు. రాష్ట్ర సాంకేతిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు సైబర్ రంగంలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించే దిశగా ఒక కీలక అడుగుగా నిలవనుంది. ముఖ్యమంత్రి ఎ .రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అధికారికంగా ప్రారంభించనుండగా, అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పాల్గొననున్నారు. వీరితో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, డిజిపి బి. శివధర్ రెడ్డి విశిష్ట అతిథులుగా హాజరవుతారు. రాజేష్ కుమార్ ఆధునిక సైబర్ నేరాల అదుపుపై ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం చిన్నారులపై ఆన్‌లైన్ వేధింపుల అరికట్టడంపై సంపూర్ణ బెహురా నేతృత్వంలో నిపుణుల చర్చా వేదిక జరగనుంది. సాయంత్రం ఏఐ ఆధారిత పోలీసు వ్యవస్థపై తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాల ఐపీఎస్ అధికారులతో ప్యానెల్ చర్చ, అలాగే పైరసీ నియంత్రణపై సినీ రంగ ప్రముఖులతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు ఉంటాయి. దాదాపు 20 రాష్ట్రాల నుండి వివిధ స్థాయిల పోలీస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమంలో చివరగా ఐఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా సైఫర్ స్ప్రింట్ విజేతలను ప్రకటించి ప్రముఖులచే అవార్డులను అందజేస్తారు.

## మిర్చి క్వింటాల్ @ రూ.37,100

**(మొదటి పేజీ తరువాయి)** క్వింటాల్‌కు రూ.30,000 నుండి రూ. 37,000 వరకు, దేశీ రకం మిర్చికి క్వింటాలు రూ.35,000 నుంచి రూ.41,000 వరకు ధర లభిస్తోంది. ఈ ఏడాది మిర్చి విస్తీర్ణం తగ్గడం వల్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు తెలిపారు. గడిచిన కొన్ని రోజులుగా మిర్చికి ధరలు పెరుగుతున్నాయని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి మల్లేశం తెలిపారు.

## బుల్లెట్ రైళ్ళిచ్చాం

**(మొదటి పేజీ తరువాయి)**

హామీలని ఇచ్చారని ఆయన విమర్శించారు. గడిచిన 2 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా ఘోరంగా విఫలం చెందిందని సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నేతలంతా కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారని ప్రజల పై రేవంత్‌రెడ్డి రాహుల్ (ఆర్‌ఆర్‌ఆర్) టాక్స్ రుద్దుతున్నారని ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఏమాత్రం తీసిపోని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వంపై దేశ వ్యాప్తంగా ప్రజలకు ఆదరణ పెరుగుతుందని దానికి నిదర్శనలు ఎక్కడా ఎన్నికలు జరిగిన బిజెపి జెండా ఎగురవేయడమేనని ఆయన అన్నారు. తెలంగాణ భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికల్లో బిజెపిని ఆదరించాలని అభివృద్ధికి పట్టం కట్టాలని ఆయన కోరారు. కూర్చీ కోసం అధికారం కోసం బిజెపి తెలంగాణలో అధికారంలోకి రావాలని కోరడం లేదని తెలంగాణ భవిష్యత్తు కోసం మాత్రమేనని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశం పై విధించిన ఆర్థిక ఆంక్షాలు తగ్గిస్తే కూడా గగ్గోలు పెట్టే నేతలు ఉన్నారని దేశం ధర్మం పట్ల ఎవరికైతే నిబద్ధత ఉందో వారినే రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని అందుకు కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, స్థానిక ఎంపీ డికె అరుణ, ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు కే.లక్ష్మ ణ్, బిజెపి సీనియర్ నాయకులు సి.రాంచంద్రారెడ్డి, శాంతికుమార్, ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

## త్రైపాక్షిక చర్చలు షురూ

**(మొదటి పేజీ తరువాయి)**

ఎయిర్‌పోర్ట్‌లో దిగి తన బసకు చేరుకున్నారు. ఆయనతోపాటు ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ కూడా ఈ చర్చల్లో పాల్గొంటారు. అబుధాబిలో ఇంతకుముందు రెండు విడతల చర్చల్లో పాల్గొన్న రష్యా ప్రతినిధి బృంద సభ్యులే ఈసారి కూడా చర్చల్లో పాల్గొంటారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ చెప్పారు. రష్యా జాతీయ భద్రత, రక్షణశాఖ కార్యదర్శి రుస్టెమ్ ఉమెరోవ్ ఈ చర్చల్లో ప్రధానపాత్ర వహిస్తారు. అబుధాబిలో త్రైపాక్షిక చర్చలకు ఒకరోజు ముందు రష్యా–ఉక్రేన్ మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఇంతకు ముందు జనవరి 23 24 తేదీలలో రెండు రోజుల పాటు ఇదే నగరంలో మొదటి విడత త్రైపాక్షిక చర్చలు జరిగాయి.

**ఉక్రేన్‌లో పశ్చిమదేశాల ఉనికిని సహించేది లేదు**

ఉక్రేన్‌లో శాంతి దళాల పేరుతో పశ్చిమ దేశాలు–నాటో సైన్యం ఉనికిని సహించేదిలేదని రష్యా స్పష్టం చేసింది. ఉక్రేన్‌కు శాంతి దళం పేరుతో పాశ్చాత్య సైన్యాని పంపే అలోచన ముందుకు తెచిన నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టోకు రష్యా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా దీటుగా సమాధానం చెప్పారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రేన్‌లో నాటో దళాలకు సమ్మతించేదిలేదని, తీవ్రంగా ప్రతిఘటిస్తామని చెప్పారు. ఈ విధంగా సైన్యాలను మోహరించడం సైనిక లక్ష్యాలపై దాడులు చేయడం కోసమేనని అన్నారు. ఉక్రేన్‌కు నాటో కూట మి సభ్యత్వాని, ఉక్రేన్‌లో నాటో దళాల ఉనికినీ రష్యా మొదటి నుండీ తిరస్కరిస్తోంది. ఈ సమస్యను రష్యా రాజకీయ లేదా సైనిక మార్గాలలో పరిష్కరిస్తుందని జఖరోవా అన్నారు.

## భారీ అవినీతి తిమింగలం

**(మొదటి పేజీ తరువాయి)**

అధికారులు భారీ లంచం వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. కూకట్‌పల్లి జోన్‌కు చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఇ) పొద్దులూరి చిన్నారెడ్డి, ఆయన కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ బాలసాని ప్రవీణ్ కుమార్ లంచం తీసుకుంటూ బుధవారం ఎసిబికి చిక్కారు. ఫిర్యాదు దారుడు చేపట్టిన పనులను ధృవీకరించి, సుమారు రూ.1.40కోట్ల బిల్లులను జోనల్ కమిషనర్‌కు పంపించి ఆమోదం పొందేందుకు లంచం ఇవ్వాలని డిమాండ్‌డ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో రూ.15 లక్షల లంచంను కంప్యూటర్ ఆపరేటర్ ద్వారా స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ రంగారెడ్డి రేంజ్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరినీ పట్టుకున్నారు.లంచం మొత్తాన్ని కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ కుమార్ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను అవినీతిగా, అనైతికంగా నిర్వహించి అక్రమ లాభం పొందినందుకు గాను ఇద్దరిపై కేసు నమోదు చేశారు.అనంతరం నిందితులను నాంపల్లిలోని అదనపు ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు ఇంకా విచారణలో ఉందని ఎసిబి అధికారులు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచినట్లు స్పష్టం చేశారు. మరో వైపు బండ్ల గూడా డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శివప్రసాద్ ఎసిబి వలలో చిక్కాడు. పాఠశాల ఎస్ఎస్‌సి పరీక్షా కేంద్రాల జాబితా నుంచి తొలగించకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసిన ఆయనను ఎసిబి సిటీ రేంజ్–2 అధికారులు బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఫిర్యాదుదారుడి పాఠశాలను ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షా కేంద్రాల జాబితాలో కొనసాగించేందుకు రూ.10,000 లంచం డిమాండ్ చేసిన శివప్రసాద్, అదే మొత్తాన్ని తన కార్యాలయంలో స్వీకరిస్తున్న సమయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. నిందితుడి వద్ద నుంచి లంచం మొత్తం స్వాధీనం చేసుకున్నారు.ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన బాధ్యతను విస్మరించి, అక్రమ లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు ఎసిబి అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు శివప్రసాద్‌ను అరెస్టు చేసి, నాంపల్లిలోని అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచనున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## ఉత్పత్తులకు పూర్తి రక్షణ

**(మొదటి పేజీ తరువాయి)**

ఒప్పందంపై పూర్తి వివరణ ఇవ్వాలని ప్రతిపక్షాలు ప్రభుత్వా న్ని డిమాండ్ చేసినప్పటికీ ఉభయసభల్లో సభాధిపతులు ప్రతిపక్ష ఎంపీలకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. దేశ వ్యవసా య రంగాన్ని మోదీ ప్రభుత్వం ఈ ఒప్పందం ద్వారా అమెరికాకు తాకట్టుపెట్టిందని ప్రతిపక్షాలు తీవ్ర విమర్శ చేస్తున్నప్పటికీ అధికార పక్షం నుండి సరైన వివరణ రాలేదు. ఈ ఒప్పందంవల్ల ప్రపంచంకోసం మేక్ ఇన్ ఇండియా దార్శనికతకు, ప్రపంచంకోసం భారత్‌లో డిజైనింగ్‌కు, తద్వారా నవభారత్ లో నూతన ఆవిష్కరణకు ఒక బలమైన మద్దతు లభిస్తుంద న్నారు. ఈ ఒప్పందం వల్ల రెండు దేశాల సంబంధాలూ బలపడతాయని, 2047లో వికసిత్ భారత్ దిశగా మన ప్రయా ణం పురోగమిస్తుందని మంత్రి పార్లమెంటులో ప్రకటించారు. రెండు బలమైన ప్రజాస్వామ్యదేశాలమధ్య ఈ ఒప్పందబలం ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తుందన్నారు. ఉమ్మడిగా సంపద పెంచేందుకు సహజభాగస్వాములుగా ఉంటాయన్నారు. సోమవారం సాయంత్రం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రం ప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం గురించి ఒక ప్రకటన చేశా రు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సోషల్ మీడియా వేదికగా దీనిపై పోస్టింగులు పెట్టారు. ఈ విషయాలపై పార్లమెంటు ఉభయసభలకు పూర్తి వివరణ ఇవ్వాలని, ఒక ప్రకటన విడుదల చేయాలని అనేక ప్రతిపక్షాలకు చెందిన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మంగళవారం చేసిన వ్యాఖ్యలతో అధికార–ప్రతిపక్షాలమధ్య తీవ్ర వాగ్వాదంవల్ల సభ పదే పదే వాయిదా పడింది. ఈ పరిస్థితులమధ్య బుధవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయం తర్వాత కేంద్రమంత్రి పీయూశ్ గోయల్ లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ, 2025 ఫిబ్రవరిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమెరికా పర్యటన తర్వాత రెండు దేశాలకూ పరస్పర ప్రయోజనకర, సమతుల్య, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవాలనే లక్ష్యంతో విడతలవారీగా చర్చలు కొనసాగించాయని చెప్పారు. గత ఏడాది అంతా వివిధ స్థాయిల్లో రెండు దేశాలకు చెందిన సంప్రదింపుల బృందాలు విరామంలేకుండా చర్చల్లో పాల్గొని ఒప్పందాల ఖరారుకు కృషి చేశాయని చెప్పారు. ఇచ్చిన వివిధ ప్రయోజనాలు,ప్రాముఖ్యలమేరకు ఇరు దేశాల ఆర్థికవ్యవస్థలూ అత్యుత్తమైన ఒప్పంద ఫలితాలు రావాలనే కోరుకుంటారని, తమ తమ కీలక రంగాలను కాపాడుకుంటూనే ఉత్తమస్థాయి ఒప్పంద భరోసాకోసమే ఎదురు చూడటం అత్యంత సహజమైన విషయమని మంత్రి అన్నారు.

ప్రత్యేకించి మన వ్యవసాయం,పాడిపరిశ్రమరంగాల ప్రయోజనాలు పరిరక్షించేవిధంగా ఈ ఒప్పందంలో భరోసా ఉందన్నారు. అమెరికావైపు నుండి కూడా ఈ విషయంలో వారు సున్నితంగానే వ్యవహరించారన్నారు. 'మొన్న (సోమవారం) డోనాల్డ్ ట్రంప్ ఫోన్ ద్వారా ప్రధానమంత్రితో అనేక ద్వైపాక్షిక,అంతర్జాతీయ ప్రాముఖ్యతగల అంశాలపై చర్చించారు. ఆ తర్వాత డోనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించారు, అందువల్ల గౌరనీయమైన పార్లమెంటు ఉభయసభల్లో సభ్యులకు నేను చెప్పాలనుకుంటున్నది ఏమిటంటే, మనదేశ ఆహార, వ్యవసాయ ఉత్పత్తులకు పూర్తి రక్షణలు ఉన్నాయి' అని రాజ్యసభ, లోక్‌సభల్లో వేరువేరుగా గోయల్ ప్రకటనలు చేశారు. ఉభయసభల్లోనూ మార్పులేకుండా ఒకటే ప్రకటన చేశారు. ఇక తదుపరి దశలో రెండు దేశాలూ అవసరమైన సాంకేతిక ప్రక్రియను పూర్తి చేసేందుకు పత్రాలపై సంబంధిత ఒప్పందాన్ని ఖరారు చేయాల్సి ఉంటుందన్నారు. అనేక దేశాలపై ట్రంప్ సుంకాలు విధించారు. చైనాతో పోలిస్తే భారత్‌పై తక్కువ సుంకాలు విధించానని ట్రంప్ సోమవారంనాడే స్థానిక పాత్రికేయులకు చెప్పారు. ఇది అనేక ఇతర దేశాలకంటే భారత్‌కు అత్యుత్తమమైన ఒప్పందమన్నారు.

## రూ.1.07కోట్లు కాజేత

**(మొదటి పేజీ తరువాయి)** అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి వి.అరవింద్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే 'ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులమంటూ ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తులు, బాధితుడి ఆధార్ కార్డు అక్రమ కార్యకలాపాలకు వాడబడిందని, మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ చేస్తామని బెదిరించారు. భయపడిపోయిన బాధితుడిని వీడియో కాల్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, అరెస్ట్ నుండి తప్పించుకోవాలంటే నగదు డిపాజిట్ చేయాలని నమ్మించి, విడతల వారీగా సుమారు రూ.1,07 కోట్లు కాజేశారు. దీనిపై హైదరాబాద్‌కు చెందిన బాధిత వ్యక్తి(62) సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు గురుదీప్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. ఢిల్లీలో ట్రావెల్, మనీ ఎక్స్ఛేంజ్ వ్యాపారం నిర్వహిస్తున్న గురుదీప్ సింగ్ తన సహచరులతో కలిసి ఒక ముఠాగా ఏర్పడి, అమాయకుల పేరుతో కరెంట్ బ్యాంక్ ఖాతాలను సేకరిస్తుంటాడు. బాధితుల నుండి వచ్చే డబ్బును ఈ ఖాతాల్లోకి మళ్లించి, ఆపై ప్రధాన నిందితులకు (కింగ్ పిన్స్‌కు) అందజేస్తుంటాడు' అని అరవింద్ బాబు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే దీపక్ గెహ్లోవత్‌తో పాటు ప్రశాంత్ కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. సైబర్ క్రైమ్ ఎసిపి ఆర్.జి. శివ మారుతి పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ కె. ప్రసాదరావు బృందం చాకచక్యంగా వ్యవహరించి ఈ నిందితుడిని పట్టుకున్నారని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలి, లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

## రాష్ట్రపతి పాలన ఎత్తివేత

**(మొదటి పేజీ తరువాయి)** ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతకుముందు మణిపూర్ ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా ఖేమ్‌చంద్ ఎన్నికయ్యారు. ఢిల్లీలోని మణిపూర్ భవన్‌లో రాష్ట్ర ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాల భేటీ జరిగింది. బిజెపి, ఎన్‌పిపి, ఎన్‌పిఎఫ్ ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు హాజరయ్యారు. వారంతా ఖేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. అటు మంగళవారం మణిపుర్ బిజెపి ఎమ్మెల్యేలు ఢిల్లీలోని తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమై ఖేమ్‌చంద్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. తైక్వాండోలో ప్రావీణ్యమున్న ఖేమ్‌చంద్ 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022లో బీరెన్‌సింగ్ సర్కారులో మంత్రిగా నియమితులయ్యారు. మణిపుర్‌లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ సత్సంబంధాలు కలిగి ఉండటం ఖేమ్‌చంద్‌కు కలిసొచ్చినట్లు తెలుస్తోంది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com